తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 87 పేజీలు: 12 వెల: 6.50



GOVERNMENT OF ANDHRA PRADESH

## భారత నెక్స్ట్ ఏఐ గమ్యానికి ఆంధ్రప్రదేశ్ స్వాగతం పలుకుతోంది.

ఏఐ హబ్ కు శంకుస్థాపన:
స్వచ్ఛమైన గ్రీన్ ఎనర్జీ తో కూడిన కంప్యూటింగ్, కనెక్టివిటీ, కవరేజ్ ఒకే చోట.



శ్రీ నారా లోకేష్
గౌరవనీయులైన ఐటీ మంత్రి ఆంధ్రప్రదేశ్

శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్
గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి

శ్రీ నారా చంద్రబాబు నాయుడు
గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

శ్రీ నరేంద్ర మోదీ
గౌరవనీయులైన భారత ప్రధానమంత్రి

శ్రీ అశ్వినీ వైష్ణవ్
గౌరవనీయులైన కేంద్ర రైల్వే; ఇన్ఫర్మేషన్ & సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ; ఎలక్ట్రానిక్స్ & సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ

శ్రీ కింజరపు రామ్మోహన్ నాయుడు
గౌరవనీయులైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

adaniconnex Your Growth. Our Priority. | Google Cloud | nxtra by airtel



విశాఖ నగరం ఏఐ హబ్ గా ప్రపంచ వేదిక పైకి అడుగుపెడుతోంది. నెక్స్ట్ లెవెల్ ఏఐ, హైపర్ స్కేల్ క్లౌడ్ సామర్థ్యాలతో ఈ హబ్ సిద్ధం అవుతోంది. హరిత ఇంధనం తో నడిచే హై డెన్సిటీ కంప్యూటింగ్, అత్యుత్తమ స్థాయి కనెక్టివిటీ, ఇతర మౌలిక సదుపాయాలు ఈ ఏఐ హబ్ సొంతం. ఈ భారీ పెట్టుబడి తో డిజిటల్ మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణలకు కేంద్రంగా ఏపీ మారుతుంది.

రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి | 1 గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్

- హరిత విద్యుత్ తో నడిచే మౌలిక సదుపాయాలు
- ఏఐ క్లౌడ్ వర్క్‌లోడ్ కోసం అత్యుత్తమ కనెక్టివిటీ
- ఏపీకి ఉద్యోగాలు – నైపుణ్యాలు – ఆవిష్కరణలు

శంకుస్థాపన కార్యక్రమం | మంగళవారం 28, ఏప్రిల్, 2026. ఉదయం 9.30 గంటల నుంచి. | వేదిక: తర్లువాడ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్

#ChooseSpeedChooseAP



సోమవారం కూర్మనాథుని సేవలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

# ఆదిత్యుని సన్నిధిలో ఉపరాష్ట్రపతి

## శ్రీకూర్మనాథుని సేవలో పాల్గొన్న రాధాకృష్ణన్

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసంలో ఆత్మీయ విందు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ జిల్లా పర్యటన సోమవారం ఆధ్యాత్మికంగా, అత్యంత ఆత్మీయంగా సాగింది. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడంతో పాటు కేంద్ర మంత్రితో ఉన్న పాత అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ముందుగా డచ్ బంగ్లా హెలిప్యాడ్ వద్ద ఉపరాష్ట్రపతికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి మిల్లు జంక్షన్ మీదుగా కాన్వాయ్‌లో నేరుగా శ్రీకూర్మ క్షేత్రానికి చేరుకున్నారు. లోకైక ఏకైక కూర్మ రూప క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అరసవల్లిలో ఆశీర్వచనం:** అనంతరం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం లభించింది. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు వేద మంత్రోచ్ఛారణల మధ్య తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఇంద్ర పుష్కరణిలో జరుగుతున్న నూతన నిర్మాణ పనులను స్వయంగా వెళ్లి దగ్గరుండి పరిశీలించారు. పర్యటనలో భాగంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడికుదుటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు తదితరులు ఉపరాష్ట్రపతిని గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

**మంత్రి నివాసంలో ఆత్మీయ సమావేశం:** ఆలయాల దర్శనం అనంతరం ఉపరాష్ట్రపతి నేరుగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రముఖులు ఆయనను పలకరించారు. ఈ సందర్భంగా దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎర్రన్న సతీమణి విజయకుమారి, సోదరుడు కింజరాపు ప్రభాకరరావులను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సుమారు గంటన్నర పాటు గడిపిన ఆయన, అక్కడి నుండి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఉపరాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పర్యటన అంతా ప్రశాంతంగా ముగిసింది.



కేంద్రమంత్రి రామ్మోహనాయుడు నివాసానికి విచ్చేసిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

# వర్సిటీలకు దిక్సూచి ఏయు

>> యూనివర్సిటీ అనుసంధానం కావాలి. మీరు ఉద్యోగం చేయడం కాదు, పది మందికి ఉద్యోగం ఇచ్చే శక్తి మీకు రావాలి దీనికి సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్టాత్మక కార్యక్ర మాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన మరో చరిత్ర. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారంటే రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. ఏయూ 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ సమావేశం ఏయూలో నిర్వహించాం. అదీ ఏయూ ప్రత్యేకత. 53 యూనివర్సిటీలు రాష్ట్రంలో ఉన్నాయి... అన్నింటికీ ఏయూ దిక్సూచి, లీడర్. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఈ యూనివర్సిటీ వచ్చింది. జైపూర్ రాజ్ విక్రమ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజులు ఈ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. వారిని మనం స్మరించుకోవడం ధర్మం, బాధ్యత. కట్టమంచి రామలింగారెడ్డి ఏయూకు మొదటి వీసీగా చేసి బలమైన పునాది వేశారు. ఆయన కూడా చిత్తూరు జిల్లా వాసే... నేనూ చిత్తూరు జిల్లా నుంచి వచ్చి వందేళ్ల ఉత్సవంలో పాల్గొన్నాను. 2వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణ దేశ రాష్ట్రపతి అయ్యారు. ఈ రోజు మన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి రాధాకృష్ణ అభిమాని. ఈయనకు రాధాకృష్ణన్ అని పేరు పెట్టారు. కేవలం చదువు చెప్పడమే కాదు... తెలుగు వైభవానికి ఏయూ కృషి చేస్తోంది. విద్య, సాహిత్య, కళా రంగాల్లో ప్రముఖులను కళా ప్రపూర్ణ అవార్డుతో గౌరవిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఏయూ నుంచే వచ్చారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడి నుంచే వచ్చారు. ప్రపంచంలోని చాలా యూనివర్సిటీల్లో ఇక్కడ చదువుకుని వెళ్లిన వారు ప్రొఫెసర్లుగా చేస్తున్నారు. న్యాక్ ఏ ప్లస్ ప్లస్‌ను ఏయూ సాధిస్తోంది. ఎన్ఐఆర్ఎఫ్‌లో 41వ ర్యాంక్, పబ్లిక్ సెక్టార్‌లో 5వ ర్యాంక్‌లో ఉంది. అన్ని యూనివర్సిటీల్లో విద్యాశాఖామంత్రి, గవర్నర్ ప్రతిభ ఉన్నవారిని వీసీలుగా ఎంపిక చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా వారిని అభినందిస్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెట్రాలజీతో ఎంఓయూలు కుదుర్చుకున్నాం. నాకు 76 ఏళ్లయినా.. నేను 26 ఏళ్ల యువకుడిలానే ఆలోచిస్తాను. ఒకప్పుడు మనం ఐటీ ప్రారంభించాం హైటెక్ సిటీ కట్టాం. నాలెడ్జ్ ఎకానమీకీ దోహదం చేశాం. నేడు డేటా సెంటర్, ఏఐ, క్వాంటం తీసుకొచ్చాం. వీసీని కోరుతున్నా... ఏయూకు బ్రాండ్ ఉంది. మీరు అడిగితే ప్రపంచంలోని చాలా యూనివర్సిటీలు మీతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి చదువు. చదువుతో ప్రపంచాన్ని జయించే ఆత్మవిశ్వాసం వారికి వస్తుంది. ఏయూ చాలా సుందరమైన ప్రాంతం. ఒత్తిడి ఉన్నప్పుడు సముద్ర తీరంలో కాసేపు నడిస్తే సేదతీరుతారు' అని సీఎం అన్నారు. ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు'ఏయూలో చదువుకునే వారంతా అదృష్టవంతులు. ఇక్కడ చదువుకుంటే ఎంత బావుటుందో అనే ఆలోచన మళ్లీ నాకూ వస్తోంది. ఉపకులపతికి లక్ష్యం నిర్దేశిస్తున్నాం... ఏయూ దేశంలో యూనివర్సిటీల్లో టాప్5 జాబితాలో ఉండాలనేది నా ఆకాంక్ష. ప్రపంచంలో 100 అత్యుత్తమ యూనివర్సిటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఉండాలి. ఈ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే నిధులు కావాలి. అందుకే రూ.500 కోట్లను ఆంధ్ర యూనివర్సిటీకి ఇస్తాం. రూ.500 కోట్ల కార్పస్ ఫండ్ వస్తుంది. ఒక్కో విద్యార్థి ఒక్కో రూపాయి చొప్పున సాయం అందించినా చాలు. ఏయూ పూర్వ విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే అవుతుంది. ఏయూ వందేళ్ల చరిత్ర రోజున చెప్తున్నా... రాబోయే వందేళ్లలో ఏయూ మరో చరిత్ర సృష్టిస్తుంది... బెస్ట్ బ్రాండ్ క్రియేట్ చేస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ముందుకొచ్చాం. తెలుగుజాతి పునర్వైభవానికి ప్రధాని మోదీ మనకు సహకరిస్తున్నారు. వారి సంకల్పం వికసిత్ భారత్ 2047. మన లక్ష్యం స్వర్ణాంధ్ర 2047. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేది మా సంకల్పం. మా సంకల్ప జైత్ర యాత్ర ఏయూ నుంచే ప్రారంభం కావాలి. పని చేసే బాధ్యత మాది, సహకరించే బాధ్యత మాది... దాన్ని నిరూపించుకునే బాధ్యత మీదే' అని విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఒడిశా గవర్నర్ హరిబాబు, కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్, మాజీ క్రికెటర్ సచిన్, దర్శకుడు త్రివిక్రమ్, మంత్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# గొప్ప పరిశోధనా కేంద్రంగా ఏయు

>> నాయకత్వం విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని కొనియాడారు. అలాగే జైపూర్ మహారాజు విక్రమ్ దేవ్ వర్మ, విజయనగరం మహారాజులు, బొబ్బిలి ఇతర సంస్థానాల సహకారాన్ని గుర్తుచేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, కేవలం డిగ్రీలు సాధించడం సరిపోదని, కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం బోధనా కేంద్రంతో పాటు పరిశోధనా కేంద్రంగా మారాలని, పరిశోధనలు క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు. పేటెంట్లపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్యూర్ సైన్సెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని అన్నారు. 202526 నాటికి దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలిచిందని పేర్కొన్నారు. వైఫల్యాలకు కుంగిపోకుండా, క్రమశిక్షణతో లక్ష్యం వైపు సాగాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. సచిన్ టెండూల్కర్ తన 100వ సెంచరీ కోసం ఎదురుచూసిన పద్ధతిని ఉదాహరణగా చూపుతూ, ఓపిక ఆత్మ విశ్వాసం విజయానికి మూలసూత్రాలని వివరించారు. సమ యాన్ని సరిగ్గా నిర్వహించే వారే విజేతలుగా నిలుస్తారని ఉద్ఘాటించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, జిఎంఆర్ సంస్థ ఫౌండర్, చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, సత్యనారాయణ, ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ లకు ఎక్స్‌లెన్సీ అవార్డుతో పాటు శతాబ్ది వేడుకల జ్ఞాపికలను అందజేశారు.

# ఆంధ్రా విశ్వవిద్యాలయం ఒక ఎమోషన్..

>> ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది, విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర. 2014లో రాష్ట్రం విడిపోయింది. కట్టుబట్టలతో మెడపట్టి మనల్ని బయటకు గెంటేశారు. రాజధాని లేదు, సచివాలయం లేదు, అసెంబ్లీ లేదు, ముఖ్యమంత్రి కూర్చోవడానికి కుర్చీ లేదు. ఆ రోజు ఆంధ్రప్రదేశ్ కు ఉన్నవి రెండే. ఒకటి ఆంధ్ర యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ మీటింగ్ పెట్టుకోవడానికి ఒక హాల్ కూడా లేదు. ఆ రోజు మొదటి కేబినెట్ మీటింగ్ ఆంధ్ర యూనివర్సిటీలో పెట్టుకున్నాం. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదటి అసెంబ్లీ సమావేశాలు కూడా ఏయూలోనే నిర్వహించారు. దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి. స్వతంత్రం రాకముందు తెలుగు ప్రజలు పోరాడి ఆంధ్ర యూనివర్సిటీ సాధించుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి ఎన్నో రికార్డ్స్ ఉన్నాయి. భాషాప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిది ఆంధ్ర రాష్ట్రం. తెలుగు ప్రజల కోసం మనం యూనివర్సిటీని ఏర్పాటుచేసుకోవడం జరిగింది. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఈ రోజు ఇక్కడ మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నాను. ఆంధ్ర యూనివర్సిటీలో చదివి ఉంటే ఎంతో బాగుండేదని. ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం ఉంది. మానసిక వికాసం మానవ జీవితానికి అత్యున్నత లక్ష్యంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. సీఆర్ రెడ్డి మొదటి వైస్ ఛాన్స్‌లర్ గా ఒక క్లియర్ డైరెక్షన్ మనకు అందించారు. తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వైస్ ఛాన్స్‌లర్ గా పనిచేశారు. ఆయన విజన్, స్పీడ్, కమిట్ మెంట్ ఆంధ్ర యూనివర్సిటీకి బలమైన పునాది వేసింది. ఎంతోమంది దాతలు ఏయూ అభివృద్ధికి సహకరించారు. భారతదేశానికే గర్వకారణంయూనివర్సిటీని సాధారణంగా విశ్వవిద్యాలయం అంటారు. కానీ మన ఆంధ్ర యూనివర్సిటీని ఆంధ్ర విశ్వకళా పరిషత్ అంటారు. ఇది అకడమిక్ విద్య, లిబరల్ ఆర్ట్స్ సమ్మిళితం. దీనికి మంచి ఉదాహరణ త్రివిక్రమ్ శ్రీనివాస్ గారు. మన ఏయూ నుంచి ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు ప్రఖ్యాత సినీ దర్శకులుగా ఆయన ఎదిగారు. ఆంధ్ర యూనివర్సిటీ చిహ్నం దగ్గర నుంచి కోర్సుల వరకు అన్నీ స్పెషల్. ఉన్నత విద్యలో భిన్నమైన ప్రోగ్రామ్స్ ను అందిస్తోంది ఆంధ్ర యూనివర్సిటీ. ఏయూలో 7 అనుబంధ కళాశాలలతో కలిపి 68 అకడమిక్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 121 అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు వివిధ పరిశోధనా కార్యక్రమాలు అందిస్తున్నారు. అదేవిధంగా ఏయూకి 304 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. సుమారు 85,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 56 దేశాల నుండి వచ్చిన సుమారు 1050 మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికి గర్వకారణం అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# పలువురు పోలీసులపై వేటు

> **హనీట్రాప్ కేసులో సంచలన నిర్ణయం**
> **ఒక హెడ్, ఇద్దరు కానిస్టేబుళ్లు డిస్మిస్, మరో సిఐ డిఐజికి అటాచ్**
> **ఓ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్**
> **సిఐ శ్రీహర్ష సర్వీసు నుండి తొలగింపు**

**అనంతపురంక్రైమ్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన హనీ ట్రాప్ కేసులో నలుగురు పోలీసు ఉద్యోగాలు ఊడాయి. ఓ ఎస్ఐ తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. మరో సిఐకి డీఐజికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దందాలో ముఠాగ్యాంగ్ తో సం బంధాలు కలిగి వారికి సంపూర్ణ సహకారాలు అందించడంతోపాటు సెటిల్మెం ట్లు, దందాలకు తెరలేపిన పోలీసు అధికారులు సిబ్బందిపై ఉన్నతా ధికారులు కొరడా ఝుళిపించారు. దీంతో అనంతపురం జిల్లాలో పెద్ద దుమారం జరిగింది. ఇందులో రాప్తాడు శ్రీహర్షను, అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్ దుర్గా ప్రసాద్, ఇటుక లపల్లి కానిస్టేబుల్ దేవలా నాయకులు సర్వీసు నుండి పూర్తిగా తొలగిం చేసినట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. అలాగే అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుళ్లు దేవేంద్ర, జయరాం నాయక్ ను పోలీసు అధికారులు సస్పెండ్ చేశారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ ను డిఐజి కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్రీ టౌన్ సీ ఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఆయనను వేకెన్సీ రిజర్వుడుకు పంపారు. ఈ కేసులో ఇప్పటిదాకా 5 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. ఇప్పటి దాకా బాధితులు ఉండి రాబట్టిన సమాచారం మేరకు నిం దితుల నుండి 13 లక్షల రూపాయలతోపాటు, రెండు కత్తులు, ఆరు సెల్ఫోన్లను స్వాధీనపరుచుకున్నారు. హనీ ట్రాప్ కేసులో పోలీసు శాఖ అత్యంత కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. హనీట్రాప్ ముఠాను నడిపించిన రంగమ్మనాయుడుతో అత్యంత సన్నిహితంగా మెలిగిన పోలీసులకు ఉద్యోగాల నుండి తొలగించడంతో పోలీ సువర్గాల్లో ప్రకం పనలు చోటు చేసుకున్నాయి. నిందితులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటంతో పాటు శ్రీహర్ష, సీఐ బాధితుల ఫిర్యాదును పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో రాప్తాడు. సీఐ శ్రీహర్షను ఉద్యోగం నుంచి తొలగిస్తూ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆ శాఖ పై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని చెప్పవచ్చు. హనీట్రాప్ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న రంగమ్మ అలియాస్ చిన్ని, మల్లీశ్వరి, ఉమాదేవిలతో వీరు సన్నిహితంగా ఉన్నట్లు విచారణలో తేలింది. నిందితుల ఖాతాల నుంచి సీఐ, కానిస్టే బుళ్ల ఖాతాలకు రూ.లక్షల్లో నగదు బదిలీ అయినట్లు రూఢీ అయ్యింది. బెంగ ళూరు జాతీయ రహదారి వెంబడి ఓ రెస్టారెంట్ కేంద్రంగా వీరు పంచాయి తీలు జరిపినట్లు వీడియో, ఆడియో ఆ ధా రా లు విచారణాధికారులు సేకరించారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు శిక్షణ ఎస్పీ అశ్విన్, తాడిపత్రి ఏఎస్పీ రోహిత కు మార్ పూర్తి స్థాయిలో విచారించి ఉన్నతాధి కారులకు నివేదిక సమర్పించారు. దీంతో పోలీసు అధికారులు కుపీ లాగారు. అనంతపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో హనీట్రాప్‌నకు గురైన కొందరు బాధితులు ఫిర్యాదు చేయడంతో అక్కడి ఎస్సై రాంబాబు నిందితులకు అనుకూలంగా పంచాయితీ చేసినట్లు విచారణలో తేలింది. కొందరు మహిళల నుంచి రాంబాబు డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలూ వచ్చాయి. ఈ విషయం ఉన్నతాధికారుల విచా రణలో నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. రహస్య విచారణ దర్యాప్తు వేగవంతంతో సాగడంతో ఇంకా ఈ ఉచ్చు ఎవరి పైన చుట్టుకుంటుందోనని పోలీసు వర్గాలు భయాందోళనకు గురవుతున్నారు. ముఠా సభ్యులతో పోలీసులు అధికారులు మాట్లాడిన కాల్ రికార్డులు, ఫోన్ సంభాషణతో అధికారులు కూపి లాగి దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగినట్లు అవగతమవుతోంది. అలాగే ఇప్పటిదాకా ధైర్యం చేసి 20 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో ఇప్పటిదాకా ఒక కోటి నాలుగు లక్షల రూపాయల మేరకు ముఠా సభ్యులు బాధితుల నుండి బలవంతంగా గుంజేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. డబ్బులు లేని పక్షాన వారి వద్ద నుండి బలవంతంగా రాయించుకున్న ప్రాంసరీ నోట్లను అధికారులు చించేసినట్లు తెలుస్తోంది. మరోవైపు బిజెపి, టిడిపి వైసిపి పార్టీలకు చెందిన కొం దరు నిందితులతో మూలాఖత్ అయి పెద్దఎత్తున అక్రమాలకు, దందాలకు, పాల్పడిన ఆయా పార్టీల అధిష్టానం ఉద్వాసన పలకడం జోరుగా చర్చలు సాగుతున్నాయి.



సోమవారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లిఖార్జున ఆలయం వద్ద తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

# మల్లన్న ఆలయంలో మంత్రి పొన్నం

**శ్రీశైలంప్రాజెక్టు, ఏప్రిల్27,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం రవాణా మరియు బిసి వేల్ఫర్ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్ శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఈఓ ఎం.శ్రీనివాసరావు,ఏఈఓ వెంకటేశ్వరరావు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండింతులు వేధాశీర్వచనములు వల్లించగా అర్చకస్వాములు తీర్థ ప్రసాదములు అందజేసారు.తదుపరి శ్రీస్వామివార్ల శేషవస్త్రములతో సత్కరించి లడ్డు ప్రసాదములు,శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను, శ్రీశైల చరిత్ర పుస్తకంను ఈఓ శ్రీనివాసరావు అందజేసారు.

# ముందుగానే నైరుతి రుతుపవనాలు

>> ముందుగానే రావడం వల్ల వేడిమి నుంచి ఉపశమనం లభించడమే కాకుండా, నేలలో తేమ పెరిగి విత్తనాల విత్తకానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. నీటి వనరులపై ఒత్తిడి తగ్గి, వ్యవసాయ కార్యకలాపాలు వేగవంతం కావచ్చు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది ఊరటనివ్వనుంది.అయితే, నైరుతి రుతుపవనాల రాకపై భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ) ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. మే మధ్యలో తమ అంచనాలను వెల్లడించనున్నట్లు ఐఎమ్‌డీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు.

# పట్టాలు తప్పిన వందేభారత్

>> డంతో స్పీడ్‌కూడా ఎక్కువగానే ఉంటుంది. ప్లాట్‌ఫామ్ సమీపంలోకి వస్తున్న సమయంలో వందేభారత్‌కోచ్‌లలో ఒకదాని చక్రాలు పట్టాలు తప్పాయి. డైమండ్‌క్రాసింగ్‌వద్దనే ఈ ఘటన జరిగింది. అయితే యుద్ధప్రాతిపదికన ఈ క్రాసింగ్‌ను మరమ్మతుచేసి పునరుద్ధరించారు. పూణెస్టేషన్‌లో యార్డు రీమోడలింగ్‌పనులు జరుగుతుండటంతో క్రాసింగ్ కొంతమేర వంగింది. అంతేకాకుండా వెంటనే సరిచేసి ప్రయాణాలకు అనువుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన కోచ్‌నుంచి ప్రయాణీకులు దిగి సమీపంలోని ప్లాట్‌ఫామ్‌పైకి పరుగులుపెట్టారు.

## గంజాయి కేసులో 27 మందికి జైలు

>> ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తూ వుంటారు. అదేవిధంగా దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలో 1.620 కేజీల గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసులో పోలీసుల కథనం ప్రకారం మంగళగిరి, విజయవాడ, దుగ్గిరాల, కాజా, అమరావతి ప్రాంతాలకు చెందిన యువకులు గంజాయి వినియోగానికి అలవాటు పడి, ఆర్థిక అవసరాల కోసం గంజాయి వ్యాపారం ప్రారంభించారని తెలిపారు.ఈ ముఠాకు చెందిన నిందితులు ఒడిశా రాష్ట్రం, రాయగడ ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తూ ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన మంగళగిరి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బ్రహ్మం , మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ , దుగ్గిరాల ఎస్సై వెంకట రవి , పోలీస్ సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ అభినందించారు.

# న్యూజిలాండ్‌తో కీలక ఒప్పందం

>> గోయల్ అన్నారు. "ఇది న్యూజిలాండ్‌కు భారతీయ ఎగుమతులకు 100 శాతం సుంకరహిత ప్రవేశాన్ని కల్పిస్తుంది. ఈ దూరదృష్టి గల ఒప్పందం భారతదేశంలోకి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సులభతరం చేస్తుందని గోయల్ అన్నారు.

**రైతులు, యువత, స్టార్టప్‌లకు చాలా మేలు: ప్రధాని మోదీ:** భారత్-న్యూజిలాండ్ సంబంధాల్లో ఇదో గొప్ప రోజు అని, ఇది ఇరుదేశాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'భారత్ న్యూజిలాండ్ భాగస్వామ్యంలో ఈరోజు ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మన రెండు దేశాల అభివృద్ధిని మరింత వేగవం తం చేస్తుంది. ఇది మనమధ్య ఉన్న నమ్మకాన్ని, ఉమ్మడి విలువలను, ఆశయా లను ప్రతిబింబిస్తోంది. ఈ ఒప్పందం వల్ల మన రైతులు, యు వత, మహిళలు, ఎంఎస్ఎంఇలు, చేతివృత్తులవారు, స్టార్టప్‌లు, విద్యా ర్థులు, ఆవిష్కర్తలకు ఎంతో మేలు చేకూరుతుంది.

# విద్యుత్ కొనుగోలు ఛార్జీలు రూ.4.60కి తగ్గింపు!

>> చర్యలన్నింటి పైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి. ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలో నైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. పొల్యూషన్ తగ్గేలా... పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028 29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగంవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శేషాచలం అగ్నిప్రమాదంపై డి.సిఎం పవన్ ఆరా

>> ప్రమాదం గురించి తెలిసిన వెంటనే యాంటి ఫైర్ స్క్వాడ్ సిబ్బంది 20 మంది, పోలీసులు, మరో 10మంది టీటీడీ సిబ్బంది మంటలను అదపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారని, సోమవారం మధ్యాహ్నంమంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అటవీ అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ యాంటి రెడ్ శాండర్స్ స్క్వాడ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ కి వెళ్లిన సమయంలో అనుమానాస్పద చర్యలపై ఓ కన్నేసి ఉంచాలి. జూన్ చివరి వరకు ఉండే వేసవిలో అటవీ ప్రాంతంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

## వారం - వర్జ్యం

28-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
ద్వాదశి సా.6.55
ఉత్తరఫల్గుణి రా.10.38
వర్జ్యం : లేదు
దు.ఉ.8.16-ఉ.9.07,
2)రా.11.31-రా.12.22
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్యక్రమాలను పూర్తిచేయగలుగుతారు. సమావేశాలలో పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగాలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. బంధువులనుండి ఆసక్తికరమైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో సొంతనిర్ణయాలు తీసుకోవడం మంచిది. సంతానపరంగా పురోగతి ఉంటుంది.

**కర్కాటకం :** జీవితభాగస్వామి సలహాతో నూతనకార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వాహనాల విషయంలో జాగ్రత్త.

**సింహం:** సంగీత, సాహిత్య, కళా రంగములలోని వారికి అనుకుల కాలము. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :** ప్రతి చిన్నవిషయానికి భావోద్రేకాన్ని కలిగిఉంటారు. సహచరవర్గానికి సహాయం అందిస్తారు.నూతన విద్యావకాశాలు కలవు.

**తుల :** బాధ్యతలు అధికమవుతాయి. అండగా నిలిచేవారు, సహాయసహకారాలు అందించేవారు కరువవుతారు.

**వృశ్చికం:** మానసికంగా కృంగిపోరు. ఆత్మస్థైర్యంతో నమన్యలతో నమరం సాగిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**ధనుస్సు:** ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. కొత్త పెట్టుబడులకు అనుకూలమైన కాలం కాదు.

**మకరం:** మాటమీద నిలబడే వ్యక్తిగా మంచి పేరును సంపాదించగలుగుతారు. ఉద్యోగులకు స్థానచలనం కలదు.

**కుంభం:** ఫైనాన్స్ రంగంలోని వారికి అనుకూలకాలం కాదు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. బంధువుల కలయిక.

**మీనం :** ఆలోచనలు పరిపరి విధాలుగా సాగుతాయి. సంతానం యొక్క పురోభివృద్ధి పైన శ్రద్ధవహించవలసి ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 87 పేజీలు: 12 వెల: 6.50



బెంగాల్‌లో ముగిసిన ఎన్నికల ప్రచారం

హర్మ్యుజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తాం: ఇరాన్

9లో


## ఆంధ్రా విశ్వవిద్యాలయం ఒక ఎమోషన్..





### ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ దాకా వర్సిటీకి ఒక ప్రత్యేకమార్క్

### ఇలాంటి ప్రాచీన వర్సిటీ అపూర్వం

### ఎయు శతాబ్ది వేడుకల్లో మంత్రి లోకేష్

**విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదని, తనలాంటి వారికి ఒక ఎమోషన్ అని, ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోజు ఒక గర్వ కారణమైన, చరిత్రాత్మక సందర్భం. శతాబ్ద కాలంగా వెలుగొందుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం గొప్పదనాన్ని జరుపుకునేందుకు మనం అందరం ఇక్కడకు వచ్చాం. ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదు నాలాంటి వారికి ఒక ఎమోషన్. తరతరాలుగా మన మనస్సుల్లో మెదులుతోంది. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కి హృదయపూర్వక స్వాగతం పలకడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ సేవాగుణం, నిష్ట,ప్రజాసేవ పట్ల మీ అంకితభావం తరతరాలకు ప్రేరణగా నిలుస్తోంది. అదేవిధంగా ఏపీ గవర్నర్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కి కూడా హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాం. మీ మార్గదర్శకత్వం, నాయకత్వం ఈ గొప్ప సంస్థను మరింత బలపరుస్తోంది. అదేవిధంగా లక్షలాది హృదయాలను గెలుచుకున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. క్రమశిక్షణ, అంకితభావానికి, ప్రతిభకు ఆయన నిదర్శనంగా నిలుస్తారు. దార్శనిక నేత, గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి స్వాగతం. విద్యే అభివృద్ధికి పునాది అని ఆయన విశ్వసిస్తారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ హరిబాబుకి, ఇక్కడకు విచ్చేసిన ఇతర >>2

# వర్సిటీలకు దిక్సూచి ఎయు





సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్లు అబ్దుల్ నజీర్, హరిబాబు, కేంద్రమంత్రులు పెమ్మసాని, రామ్మోహన్‌నాయుడు, సిఎం చంద్రబాబు తదితరులు

### యువత జాబ్ సీకర్స్‌కాదు.. క్రియేటర్లు కావాలి

### గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖకు కొత్తచరిత్ర

### ఎయు అభివృద్ధికి రూ.500కోట్లు

### వర్సిటీ శతాబ్దివేడుకల్లో సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** యూనివర్సిటీలు డిగ్రీలు ఇచ్చే విద్యా కేంద్రాలు మాత్రమే కాదని సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలకు వేదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. యూనివర్సిటీలు జాతీయ ఆస్తులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. విశాఖలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పాల్గొన్నారు. యూనివర్సిటీలో రూ.64 కోట్లతో చేపట్టిన ఏయూ ఐ ఫ్యాక్టరీ, నెట్వర్క్ సెంటర్‌ను ప్రారంభించారు. మరో రూ.112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్, కాన్వకేషన్ హాలుతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలివిద్యార్థులు, పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా రోజులు మారాయి.. సాధారణ మనుషులు అసాధారణ శక్తిగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లపై యువత దృష్టి పెట్టాలి. పారిశ్రామిక రంగానికి >>2

## గొప్ప పరిశోధనా కేంద్రంగా ఎయు

### ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

**విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన శతాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ గురువులందరికీ నా వందనాలని, వారి మార్గదర్శకత్వం వల్లనే నేను ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం తనకు బలమైన పునాదిని అందించిందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడిన మహానుభావులను స్మరించుకున్నారు. సి. ఆర్.రెడ్డి దార్శనికత, సర్వేపల్లి రాధాకృష్ణన్ >>2

## ఇన్ఫోసిస్‌కు విశాఖలో 20 ఎకరాలు

**విజయవాడ,ఏప్రిల్ 27, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు విశాఖపట్నంలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో ఇన్ఫోసిస్ తన కేంపస్‌ను ఇక్కడ విస్తరించనుంది. ఈ కొత్త కేంపస్ ద్వారా ప్రారంభ దశలోనే సుమారు 7 వేల మంది సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, ఐటీఈఎస్ కేంపస్ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ రంగాల్లో విశాఖ గ్లోబల్ సెంటర్‌గా మారనుంది. ఇన్ఫోసిస్ వంటి గ్లోబల్ బ్రాండ్ రాకతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడటమే కాకుండా, మరిన్ని అనుబంధ సంస్థలు విశాఖ వైపు చూసే అవకాశం ఉంది.

# పెట్రోలు కొరత రానివ్వొద్దు

### కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు

### ఆయిల్ కంపెనీలు తమ పాలసీలు మార్చుకోవాలి

### పరిస్థితిపై ప్రతి 3గంటలకు నివేదిక ఇవ్వండి

### ఇంధన సంక్షోభంపై సిఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

**విజయవాడ,ఏప్రిల్ 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్యకు సంబంధించి అత్యవసరంగా సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. డిమాండ్‌కు తగిన సప్లయ్ ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. సమస్యను చక్కదిద్దేందుకు టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయిల్ కంపెనీలు అప్పటికప్పుడు పాలసీలు మార్చి ఇబ్బంది పెడితే ఎలా అంటూ ఆవేశపడ్డారు. వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని సీఎం సూచించారు. సమస్య పరిష్కారానికి నిన్న రాత్రి నుంచి ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై వివరణ కోరిన సీఎం చంద్రబాబు.సోమవారం సాయంత్రానికి మెజారిటీ ప్రాంతాల్లో సాధారణ స్థితి ఏర్పడుతుందని అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పెట్రోల్, డీజిల్ ముఖ్యమంత్రికి వివరించారు.సరఫరాలో సాధారణ పరిస్థితిని తెచ్చేందుకు అధికారులు, ఆయిల్ కంపెనీల యాజమాన్యాలు సమన్వయంతో పని చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉదయం డిస్పాచ్ సెంటర్ల నుంచి వెళ్లిన ఆయిల్ ట్యాంకర్లు ఈ రోజు సాయంత్రం వరకూ రిటైల్ బంకులకు చేరుకుంటాయని తెలిపిన ఆయిల్ కంపెనీల ప్రతినిధులు స్వయంగా కలెక్టర్లు, ఎస్పీల పర్యవేక్షణలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయిల్ సరఫరా జరిగేలా చూడాలని అన్నారు.కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఆయిల్ డిస్పాచ్ సెంటర్లకు వెళ్లి సరఫరాను పర్యవేక్షించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో పరిస్థితులపై ఆర్టీజీ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి ప్రతీ 3 గంటలకు ఒకసారి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు, మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు.మీడియా, సోషల్ మీడియాలో వస్తోన్న కథనాలు, క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా అధికారులు స్పందించాలని ముఖ్యమంత్రి సూచించారు.సంబంధించిన అంశంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.సమస్య 3 రోజుల క్రితమే గుర్తించామని అధికారులు చెప్పారు. అలాంటప్పుడు గుర్తించినప్పుడు పరిస్థితిని ఎందుకు చక్కదిద్దలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కంపెనీలు రిటైల్ ఔట్ లెట్లకు ఇంతకు మందులా క్రెడిట్ ఇవ్వట్లేదని అధికారులు తెలిపారు. క్రెడిట్ ఎందుకు ఇవ్వట్లేదని హెచ్‌పిసిఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. కంపెనీలు, రిటైల్ ఔట్‌లెట్ల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు.ప్రజల్ని, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అనుమతుల విషయంలో పునరాలోచన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అయిల్ కంపెనీల అసంబద్ధ నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందిపడితే సహించేది లేదని తేల్చిచెప్పారు. ప్రజల నిత్యావసరాలకు సమస్య తలెత్తిన తర్వాత ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో తనకు నివేదికలు ఇవ్వడం కాదని ఫలితాలు చూపించాలని స్పష్టం చేశారు. ప్రైవేటు ఆయిల్ డిపోల నుంచి రిటైల్ బంకులకు ఎటువంటి జాప్యం లేకుండా ఆయిల్ ట్యాంకర్లు చేరుకునే విధంగా చూడాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆయిల్ కంపెనీలు నిరంతరం పని చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రెవెన్యూ,పోలీస్, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్, కంట్రోల్ రూమ్‌ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సీఎం ఆదే శించారు. అగ్రి, ఆక్వా సాగు అవసరాలు కూడా పెరిగాయని వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని స్పష్టం చేశారు. ప్రతీ బంక్ దగ్గర రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడా బ్లాక్ అమ్మకాలు జరగడానికి వీల్లేదన్నారు. ఇవాళ్టికి ఎక్కడా నో స్టాక్ బోర్డులు కనిపించకూడదని సీఎం చంద్రబాబు నిర్దేశించారు.

## ముందుగానే నైరుతి రుతుపవనాలు

### రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

**ప్రభాతవార్త విశాఖపట్నం:** ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. దీని వల్ల మండే ఎండల నుంచి ఉపశమనం లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఊరటనిచ్చే పరిస్థితులు ఏర్పడనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు, ఈసారి మే 25 నాటికే చేరుకునే అవకాశముందని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియంరేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ వెల్లడించింది.ఈ పరిస్థితి కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లో కూడా రుతుపవనాలు ముందుగానే ప్రవేశించే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత సంవత్సరం మే 24న కేరళలోకి వచ్చిన రుతుపవనాలు, మే 26 నాటికే రాష్ట్రానికి విస్తరించాయి.ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 200కు పైగా మండలాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. దీంతో విద్యుత్ అంతరాయాలు, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రుతుపవనాలు >>2



## పట్టాలు తప్పిన వందేభారత్

### పుణే స్టేషన్ సమీపంలో దుర్ఘటన

### ప్రయాణీకులంతా క్షేమం

**పూణె ఏప్రిల్ 27:** ముంబయి షోలాపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. పూణె రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలోనే ఈ దుర్ఘటన జరిగింది. అయితే ప్రయాణీకులెవ్వరికీ గాయాలుకూడా కాలేదని అధికారులు తెలిపారు. రాత్రి 7.30 గంటలప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ముంబయి ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్‌నుంచి వాయవ్య మహారాష్ట్రలోని షోలాపూర్‌కు వెళుతోంది.ప్రీమియం ఎసి రైలు కావ >>2



## శేషాచలం అగ్నిప్రమాదంపై డి.సిఎం పవన్ ఆరా

**విజయవాడ,ఏప్రిల్ 27,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి సమీపంలో శేషాచలం అడవుల్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. మంటలు మరింత విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తక్షణం అదుపు చేసేందుకు అవసరమయిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాద ఘటనపై పీసీసీఎఫ్ నుంచి వివరణ కోరారు. తిరుపతి పట్టణానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలోని బయోట్రిమ్ వెనుక భాగంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద ఘటనపై పీసీసీఎఫ్ పి.వి.చలపతి రావు, ఇతర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.మంటలను సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తీసుకువచ్చే విధంగా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. తిరుపతి ఘటనపై పీసీసీఎఫ్ వివరణ తీసుకోవాలని, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులను ఆదేశించారు. >>2



సోమవారం విద్యుత్‌శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

## విద్యుత్ కొనుగోలు ఛార్జీలు రూ.4.60కి తగ్గింపు!

### పునరుత్పాదన ఇంధన ఉత్పత్తి పెంచడమే లక్ష్యం

### ఇంధన పరిశోధనకు ప్రత్యేక వర్సిటీ

### 'ఇవి' వాహనాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

### విద్యుత్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా ప్రయోజనాల కోసమే విద్యుత్తు రంగంలో సంస్కరణలు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు .ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని . తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్‌మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించు కున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాటాడుతూ విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అలాంటి >>2

## గంజాయి కేసులో 27 మందికి జైలు

**గుంటూరు, ఏప్రిల్ 27 ప్రభాత వార్త ప్రతినిధి :** గుంటూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై మంగళగిరి రూరల్, దుగ్గిరాల పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో మొత్తం 27 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుండి మొత్తం 4.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి, విజయవాడ ప్రాంతాలకు చెందిన యువకులు, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకొని గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్న ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు గుర్తించారు. ఈ. కేసులో ప్రధాన నిందితుడు రావి మహేష్ కుమార్ గతంలోనే అనేక గంజాయి కేసుల్లో వున్నాడు. ఇతని ముఠాలోని కొందరు పాడేరు ప్రాంతానికి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి, మంగళగిరి పరిసర >>2

# న్యూజిలాండ్‌తో కీలక ఒప్పందం

### స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్, న్యూజిలాండ్ వాణిజ్య మంత్రులు సంతకాలు

### రైతులు, యువత, స్టార్టప్‌లకు ఎంతో మేలు: ప్రధాని మోడీ



సోమవారం న్యూఢిల్లీలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న మంత్రులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదిరింది. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, టాడ్ మెక్‌క్లే సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టిఏ వల్ల భారత్‌కు ఎంతో మేలు చేకూరనుంది. ముఖ్యంగా భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100శాతం ఉత్పత్తులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది. అంటే అన్ని ఉత్పత్తి కేటగిరీలకు, అన్ని టారిఫ్ లైన్లకు ప్రవేశ పన్నుల నుంచి మినహాయింపు దొరుకుతుంది. దీనివల్ల వస్త్రాలు (టెక్స్‌టైల్స్), దుస్తులు (అపెరల్స్), (తోలు) లెదర్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్స్ లాంటి రంగాల్లో పోటీతత్వం పెరుగుతుంది. తద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ)కు, ఉపాధి కల్పనకు మంచి ఊతం లభిస్తుంది. ఈ ఒప్పందంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, 'భారతదేశపు మొట్ట మొదటి మహిళా నేతృత్వ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అని, ఇది ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి' అని అన్నారు. ప్రధాన సంధానకర్త, ఉప సంధానకర్త, పారిశ్రామిక రంగాల అధిపతులతో సహా, సంప్రదింపుల బృందంలో అధిక శాతం మహిళలే ఉన్నారనే విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోత్సహించిన ఈ చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం, వాణిజ్య సంప్రదింపులలో లింగ సమానత్వానికి ఒక మైలురాయిగా, అలాగే దేశీయ పరిశ్రమలకు, అంత ర్జాతీయ వాణిజ్య సంబంధాలకు ఒక ప్రోత్సాహంగా పరిగణించ బడుతోందని పేర్కొన్నారు. ఈ చరిత్రాత్మక ఒప్పందం గాఢమైన పరస్పర విశ్వాసాన్ని, ఉమ్మడి ఆశయాన్ని, శ్రేయస్సు పట్ల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని >>2

వార్త

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.

- స్వీడెన్ బర్గ్

# కృత్రిమ కొరత 'పాపం'ఎవరిది!

తెలుగు రాష్ట్రాలిప్పుడు పెట్రోలు, డీజిల్ కొరతతో విలవిల్లాడుతున్నాయి. ఇదంతా కృత్రిమకొరత కావచ్చునని అంచనా ఉన్నా దీని వెనుక పాపం ఎవరిదో ఇంకా స్పష్టంగా కనిపెట్టలేకపోతున్నారు. వీటన్నిటినీ ఇంధన కష్టాలుగా ఎక్కడికక్కడే పెట్రోలు బంకుల్లో జనం తన వాహనాలతో బారులు తీరి ఉన్నారు. వాహనాలతోపాటు ఖాళీ డబ్బాలతో కూడా బంక్‌లకొచ్చేస్తున్నారు. కనుచూపు మేరలో పెట్రోలు, డీజిల్ కొరత వచ్చేస్తోందన్న ముందస్తు భయంతో మళ్లీ ఇప్పట్లో పెట్రోలు, డీజిల్‌ను చూడడం కష్టమేనని భావించి వాటి కోసం ఎగబడుతున్నారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు సగం పెట్రోలు బంకులు ఖాళీ అయ్యాయి. కొత్తగా సరకు వచ్చేదారిలేక, డిపోల నుండి తమ ట్యాంకర్లతో సరుకు తెచ్చుకునే ఆశ లేక బంకులు మూతపడ్డాయి. నిజానికి ఒక్కసారిగా ఉన్నట్టుండి వాహనదారులు దాదాపు అన్ని పెట్రోలు బంకుల్లో లైన్ కట్టడం విచిత్రంగా ఉంది. రాష్ట్రమంతటా అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, గామశివార్లు, రహదారుల్లోని పెట్రోలు బంక్‌లో ఒకే తీరులో జనం ఎగబడుతున్నారంటే సమస్య ఎక్కడ పుట్టిందో, అసలు సమస్య వాస్తవమో కాదో అర్థం కావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే బంకులపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా కృత్రిమ కొరతకు మూలం ఎక్కడో నిర్ణయించుకోలేకపోతున్నారు. చాలా బంకులు 'నో స్టాక్' బోర్డులు ఎందుకు పెడుతున్నాయో పరిశీలనలోనే ఉన్నాయి. నిజంగానే సరుకు లేదా? లేక ఉండికూడా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నంలో స్టాకు దాచేస్తున్నాయా తెలియక కొన్నిసర్వే బృందాలను తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అలెర్ట్ చేశాయి. సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని, సరుకు లేదన్న వదంతులు నమ్మి పెట్రోలు బంకుల్ని చుట్టుముట్టాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ స్పష్టం చేస్తోంది. వాస్తవానికి చెప్పాలంటే పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి వద్ద ఆగిపోయిన గ్యాస్ పెట్రోలు, డీజిల్ నౌకలను భారత్‌కు రప్పించడంలో కేంద్ర ప్రభుత్వం కృతకృత్యురాలైంది. అన్నీ సర్దుకున్నాయనుకున్న తరుణంలో పెట్రోల్ బంక్‌ల వద్ద కలకలం, దీని వెనుక పాపం ఎవరిదో అంచనాలకు అందడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోఅన్ని పెట్రోలు బంకుల వద్ద వాహనాల రద్దీ, కృత్రిమ కొరత, నోస్టాక్ బోర్డులు వంటివి కనబడుతున్నాయి. తెలంగాణలో వరంగల్, నల్గొండ, ఖమ్మం, జిల్లాలో ఇలాంటి పరిస్థితులు కనబడుతున్నాయి. తీవ్రంగా డీజిల్ కొరత ఉన్నట్లుంది. రైతుల ఆందోళన అంతాఇంతాకాదు. యాసంగి సీజన్‌లో వరికోతలు ముమ్మరంగా కొనసాగుతున్న పరిస్థితుల్లో వరికోత యంత్రాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ కారణం చేత కొన్ని చోట్ల కోతలు ఆలస్యమవుతున్నాయి. కొన్ని రోజుల కిందట హైదరాబాద్ నగరంలోని పెట్రోలు బంకులన్నీ 2,3 రోజులు ఇదే రకం అనుభవాన్ని నమోదు చేసుకున్నాయి. అధికారులు, జోక్యం చేసుకున్నాక సజావుగా పెట్రోలు, డీజిల్ సంపూర్ణంగా అందే పరిస్థితులు ఏర్పడ్డాయి. అలామూడు రోజుల పాటు నగర పెట్రోలు బంకుల వద్ద జనజీవనం స్తంభించింది. ఇప్పుడు మళ్లీ ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లోనూ అదే దృశ్యాలు , వాహనదారులు క్యూకట్టి కనిపిస్తున్నారు. యుద్ధం తొలినాళ్లలో కమర్షియల్ గ్యాస్ విక్రయంపై కేంద్రప్రభుత్వ నిర్ణయాలు చిన్నచిన్న తినుబండార వ్యాపారుల్ని, వాటి వినియోగదారుల్ని కలవరపరిచింది. కొంత మంది ఆహార పదార్థాల విక్రయం ద్వారా జీవనోపాధి పొందే వారు వ్యాపారాలు ఎత్తేశారు. కొందరైతే తినుబండారాల రేట్లు పెంచేసి, వాటి సైజుల తగ్గించి వ్యాపారం కానిచ్చేస్తున్నారు. పెరిగిన రేట్లు, తగ్గిన తినుబండారాల సైజుల గురించి వినియోగదారులుమారు మాట్లాడకుండా 'దొరికిందే చాల'ని సంతృప్తిపడుతున్నారు. దానికి తోడు కొత్తగా పెట్రోలు, డీజిల్ కృత్రిమ కొరత. తెలుగు రాష్ట్రాలన్నిటా నిన్న, మొన్న నేడు కూడా ఇవే దృశ్యాలు కనపడుతున్నాయంటే అత్యున్నత స్థాయి సమావేశాలు వాటిని అరికట్టలేకపోయాయి. అదే పరిస్థితి ఇప్పుడు హైదరాబాద్‌లోనూ ప్రత్యక్షమౌతున్నది. డీజిల్‌కు కొరత ఏర్పడ్తుందనే భయాలు అవసరం లేదనిపాలకులు విజ్ఞప్తి చేసినా పరిస్థితి కంట్రోలు కావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ రోజుల్లో 6,330కిలో లీటర్లపెట్రోల్, 9048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయి. తెలంగాణలో రోజుకి 9574 కి.లీ పెట్రోల్, 14,457 కిలో లీటర్ల డీజిల్ విక్రయిస్తుండగా గత రెండు రోజుల్లో విక్రయాలు పెరిగాయి. వీటి కొరత అధికంగా ఉందని తలచి వినియోగదారులు తీవ్ర ఆందోళనలకు గురయ్యారు. తిరుమల కొండపైకి వాహనాలపై వెళ్లిన భక్తులైతే పెట్రోలు, డీజిల్ దొరక్క తీవ్ర ఇబ్బందుల నెదుర్కొన్నారు. ఆక్వా రైతులు తమ చెరువుల్లో కృత్రిమ ఆక్సిజన్ సృష్టించడానికి డీజిల్ అవసరం. ట్రాక్టర్లు, ట్రక్కులుకూడా పెట్రోలు, డీజిల్ కోసం అల్లాడుతున్నాయి. అరకొర సరఫరా వారిని ఆందోళనలో ముంచెత్తుతోంది. పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగలేదు. దానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనందున ఆయిల్ కంపెనీల యాజమాన్యం 'కృత్రిమ కొరత' సృష్టించిందా!అన్న అనుమానాలతో స్థానిక ప్రభుత్వాలు ఆ దిశగా అన్వేషిస్తున్నాయి. కానీ ఇతమిత్థంగా కారణాలపై స్పష్టత రాలేదు. ఈలోగా పెట్రోలు బంకుల్లో నిల్వలు సమకూర్చుకునే విషయంలో ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప సరఫరాలో అంతరాయం తగ్గదు. అయిందేదో అయింది. ఇక సమృద్ధిగానే నిల్వలు ఉంటాయన్న'భరోసా' కల్పిస్తే తప్ప పెట్రోలు బంకుల్లో 'క్యూ'లు ఆగవు.

> అదృష్టం తనంత తానుగా వచ్చి తలుపు తడుతుందని అందరూ చెప్తుంటారు. నమ్మవద్దు అది అవకాశం రూపంలో ఉంటుంది. దాన్ని వెంటాడు. సొంతం చేసుకో.
>
> సెనెకా



> ఇతరులలో మంచిని చూడలేకపోవడం మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.
>
> సోక్రటీస్



## ప్రజావాక్కు



### ప్రత్యేక సమావేశాలెందుకు?

చంద్రబాబు మహిళా బిల్లుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఎందుకండీ.పార్లమెంటులో ప్రత్యేకంగా సమావేశం పెడితే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆటోమేటిక్‌గా పాస్ అవుతుంది. మొన్న డీలిమిటేషన్ బిల్లు కలిపి పెట్టినందున ఇండియా కూటమి వ్యతిరేకించింది. అయితే మీరు మహిళా బిల్లు కోసం శాసన సభ్యులు తమ నియోజక వర్గాలలో ప్రచారం చెయ్యాలని, ప్రత్యేకంగా శాసనసభ ఏర్పాటు చెయ్యాలని ప్రకటించారు. మీకెవరు సలహాలు ఇస్తున్నారో గాని, అవి ప్రజాఆమోదం పొందవు. ఎందుకంటే ఔషధమొక్కలు పెంచుతామని ప్రభుత్వ భూములను తక్కువ లీజుకు తీసుకొని, అందులో మామిడి,జామ ,బొప్పాయి లాంటి వ్యాపార పంటలు పండిస్తూ, ప్రకృతి వైద్యం అంటూ కరకట్ట మీద ఫైవ్‌స్టార్ హోటల్ లాంటిది కట్టి మోసం చేస్తున్న వారినిసలహా దారునీగా నియమించారు. ఆయన సంగతి ప్రజలకు తెలుసు.మరి మీకెందుకు తెలియ లేదో.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఉపాధి హామీ కల్పించాలి

పాలకుర్తి నుండి హనుమకొండ వచ్చే దారి వెంట రోడ్ల పైననే వడ్లు, మక్కలు విస్తారంగా పోసినారు. దాని వల్ల వాహన దారులు ప్రమాదాలకు గురికావడం పరిపాటిగా మారింది. మరి కేంద్రంలోని ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతునురాజును చేయడమే మాసంకల్పం అంటారు కదా. మరి రైతుకేంద్రంగానిర్ణయాలు చేస్తున్నారా లేదా?ఉపాధి హామీలో ఆస్తులసృష్టి గురించి స్పీచ్‌లు ఇచ్చే నాయకులు రైతులకు కల్లాలను ఎందుకు నిర్మించలేకపోతున్నారు. అసలు ఈకేంద్రీకృత ఉపాధిహామీ విధానం తొలగకుండా వికసిత భారతం సాధ్యం అవుతుందా? గ్రామీణా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ దిశగా తెలంగాణలో అడుగులు పడాలి.

- భారత అవినాష్, జనగామ

### దివ్యాంగులను మినహాయించాలి

ఒకరి సహాయం లేనిదే దివ్యాంగులు ఏ పని చేయలేరు. అంధులు రాయడం కష్టంఅవుతుంది. శారీరక దివ్యాంగులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది . కనుక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో జనాభా లెక్కల సేకరణలో వికలాంగులను మినహాయిస్తూప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కి, వివిధ శాఖల ఉన్నత అధికారులకు విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌కు జనాభా లెక్కల సేకరణలో వికలాంగుల మినహాయిస్తూ ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### డ్రైవర్ల భద్రత

ఈమధ్య ఆర్టీసీ డ్రైవర్లపై అకారణ దాడులు పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎంతో మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్నారు.అలాంటి వారిపై దాడులు చేయడం సహించరాని విషయం. బైక్‌లపై ప్రయాణించే కొందరు, సైడ్ ఇవ్వలేదని చిన్న విషయాన్ని పెద్ద గొడవగా మార్చి డ్రైవర్లతో వాగ్వాదానికి దిగి దాడులు చేస్తున్నారు. డ్రైవర్లు నిబంధనల ప్రకారంజాగ్రత్తగా వాహనంనడిపినా, అనవసరంగా వివాదాలు సృష్టించడం బాధాకరం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పరస్పరం గౌరవంతో ప్రవర్తించాలి.డ్రైవర్ల భద్రత కోసం అన్నిబస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.పోలీసుల పర్యవేక్షణను పెంచి,అత్యవసర సహాయం త్వరగా అందేలా చూడాలి.ప్రయాణికులు కూడా డ్రైవర్లకు మద్దతుగా నిలవాలి.అప్పుడే డ్రైవర్లు నిర్భయంగా విధులను నిర్వహిస్తారు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### విద్యాశాఖ పనితీరు అభినందనీయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ పనితీరు అభినందనీయం. ఎలిమెంటరీను హైస్కూల్‌నుండి వేరు చేయడం, ఇంటర్మీడియట్ విద్యనుహైస్కూల్ ప్లస్‌గామార్చడం ఆహ్వానించ దగ్గ మార్పు. నూతనంగా విద్యాశాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వారు ఉపాధ్యాయ సంఘ నాయకులతో చర్చలు జరిపి అప్రెంటిస్ టీచర్లను నోషనల్ ఇంక్రిమెంట్స్ విషయమై ఏ టీచర్అయినా వ్యక్తిగతంగా అభ్యర్థిస్తే పరిశీలిస్తామని చెప్పడం చాలా సంతోషించ వలసిన విషయం. సీనియర్లకు జూనియర్ల కంటే తక్కువ వేతనం రావడానికి ప్రధాన కారణం అన్వేషించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు ఈనేపథ్యంలో అందరు అప్రెంటిస్ టీచర్లకు రెండేళ్ల అప్రెంటిస్ కాలం దిగ్విజయంగా పూర్తి చేసిన నేపథ్యంలో ఇవ్వబడిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వారు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుండి అమలు చేయాలి.

- వీరగంట భాస్కర్ రావు , విజయనగరం జిల్లా

### గ్రామాల్లో అన్ని సౌకర్యాలుండాలి

గ్రామాలలో ప్రతి రంగానికి చెందిన పాలకవర్గం అధికారులు, కిందిస్థాయి సిబ్బంది విపత్కర,సాధారణ పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండడమేగాకవారికి కావలసిన సౌకర్యాలు అందుబాటులోఉంటేనే గ్రామాలుఅభివృద్ధి చెందుతూ ప్రజలు మెరుగైన జీవితం గడపడానికి అవకాశాలు ఉంటాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ట్రంప్‌పై దాడి ప్రజాగ్రహానికి నిదర్శనమా?

**ఇటీవల ట్రంప్‌పై జరిగిన దాడి పట్ల అతిగా స్పందించవల సిన అవసరం లేదు. ఈ సంఘటన ట్రంప్‌పై ప్రతీకారం తో జరిగిందా? లేక అమెరికా ప్రజల్లో సానుభూతి కోసం జరిపించుకున్న నాటకమా? అనే విషయం తేలాలి. ఇప్పటికే అధ్యక్షుడి తీరుతో అమెరికా ప్రజలు విసుగెత్తిపోయారు. 'నో కింగ్స్' అంటూ లక్షలాది మంది ప్రజలు రోడ్లెక్కి నిర సన తెలిపారు. ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధంలో ఘోర వైఫల్యం చెందిన ట్రంప్ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ఈ డ్రామా ఆడినట్టు పలువురు భావిస్తున్నారు. తనపై జరిగిన దాడిని అమెరికా రాజ్యాంగంపై జరిగిన దాడిగా ట్రంప్ పేర్కొనడంవిడ్డూరం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వం చెలాయిస్తున్న ట్రంప్‌కు ఇలాంటి వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు లేదు. ఏది ఏమైనప్పటికీ ఇకనైనా భారత్ మేల్కొనాలి. అమెరికా పట్ల జాగరూకత వహించాలి. నమ్మకమైన రష్యాను భారత్ వదులుకోకూడదు.**



సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచమంతా ఇంధన సంక్షోభంతో కకావికలమవుతూ, అమెరికాను తిట్టిపోసుకుంటున్న తరుణంలో వైట్‌హౌస్ వార్తలను బాహ్య ప్రపంచానికి తెలియచేసే ప్రెస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ విందు సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు జరగడం, ట్రంప్‌తో పాటు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇతర అతిథులు తృటిలో తప్పించుకోవడం సంచలన వార్తగా మారింది. డోనాల్డ్ ట్రంప్‌పై హత్యా ప్రయత్నం జరగడం ఇదేమీ మొదటి సారికాదు. గతంలో లాస్ వెగాస్, పెన్సిల్వేనియాల్లో కూడా ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. 2024లో అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ కుడి చెవికి బుల్లెట్ గాయం తగిలినా సురక్షితంగా బయట పడిన విషయం విదితమే. శత్రు దుర్భేద్యమైన భద్రతా వలయాన్నిఛేదించుకుని ఒక అతిథిలా కాలిఫోర్నియాకు చెందిన ఒక యువ ఉపాధ్యాయుడు ఆయుధాలతో ప్రవేశించడం అమెరికా భద్రతా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేసింది. తాజాగా జరిగిన దాడిని వివిధ కోణాల్లో విశ్లేషించవలసి ఉంటుంది. ఈ దాడి వెనుక ప్రధాన ఉద్దేశ్యమేమిటి?ట్రంప్ తన చేష్టలతో, యుద్ధోన్మాదంతో ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాడన్న ఆగ్రహంతో ఈదాడి జరిగిందా? అమెరికా ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేస్తున్నందుకా? ఇరాన్ విషయంలో అనవసరంగా జోక్యం చేసుకుని ఇంధన కొరతను సృష్టించి ప్రపంచ దేశాలకు కంటక ప్రాయంగా మారినందుకా? ఇలాంటి ఎన్నో సందేహాలు విశ్లేషకుల ఆలోచనలకు పదును పెడుతున్నాయి. ట్రంప్‌పై జరిగిన దాడిపట్ల ఎవరూ మనస్ఫూర్తిగా తమ సానుభూతిని వ్యక్తం చేయలేదు. కొన్ని దేశాలు ఈదాడినిఖండించినా అది ఆయా దేశాల నుండి మన స్ఫూర్తిగా వెలువడిన ప్రకటనలు కావని అందరికీ తెలుసు. తనపై కాల్పులు జరిపిన వ్యక్తిని మానసిక రోగిగా ట్రంప్ పేర్కొనడం విడ్డూరం. వాస్తవంగా చెప్పాలంటే ట్రంప్ నిజమైన మానసిక రోగ గ్రస్తుడుగాను, యుద్ధోన్మాదిగాను, అహంభావి గాను అమెరికాతోపాటు యావత్ ప్రపంచం భావిస్తున్నది. అయినప్పటికీ ట్రంప్ తన పిచ్చి చేష్టలతో తమపై ఏరూపంలో విరుచుకుపడతాడోనన్న భయంతో కొన్ని దేశాలు సంయమనం పాటిస్తున్నాయి. వీసాల విషయంలోను, టారిఫ్‌ల అంశంలోను తలనొప్పిగా పరిణమించిన ట్రంప్ నిర్ణయాలు అనుచితంగా ఉన్నాయి. తన మిత్ర దేశాలను సైతం వదలకుండా చులకనగా చూసిన ట్రంప్ వైఖరి వలన అమెరికా నేడు ఏకాకిగా మారింది. భారత్‌ను ఎన్నో సార్లు ట్రంప్ అత్యంత దారుణంగా అవమానించాడు. కనీస నియమ నిబంధనలు పాటించకుండా, అక్రమ వలస దారులంటూ అమెరికాలో ఉంటున్న భారతీయులకుసంకెళ్ళు వేసి యుద్ధ విమానాల్లో భారత్‌కు పంపించి, అమర్యాదగా ప్రవర్తించాడు. అమెరికా రేడియో వ్యాఖ్యాత మైఖేల్ సావెజ్ భారత్,చైనాలను నరక కూపాలుగా,భారతీయ ఉద్యోగులను ల్యాప్ ట్యాప్‌లు ధరించిన గ్యాంగ్ స్టర్లుగా అభివర్ణిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆ వ్యాఖ్యలను ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో రీ ట్వీట్‌చేస్తూ, తన అభిప్రాయం కూడా అదేనన్నట్టుగా అక్కసు వెళ్ళగక్కడం అభ్యంతరకరం. గర్భం దాల్చిన మహిళలు అమెరికాలో అడుగు పెట్టి, పిల్లలను కని అమెరికాలో శాశ్వతంగా తిష్టవేయడానికి ప్రయత్నిస్తున్నారని చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయం. అమెరికా ఎంతగా అవమానించినా, నిందించినా భారత ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన రీతిలో స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు.



అమెరికా స్థూల జాతీయోత్పత్తిలో గణనీయమైన పాత్ర వహిస్తూ, కీలకమైన రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ అమెరికా అభివృద్ధికి గుండెకాయలా మారిన భారతీయులను,వారి మేథస్సును విమర్శించడం అర్థరహితం, అత్యంత దుర్మార్గం. భారతీయుల శ్రమను, నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ,వారిని అవమానించడం కుసంస్కారం. ఇప్పటికే గ్రీన్ కార్డులపై భారతీయుల ఆశలు సన్నగిల్లాయి. హెచ్1బి వీసాల సంఖ్య ను 25వేలకు కుదించిన నేపథ్యంలో మూడేళ్ల పాటు హెచ్ 1బి వీసాలను కూడా నిరాకరించాలని యు.ఎస్ కాంగ్రెస్ ముందుకు మరో బిల్లు రాబోతున్నది. ఇలాంటి నిర్బంధాల మధ్య ఇక భారతీయ సాఫ్ట్‌వేర్ నిపుణుల అమెరికా ప్రవేశం అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే అమెరికాలో స్థిరపడాలని కలలు గన్న భారతీయుల ఆశలు ఆవిరైపోయాయి. చాలా మంది భారతీయులు అమెరికాలో పనిచేయడానికి విముఖత ప్రదర్శిస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. అమెరికా పట్ల ప్రపంచ దేశాలకు నమ్మకం పోయింది. పాక్ తో ట్రంప్ స్నేహం భారత్‌కు తలనొప్పి తెచ్చే వ్యవహారమే. పాక్ ఉగ్రవాదుల మూక పహల్గాంలో నరమేథం సాగించిన తర్వాత భారత్ ఎంతో సాహసంతో ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేయడమే కాకుండా, ఉగ్రవాదులను క్షణాల్లో మట్టుబెట్టి శభాష్ అనిపించుకుంది. భారత్ చర్యతో బెంబేలెత్తిన పాక్ భారత్‌ను శరణుజొచ్చి, కాల్పుల విరమణకు అంగీకరింప చేసింది. అప్పుడే అమెరికా ఈ సన్నివేశంలోకి ట్రంప్ హఠాత్తుగా ప్రవేశించి తానే భారత్ పాక్‌ల మధ్య యుద్ధాన్ని నిలువరించానని, ఇరుదేశాల మధ్య అణుయుద్ధం రాకుండా ఆపగలిగానని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతూ, నేటివరకు అనేక విషయాల్లో భారత్‌ను నొప్పిస్తూ, అవమానిస్తూ సంతృప్తి పొందుతున్నాడు. అమెరికా తన శక్తి యుక్తులన్నీ కూడదీసుకుని అత్యంత శక్తివంతమైన క్షిపణులను ఇరాన్‌పై ప్రయోగించినా, అమెరికా ఆయుధ సంపత్తి ఇరాన్ డ్రోన్ల ముందు తునాతునకలు కావడం, ఇరాన్ క్షిపణుల దాటికి అమెరికా యుద్ధ విమానాలు విధ్వంసం కావడం అమెరికా ఆయుధాలు కొంటున్న దేశాలను ఆలోచింప చేస్తున్నాయి. ట్రంప్ వైఖరి వలనే హార్ముజ్ జలసంధివద్ద భారత్‌తోసహా పలు దేశాల చమురు నౌకలు నిలిచిపోయాయి. ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధనం చేయడంవలనే ఇరాన్ హార్ముజ్‌పై తన పట్టును మరింత బిగించింది. ఈకారణంగానే భారత్‌తో సహాపలు ప్రపంచ దేశాలు తీవ్రమైన చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ట్రంప్ దురహంకారం ప్రపంచ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. కాల్పుల విరమణ ప్రకటించినా ట్రంప్ అందుకు కట్టు బడక పోవడంతో, ట్రంప్‌పై ఇరాన్ తన నమ్మకాన్ని కోల్పోయింది. ఒక వైపు చర్చలంటూనే మరోవైపు ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధనం చేయడం వలన ఇరాన్ అమెరికాతో ప్రత్యక్ష చర్చలను నిలుపుదల చేసింది. ఇరాన్ అమెరికాల మధ్య యుద్ధాన్ని ఆపగల సామర్థ్యమున్నా భారత్ మాత్రం మౌన ముద్రహించడంలో గల ఔచిత్యం అవగతం కావడం లేదు. ఇటీవల ట్రంప్‌పై జరిగిన దాడి పట్ల అతిగా స్పందించవలసిన అవసరం లేదు. ఈ సంఘటన ట్రంప్‌పై ప్రతీకారంతో జరిగిందా? లేక అమెరికా ప్రజల్లో సానుభూతి కోసం జరిపించుకున్న నాటకమా?అనే విషయం తేలాలి. ఇప్పటికే అధ్యక్షుడి తీరుతో అమెరికా ప్రజలు విసుగెత్తిపోయారు. 'నో కింగ్స్' అంటూ లక్షలాది మంది ప్రజలు రోడ్లెక్కి నిరసన తెలిపారు. ఇరాన్ పై జరుపుతున్న యుద్ధంలో ఘోర వైఫల్యం చెందిన ట్రంప్ ప్రజలను తప్పు దారి పట్టించడానికి ఈ డ్రామా ఆడినట్టు పలువురు భావిస్తున్నారు. తనపై జరిగిన దాడిని అమెరికా రాజ్యాంగం పై జరిగిన దాడిగా ట్రంప్ పేర్కొనడంవిడ్డూరం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వం చెలాయిస్తున్న ట్రంప్ కు ఇలాంటి వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు లేదు. ఏది ఏమైనప్పటికీ ఇకనైనా భారత్ మేల్కొనాలి. అమెరికా పట్ల జాగరూకత వహించాలి. నమ్మకమైన రష్యాను భారత్ వదులుకోకూడదు. ●

# నకిలీ విత్తనాలతో కుప్పకూలుతున్న రైతు!

తిప్పర్తి శ్రీనివాస్

నకిలీ విత్తనాల వ్యాపారం వ్యవసాయ రంగానికి ముప్పుగా మారింది. ముఖ్యంగా పత్తి సాగులో ఈ సమస్య మరింత తీవ్రమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే గ్రామాల వరకు చేరుతున్న నకిలీ పత్తి విత్తనాలు, కోట్ల రూపాయల దందాగా విస్తరించడం ఆందోళనకర విషయం. నియంత్రణ సంస్థలు, టాస్క్‌ఫోర్స్ బృందాలున్నప్పటికీ, అవి కేవలం నామమాత్రంగా మారిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పత్తిరైతులు ప్రతి సీజన్‌ను ఆశలతో ప్రారంభిస్తారు. మంచి దిగుబడి, సరైన ధరలతో తమ కుటుంబాలను ముందుకు తీసుకెళ్లాలని కలలు కంటారు. కానీ నకిలీ విత్తనాలు వారి ఆశలను ఛిద్రం చేస్తున్నాయి. ప్యాకెట్‌పై ప్రముఖ కంపెనీల పేర్లు, ఆకర్షణీయమైన లేబుళ్ల ఉండటంవల్ల రైతులు అవి నమ్మదగినవని భావిస్తారు. కానీ మొలక శాతం తక్కువగా ఉండటం, మొక్కల పెరుగుదల సరిగాలేకపోవడం, తెగుళ్లకు త్వరగా గురవడం వంటి సమస్యలు రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం పర్యవేక్షణ లోపం. విత్తనాల సరఫరా వ్యవస్థలో అనేక దశలు ఉన్నప్పటికీ, వాటి ప్రతిదశలోనూ సరైన తనిఖీలు జరగడం లేదు. అనుమతి లేని డీలర్లు, మధ్యవర్తులు గ్రామాలవరకు చేరి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు. అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పాలి. ఇంకా ఒక ముఖ్య అంశం అవగాహన లోపం. చాలా మంది చిన్న రైతులు అసలైన విత్తనాలను, నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలో తెలియక మోసపోతున్నారు. అధికార సంస్థలు, వ్యవసాయ శాఖలు రైతులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వడంలో విఫలమవుతున్నాయి. రైతు సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు కేవలం పత్రాలకే పరిమితమవుతున్నాయి. వాస్తవానికి, ప్రతి గ్రామంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రైతులను అప్రమత్తం చేయాలి. టాస్క్‌ఫోర్స్ బృందాల విషయానికి వస్తే, అవి కేవలం కాగితాలపై మాత్రమే పనిచేస్తున్నాయనే అభిప్రాయం బలంగా ఉంది. ఎక్కడైనా దాడులు జరిపినట్లు వార్తలు వస్తున్నప్పటికీ, అవి స్థిరమైన ఫలితాలను ఇవ్వడం లేదు. పెద్ద మాఫియాలను పట్టుకోవడంలో విఫలంఅవుతుండగా, చిన్నడీలర్లపై చర్యలు తీసుకోవడం మాత్రమే జరుగుతోంది. ఇది సమస్యను మూలం నుంచి పరిష్కరించలేకపోతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతక్షణ చర్యలు తీసుకోవాలి. మొదటిగా విత్తనాల తయారీ, పంపిణీ వ్యవస్థపై కఠిన నియంత్రణలు అమలు చేయాలి. ప్రతి ప్యాకెట్‌పై ట్రేసబిలిటీ ఉండే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. రైతులు క్యూఆర్ కోడ్‌ల ద్వారా విత్తనాల నాణ్యమైనవా!కావా అనేది సులభంగా తెలుసుకునేలా చేయాలి. ఇది నకిలీ విత్తనాల వ్యాప్తిని తగ్గించడంలోకీలక పాత్ర పోషిస్తుంది. రెండవది, గ్రామ స్థాయిలో తనిఖీలు పెంచాలి. వ్యవసాయ అధికారులు, పోలీస్‌శాఖ కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోవాలి. ఇందులో స్థానిక రైతు సంఘాల సహకారంకూడా తీసుకోవాలి. రైతులు స్వయంగా అనుమానాస్పద కార్యకలాపాలను అధికారులకు తెలియజేసేలా ప్రోత్సహించాలి. అలాగే నకిలీ విత్తనాల తయారీదారులు, సరఫరాదారులపై కఠిన శిక్షలువిధించాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలు సరిపోకపోతే, వాటిని మరింత కఠినతరం చేయాలి. భారీ జరిమానాలు, జైలుశిక్షలు విధించడం ద్వారా ఈ దందాను అరికట్టవచ్చు. నేరస్థులు తప్పించుకునే అవకాశాలు లేకుండా వేగవంతమైన విచారణలు జరగాలి. చివరిగా, రైతులకు నష్ట పరిహారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులు తిరిగి నిలబడేందుకు ఆర్థికసహాయం అందించాలి. ఇది రైతులలో నమ్మకాన్ని పెంచుతుంది. మొత్తంగా చూస్తే, నకిలీ విత్తనాల సమస్యను నిర్లక్ష్యం చేయలేం. ఇదికేవలం రైతుల సమస్య మాత్రమేకాదు, దేశ ఆర్థికవ్యవస్థకు సంబంధించిన కీలక అంశం. వ్యవసాయం బలపడితేనే దేశం బలపడుతుంది. అందువల్ల, ప్రభుత్వం, అధికారులు, రైతులు కలిసి ఈసమస్యను ఎదుర్కొని, శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలి. ●



# పిల్లల్లో పెరుగుతున్న స్థూలకాయ సమస్య

జి. యోగేశ్వర్ రావు

ఆటపాటలు తక్కువైపోయాయి. వ్యాయామాల జోలికి వెళ్లే వారు మరీ తగ్గిపోయారు. జంక్ ఫుడ్ మాత్రం ఎక్కువైపోయింది. ఇది చాలా దేశాల్లో చిన్నారుల పరిస్థితి. ఈ కారణాల వల్ల చిన్నతనంలోనే అనేక మంది బరువెక్కిపోతున్నారు. కేవలం పది దేశాల్లో లెక్కచూస్తే బడి ఈడు పిల్లల్లో 20 కోట్ల మందికి పైగా అధిక బరువుతో బాధపడుతున్నట్టు అంచనా. కాలు బయటపెట్టడానికి ఇష్టపడకుండా అతికొద్ది మంది పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. చాలా మంది టీవీలు, ఫోన్లకు అంటిపెట్టుకుని ఉంటున్నారు. దీనివల్ల ఎంతోమంది బాలబాలికలు స్థూలకాయం బారిన పడుతున్నారు. 2025లో ఇలాంటి వారి పరంగా చైనా తర్వాతి స్థానం ఇండియాదే. గత ఏడాది మనదేశంలో 5-19 ఏళ్ల మధ్య పిల్లల్లో ఊబకాయంతో సతమతమవుతున్న వారి సంఖ్య 1.4 కోట్ల వరకూ ఉంది. చైనాలో ఈ సంఖ్య అత్యధికంగా 3.3కోట్లు ఉండగా ఇరాక్‌లో అత్యల్పంగా 0.3 కోట్లని వరల్డ్ ఒబెసిటీ అట్లాస్ 2026 తెలిపింది. 2022 లో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయంతో జీవిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అలాగే 1990 నుంచి వయోజనులలో ఊబకాయం రెట్టింపు కన్నా ఎక్కువగా పెరిగింది. కౌమార దశలో ఉన్న వారిలో నాలుగు రెట్లు పెరిగింది. 2022లో 2.5 బిలియన్ల మంది వయోజనులు అధిక బరువు కలిగి ఉన్నారు. వీరిలో 89కోట్ల మంది ఊబకాయంతో జీవిస్తున్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారిలో 43 శాతం మంది అధిక బరువుతో ఉండగా, 16 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. 2024లో అయిదేళ్ల లోపు వయసున్న 35 మిలియన్ల మంది పిల్లలు అధిక బరువుతో ఉన్నారు. ఆహారం, శక్తి వ్యయం మధ్య అసమతుల్యత వల్ల అధిక బరువు, ఊబకాయం సమస్య వస్తుంది. బాల్యం, కౌమార దశలో ఎక్కువ బరువు ఉండటం కారణంగా ఆరోగ్య సమస్యలు విపరీతంగా వస్తున్నాయి. ఇవి జీవ నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. వివక్ష రావొచ్చు. వేధింపులూ తప్పకపోవచ్చు. ఊబకాయంతో ఉండే పిల్లలు పెద్దయ్యాక కూడా అదే విధంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వయోజన దశలో వీరికి అంటువ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం లేకపోలేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనదేశం విషయానికే వస్తే పిల్లల్లో ఊబకాయం సమస్య రానురానూ పెరిగిపోతోంది. అయిదేళ్ల లోపు పిల్లల్లో అధిక బరువు 127 శాతం పెరిగినట్టు ఒక అధ్యయనం ద్వారా వెల్లడైంది. మరో నాలుగేళ్లలో భారత దేశంలో 27 మిలియన్లకు పైగా పిల్లలు, టీనేజర్లు ఊబకాయంతో సతమతం కావచ్చని అంచనా. ఆధునిక జీవనశైలి అన్నివిధాలా చిన్నారులను దెబ్బతీస్తోంది. స్మార్ట్‌ఫోన్‌తో అదేపనిగా ఉండటం, మితిమీరి జంక్ ఫుడ్ తినడం, అటూ ఇటూ తిరిగే పనిలేకపోవడం వంటి కారణాలతో సమస్య మరింతగా పెరిగిపోతోంది. ఫలితంగా చిన్నతనంలోనే టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, ఫ్యాటీ లివర్ వ్యాధులు మీద పడుతున్నాయి. షుగర్ డ్రింక్స్, ప్రాసెస్ చేసిన స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ పెరిగి కొవ్వు పేరుకుపోతుందని నిపుణులు చెబుతున్నారు. తగినంత నిద్ర లేకపోవడంకూడా ఓ కారణమే అని అంటున్నారు. ఏదో ఒకటి తినేసి పొట్ట నింపుకోవాలన్న తాపత్రయం చిన్నారుల్లో, టీనేజర్లలో ఎక్కువైపోయిందనీ, ఇది చాలా ప్రమాదకరమని చెబుతూ ముందు కుటుంబ పెద్దల్లో మార్పు అవసరమని సూచిస్తున్నారు. పిల్లలకు అనుకరించే అలవాటు పెద్దవారి నుంచి వస్తుంది. తల్లితండ్రులను, వారి ఆహార అలవాట్లను చాలా మంది చిన్నారులు అనుసరిస్తూ ఉంటారు. కుటుంబంమొత్తం ప్రణాళికా బద్ధంగా జీవిస్తే తప్ప చిన్న పిల్లలు తమ పద్ధతి మార్చుకుంటారని అనుకోవడం పొరపాటే అవుతుంది. చదువు ఒత్తిడి, పోటీతత్వం, సామాజిక ఆందోళనలు కూడా పిల్లలపై ప్రభావం చూపిస్తాయి. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాలతో కూడిన ఆహారం చాలా అవసరం. కూరగాయలు, తాజా పండ్లు, తృణధాన్యాలు, పాలు సరైన మొత్తంలో తీసుకునేలా వారిని ప్రోత్సహించాలి. వాటిని తీసుకోవడం వల్ల లభించే మేలును అర్థమయ్యేలా వివరించి చెప్పగలగాలి. ఇది ఇంటి పెద్దలు తీసుకోవాల్సిన బాధ్యత అని గుర్తించాలి. జంక్ ఫుడ్, చక్కెర అధికంగా ఉండే వాటిని పిల్లలకు వీలైనంత దూరంగా ఉంచాలి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల అధిక బరువు సమస్య ఎదురవుతోంది. ఆటలు ఆడటం మంచిదని, సైక్లింగ్ చేయడం మరింత మంచిదని చెప్పి ప్రోత్సహించాలి. శారీరక శ్రమ పెరిగితే ఊబకాయం దానంతట అదే కొన్నాళ్ళకు దూరం అవుతుంది. తగినంత నిద్ర లేకపోయినా కూడా ఊబకాయం రావచ్చు. బరువు పెరగవచ్చు. నిద్ర లేమి కారణంగా శరీరంలో వాపు మొదలై బరువు పెరగడానికి ఆస్కారముంది. కనీసం రోజుకు ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు నిద్ర ఉండేలా సమయాన్ని నిర్ధారించే బాధ్యతను తల్లితండ్రులు తీసుకోవాలి. చదువు నిమిత్తం కంప్యూటర్, ఫోన్ వినియోగించుకోవడంలో తప్పు లేదు. కానీ వేళకాని వేళల్లో దాన్ని వినోదం కోసం గంటల తరబడి ఉపయోగించడం ఆరోగ్యానికి నిస్సందేహంగా ముప్పే. దీనికి బదులు ఇంటి పనిలో సాయపడమని చెప్పండి. పుస్తకాలు చదివించండి. తోట పని చేస్తే కలిగే ఆనందం గురించి వివరించండి. ఇది కూడా పెద్దల బాధ్యతే. పిల్లలకు ఆదర్శంగా నిలవండి. ముందు మీరు మారండి. ఆ తర్వాత మిమ్మల్ని చూసి వారే మారిపోతారు. ●



ong-5_ong-5.qxd 4/27/2026 11:39 PM Page 1



ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ఒంగోలు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు కరపత్రం ఆవిష్కరించిన జేసి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం-2026 కరపత్రాన్ని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రంథాలయంలో నిర్వహించే సమ్మర్ క్యాంపు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం 40 రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో వివిధ విద్యా, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా పుస్తకాల పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు జ్ఞానాన్ని విస్తరించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు మరియు పాఠకులు పాల్గొన్నారు. అధికారులు ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాజా వెంకటాద్రి నాయుడుకు నివాళులు అర్పించిన కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతిని పురస్కరించుకుని ఒంగోలు కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పాల్గొని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు. కార్యక్రమంలో అధికారులు ఆయన జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన సేవలు నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఎస్‌డిసి శ్రీధర్ రెడ్డి, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. అధికారులు కలిసి నివాళులు అర్పించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగింది. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఉపాధిహామీ అవినీతిపై వినతిపత్రం

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు నన్నెబోయిన రవి కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో కూటమి ప్రభుత్వ అవినీతి, పెండింగ్ వేతనాలపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా డీపీవోకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, వైసీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్ యాదవ్, వైసీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి రవీంద్రరెడ్డి, జడ్పీటీసీ, ప్రకాశం జిల్లా యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ బండ్లమూడి వెంకట రాజయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైసీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం జనరల్ సెక్రటరీ దేవరపల్లి అంజిరెడ్డి, ఘట్టమనేని అశోక్, ఒంగోలు పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు కోటేశ్వరరావు, సన్నపురెడ్డి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ మీరావలి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, ఆత నర్సింహగౌడ్, యరజర్ల రమేష్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వెంకయ్య నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెట్రోలు బంకుల వద్ద అధికారుల తనిఖీలు

**ఉలవపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దార్ రవిశంకర్ ఎస్సై సుబ్బారావు సోమవారం మండలంలోని పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు తెలియపరచాలని పెట్రోల్ బంకుల యాజమాన్యానికి తెలిపారు. అదేవిధంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. పెట్రోల్ బంకుల వద్ద డ్యూటీ వేసిన విఆర్ఓ లు మరియు విఆర్ఎ లు తప్పనిసరిగా పెట్రోల్ బంకుల వద్ద ఉండి స్టాక్ వివరాలు తహశీల్దారు కార్యాలయానికి సమాచారం అందించాలని ఆదేశించారు.

## పెదకాకాని శంకర్ నేత్రాలయ హాస్పటల్ కంటి శుక్లాల ఆపరేషన్ కోసం 46 మంది ప్రయాణం

**జె. పంగులూరు, ఏప్రియల్ 27, ప్రభాతవార్త**




పెదకాకాని శంకర్ నేత్రాలయం అంటే నే నిరుపేదలకు నేత్రాలను చికిత్స చేసి ప్రపంచంలోని సౌందర్యాం తో పాటు తన బంధువులను ఆత్మీయుల కనులారా చూడగలుగుతున్నారని ప్రజల ఆత్మవిశ్వాసమని అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో 25 శనివారం రోజున శంకర్ నేత్రాలయ పెదకాకాని వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించగా స్థానిక పంగులూరు రోటి క్లబ్ నుండి కంటి శుక్లాల ఆపరేషన్ కోసం 46 మంది రోగులను సోమవారం శంకర్ ఆస్పత్రి వారి బస్సులో తీసుకువెళ్లడానికి బయలుదేరారు. మిగిలి నరెండవ బృందం 51 మందిని రోగులను 29వ తేదీన ఆపరేషన్ చేయించుకొనుటకు వెళ్తున్నారని మొత్తం 75 మంది కంటి చుక్లాలు అవసరమని గుర్తించామని అధ్యక్షులు డాక్టర్ బి వీరనారాయణ, వైద్య శిబిరం ఇన్చార్జి చిలుకూరి వీరాఘవయ్య తెలిపారు.

## స్థల వివాదం పై కేసు నమోదు

**బల్లికురవ ఏప్రిల్ 27( ప్రభాతవార్త)**

మండలంలోని కూకట్పల్లి గ్రామంలో , నివాస స్థల వివాదంపై సోమవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలియజేశారు. గ్రామానికి చెందిన అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు పేరి రెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్ళు పంపిణీ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఇటీవల నిర్వహించిన పల్లెనిద్రలో పర్యటనలో భాగంగా వచ్చిన వికలాంగుల సైకిళ్ళ పంపిణీ చేయాలని అర్జీలు రావడంతో మొత్తం మూడు సైకిళ్ళలను కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో పంపిణీచేశారు.



## ఉపరాష్ట్రపతి, గవర్నర్‌కి స్వాగతం పలికిన మంత్రి డోలా

**టంగుటూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి విశాఖ విమానాశ్రయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందజేసి, జిల్లా యంత్రాంగం తరుపున సాదరంగా ఆహ్వానించడం జరిగింది. విశాఖలో నిర్వహించనున్న పలు అధికారిక కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.

# ఇంధన కొరత.. అంతటా కలత..

- పెట్రోల్, డీజిల్ కోసం బారులు
- లెక్కలు కాదు.. పెట్రోల్ దొరికిందా లేదా అన్నది ప్రజలకు ముఖ్యం






**ఒంగోలు, ప్రభాతవార్త**

ఇంధనం కొరత లేదని ఓ వైపు అధికారులు చెప్తున్నా క్షేత్ర స్థాయిలో రైతులు, సామాన్యులకు తిప్పలు తప్పడం లేదు. రోజు ఇంధనం సరఫరా చేసే చమురు కంపెనీలు మూడు నాలుగైదు రోజులకు ఒక సారి ట్యాంకర్లను పంపుతున్నాయని, దీంతో సమస్య తలెత్తుతుందని ఆయా బంకుల యాజమాన్యాలు చెప్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 బంకులు ఉండగా, ఇప్పటికే నిల్వ లేక కొన్ని మూతపడ్డాయి. పెట్రోల్ ఉన్న బంకులు మాత్రమే పని చేస్తున్నాయి. అవి ద్విచక్ర చోదకులతో కిక్కిరిసి ఉంటున్నాయి. ఒక పక్క కొరతతో పాటు, ఇంధనం దొరకదేమోనన్న ఆందోళనతో కొందరు ఏకంగా క్యాన్‌లు పట్టుకుని బంకుల వద్దకు వస్తున్నారు. గతంలో ద్విచక్ర వాహనాలకు ఒకటి రెండు లీటర్లు పట్టించుకునే వారు ఇప్పుడు ఏకంగా ఫుల్ ట్యాంకు చేయించుకుంటున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి మరి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఇంధనంపై ఆధారపడి జీవించే ఆటోవాలాలు కార్లలో వచ్చే వారికి ఎన్ని లీటర్లు కావాలన్నా ఇస్తున్నారని,తమకు మాత్రం ఐదు లీటర్ల కంటే ఎక్కువ ఇవ్వడం లేదని గగ్గోలు పెడుతున్నారు. పలు చోట్ల వివిధ పనులకు వెళ్లే కూలీలు సైతం బంకుల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం రబీ కోతలు సాగుతున్నాయి. వరి పంటకు చేతికొచ్చిందన్న ఆనందంలో ఉన్న అన్నదాతకు డీజిల్ కొరతతో వరి కోత యంత్రాలు కదలక ఆపసోపాలు పడాల్సి వస్తుంది. చీమకుర్తి, బల్లికురవ గ్రానైట్ పరిశ్రమలో కూడా డీజిల్ లేక పనులు నిలిచిపోయాయి. గత నాలుగు రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న కిలోమీటర్ల కొద్ది క్యూలైన్లు, నోస్టాక్ బోర్డులు ప్రజల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించి సరఫరా పెంచాలని ఆదేశించారు. అధికారులు ఆయనకు సరఫరా 50శాతం పెంచామని, గణాంకాలు వివరిస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం ఇంకా చక్కబడలేదు. వాస్తవానికి ఇక్కడ సమస్య ఇంధనం లేకపోవడం కాదు. సరఫరా వ్యవస్థలో తలెత్తిన సమన్వయ లోపం, ప్రజల్లో నెలకొన్న భయం. ప్రభుత్వం ఎన్ని కిలోలీటర్ల చమురును మార్కెట్‌లోకి విడుదల చేసిందన్నదానికంటే సామాన్యుడికి బంకు వద్ద పెట్రోల్ దొరుకుతుందన్న నమ్మకాన్ని కలిగించడంలో విఫలమవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ప్రభుత్వం పెట్రోల్ సంస్థలపై మాట్లాడి సరఫరాను



వేగవంతం చేసినట్లు చెప్తున్నా ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగాలంటే బంకులు నిరంతరాయంగా పని చేయాలి. స్టాక్ ఉందని కాగితాల మీద చెప్పడం కంటే కంటికి కనిపించేలా అన్ని బంకుల్లో ఇంధనం అందుబాటులో ఉంచడమే సమస్యకు అసలైన పరిష్కారం. ఇలాగే బంకులు మూతపడితే ఇంకా ఎక్కువ పానిక్ అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**- జిల్లాలో ఇంధన కొరత లేదు: జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

జిల్లాలో ఇంధన కొరత లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాకలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వార్తల నేపథ్యంలోసోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై సోషల్ మీడియాలో రావడం వలన ప్రజలు ఆందోళన చెంది పెట్రోల్, డీజిల్ దొరకదేమో అన్న ఆలోచనతో బల్క్‌గా తీసుకువెళ్ళడంతో ఈ పరిస్థితి ఏర్పడటం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 195 పెట్రోల్ బంకులు ఉన్నాయని, ప్రతి పెట్రోల్ బంకు వద్ద ఒక కానిస్టేబుల్‌ను, ఒక వీఆర్వోను నియమించి పూర్తి స్థాయిలో ఆ పెట్రోల్ బంకుపై పర్యవేక్షణ ఉండేలాచర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత మండల పరిధిలోని పెట్రోల్ బంకులను పర్యవేక్షించేలా సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

**ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ, జేసి..**

జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఉదయం నుండి జిల్లాలోని అన్నీ పెట్రోల్ బంకల సరఫరా, వినియోగంపై డేటాను తెప్పించుకుని మానిటరింగ్ చేయడంతో పాటు కొన్ని పెట్రోల్ బంక్‌లను కూడా స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వాహనదారులకు ప్రాధాన్యత ఇస్తూ వెహికల్‌తో వెళ్ళిన వారికి ఇంధనం కొట్టడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా జిల్లా యంత్రాంగం ఆదేశాలు పాటించని,బల్క్‌గా ఇంధనాన్ని అమ్మిన సంబంధిత పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం

**చీమకుర్తి, ప్రభాతవార్త**



చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరిగి న వీర వెంకట రమా సహి త సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం సోమవారం సాయంత్రం కమనీయంగా జరిగింది.మాజీ మంత్రి వర్యులు,ఆలయ వ్యవస్థాపక ధర్మ కర్తలు శిద్దా రాఘవ రావు, శిద్దా లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా వెంకట ప్రసాద్ దంపతులు,శిద్దా బాలాజీ దంపతులు కళ్యాణం ఉభయ దాతలగా సోమవారం రాత్రి జరిగి న వీర వెంకట రమా సహి త సత్యనారాయణ స్వామి వారి సామూహిక కళ్యాణంలో చీమకుర్తి కి చెందిన సుమారు 50 మంది పు ణ్య దంపతులు పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ వెంకట్ హరి కుమరా చార్యులు కల్యాణ క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహింపచేశారు.ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు దంపతులు కల్యాణం పునస్కరించు కొని స్వామి వారికి అమ్మవారికి పట్టు వస్త్రాలు, రజిత యజ్ఞోపవేతం, ప్రత్యేక ముత్యాల తలంబ్రాలు,పూలు, పండ్లు సమర్పించారు. వేద మంత్రాలు,మంగళ వాయిధ్యా ల సందడి నడుమ కల్యాణం



కన్నుల పండువగా నిర్వహించారు.కళ్యాణం ప్రధాన ఘట్టం మంగళ సూత్ర ధారణ అత్యంత కన్నుల పండువలా నిర్వహించారు.అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు, కుటుంబ సభ్యులతో కలసి రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కల్యాణ మహోత్సవం వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.కల్యాణ మహోత్సవం అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు మాట్లాడుతూ శ్రీ హరిహర క్షేత్రంలో ప్రతి శుద్ధ ఏకాదశి సందర్భంగా ఇప్పటి వరకు సుమారు 850 మంది పుణ్య దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం లో పాల్గొనడం చాలా సంతోషం గా వుంది అని,అదే స్ఫూర్తి తో భక్తుల సహకారం, భగవంతుని అనుగ్రహం ఈ కళ్యాణం నిర్వహించాలని అనుకోవడం మీరందరు కళ్యాణం బాగస్వాములు కావడం భగవంతుడు కరుణా కటాక్షలతో విజయ వంతం అయిందని. కని విని జరగని రీతిలో వీర వెంకట రమా సహిత సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం మన క్షేత్రంలో జరిగడం చాలా సంతోషం అని అన్నారు. స్వామి వారి కృపతో సమస్త మానవాళి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా పాండురంగరావు దంపతులకు,శిద్దా సుధాకర్ దంపతులకు, స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు,వేద ఆశీర్వదాలు అందచేసారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో కల్యాణానికి విచ్చేసిన భక్తులందరికి కల్యా ణ తలంబ్రాలు,తీర్థప్రసాదాలు, అల్పాహారం అందచేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహిత, అదృశ్యం పై కేసు నమోదు

**బల్లికురవ ఏప్రిల్ 27( ప్రభాతవార్త)**

మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన రజని అనే వివాహిత అదృశ్యంపై సోమవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు వివరించారు. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన రజనీని కొండాయపాలెం గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిపించారు. మనస్పర్థలు కారణంగా ఆమె ముక్తేశ్వరంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈనెల 17 నుండి రజిని కనిపించడం లేదని సోదరుడు రామకోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతతో పనిచేయాలి: కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మాధురి, డిపిఓ వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి అర్జీలను పరిశీలించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వ్రాతపూర్వకంగా సమర్పించారు. కలెక్టర్ ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. సమస్యలను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అర్జీలు పరిష్కరించే సమయంలో బాధితులు సంతృప్తి చెందే విధంగా ఉండాలని తెలిపారు. అదే సమస్యపై మళ్లీ అర్జీలు రావకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రతి వినతిని నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజలకు సమయానికి సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలని సూచించారు. అధికారుల సమన్వయం కీలకమని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 263 వినతులు అందాయి. భూ సమస్యలు, రెవెన్యూ సంబంధిత అంశాలు, సంక్షేమ పథకాల సమస్యలు ఎక్కువగా వచ్చాయి. వచ్చిన ప్రతి అర్జీపై వెంటనే చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. అవసరమైతే స్థల పరిశీలన చేయాలని సూచించారు. ప్రజలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించిన వివరాలు సేకరించారు. సమస్యలపై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలో కోర్టు సెంటర్ రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ అధికారులు, జిల్లా కోర్టు పీపీ, బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పరిశీలించడం జరిగింది. కోర్ట్ సెంటర్ రోడ్డు నందు 1.20 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు పరిశీలించడం జరిగింది. కోర్టు లోపల క్యాంటిన్, ఎస్‌బీఐ బ్యాంకు, అసోసియేషన్ కార్యాలయం వారం రోజులలో కాలి చేయాలి అని తెలియజేశారు. రోడ్డు విస్తరణకు దయచేసి మీ అందరూ సహకారం అందించాలని బార్ అసోసియేషన్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడటం జరిగింది. ఇప్పటికే 6 నెలలు గడిచిన విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంపై మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా జనార్దన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం.. అవినీతి తావులేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని, ప్రజలకు మంచి పనులు చేసినప్పుడే ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. అనుకున్న సమయానికంటే ముందే పూర్తి చేయాలని వారికి సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు తగినట్లుగా పనులు జరిగేలా చూడాలని, నిర్లక్ష్యం, అవినీతికి చోటులేకుండా సకాలంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని దామచర్ల అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పీపీ అజయ్‌బాబు, అడ్వకేట్ బోడ్డు భాస్కర్, కమీషనర్ రాంభూపా ల్‌రెడ్డి, ఎంఈ ఐసయ్య, విద్యుత్ అధికారి డీఈ హరిబాబు, నగర టీడీపీ అధ్యక్షులు బండారు మదన్, టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బల్లికురవలో ప్రారంభమైన ఆయిల్ కష్టాలు

**బల్లికురవ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**





మండలంలో పెట్రోల్,డీజిల్ కష్టాలు ఆరంభమయ్యాయి.శనివారం నుండి స్థానికంగా గ్రానైట్ క్వారీలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు సామర్థ్యానికి సరిపడా డీజిల్ లభించకపోవడంతో పనులను సగానికి పైగా తగ్గించి వేశాయి. చిన్న చిన్న గ్రానైట్ క్వారీలలో పనులు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రం ఒక కంపెనీకి చెందిన పెట్రోల్ బంకుకు ఆయిల్ ట్యాంకర్ వచ్చిందన్న సమాచారంతో వాహనదారులు బారులు తీరారు. పెట్రోల్ బంకు నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ రవి నాయక్, ఎస్సై నాగరాజు, వీఆర్వో అశోక్, స్థానిక పెట్రోల్ బంకుల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు.లారీకి రూ.1000, డీజిల్,ద్విచక్ర వాహనానికి రూ.100 రూపాయలు పెట్రోల్ పోసే విధంగా క్షేత్ర స్థాయిలో ఉండి స్వయంగా పర్యవేక్షిస్తూ, వాహనదారులను ముందుకు నడుపుతున్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న యారవ శ్రీనివాసులు, నాయకులు

**పామూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



పామూరులోని అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో పడమర కట్టకిందపల్లి గ్రామ నివాసి ఎస్కే మహబూబ్ భాషా కుమారుడు వివాహం వేడుకలో కనిగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, బీజేపీ జిల్లా నాయకులు కొండిశెట్టి రమణయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎస్డీ అమీర్‌బాబు, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు మోబిన మౌలాలి, బూత్ కమిటీ ఇన్చార్జి ఎస్కే చిన్న హజరత్,ప్రభుత్వ హైస్కూల్ కమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు, టీడీపీ నాయకులు గోళ్ల వెంకటేశ్వర్లు, పిడుగు శ్రీను, తదితరులు నూతన దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## ఆలయాలనికి వాటర్ ఫ్రిజ్‌ను బహుకరించిన ఆకుపాటి

**పామూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు, కాపు యువనాయకులు ఆకుపాటి వెంకటేష్ పుట్టిన రోజు సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం పర్యాటక కేంద్రం భైరవకోనను కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. తన పుట్టిన రోజు కానుకగా భక్తుల సౌకర్యార్థం వాటర్ ఫ్రిజ్‌ను ఆలయానికి బహుకరించారు.

### లోకేష్‌ని అభినందించిన కోటపాటి జనార్ధన్‌రావు



**పామూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులుగా యువనేత విజన్ ఉన్న నాయకుడు నారాలోకేష్‌ను నియమించడం అభినందనీయమని జేఆర్‌కే ఫౌండేషన్ అధినేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పారిశ్రామికవేత్త కోటపాటి జనార్ధన్‌రావు తెలిపారు.

# నూతన ఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

**హనుమంతునిపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమంతునిపాడు ఎస్సై టి.రాజ్ కుమార్‌ని మండలంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి,శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ కుందురు నారాయణరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు చీకటి వెంకట సుబ్బయ్య, మండల యూనిట్ కన్వీనర్ దేవిరెడ్డి రాజారామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు కోటపాటి శేషయ్య, మండల ప్రధాన కార్యదర్శి మురాహరి నరసయ్య, దొడ్డిచింతల సర్పంచ్ బ్రహ్మారెడ్డి, సొసైటీ సింగిల్ విండో డైరెక్టర్ రాజేష్, ఎఫ్ఏలు కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రావినూతల కిషోర్ తదితరులు ఉన్నారు.

## సూరిశెట్టి నారాయణస్వామి దంపతులను సత్కరించిన స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల

**హనుమంతునిపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



హనుమంతునిపాడు మండలం నందనవనం పంచాయతీ ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి, వరలక్ష్మీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిట్యాల ధనలక్ష్మీ వారికివస్త్రములు సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, ఏలూరి తిరుపతిరెడ్డి, దేవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, వెలుగోటి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏబీఎన్ అధినేతపై ఎస్పీకి వైసీపీ పిర్యాదు

**కందుకూరు ఏప్రిల్ 27 ప్రభాతవార్త**




ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ ఇటీవల మహిళలను ఉద్దేశించి చేసిన అసభ్యకర వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కందుకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరోసారి డిమాండ్ చేసింది.ఈ మేరకు సోమవారం వైసీపి ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ బృందం ఒంగోలులో జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందచేశారు.గతంలో కందుకూరు డీఎస్పీ కార్యాలయంలో బుర్రా మధుసూదన్ యాదవ్ చేసిన ఫిర్యాదుపై ఇంతవరకు కందుకూరు పట్టణ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం ప్రకాశం జిల్లా ఎస్పీని ఒంగోలులో కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో జిల్లా అధికార ప్రతినిధులు ముప్పవరపు కిషోర్, బద్దిపూడి జయరావు, రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి వల్లూరి కోటేశ్వరరావు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఉచ్చులూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్ కు మీ ఫిర్యాదు కాపీని పంపిస్తామని సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని కలిసి మాట్లాడాలని తెలపటం జరిగినది.

# కాశినాయన గుడి దగ్గర అన్నదానం ఏర్పాటు

**గిద్దలూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీశ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం కుంట నరవ రోడ్ నందు ప్రతి సోమవారం పేదల కోసం సామాన్యుల కోసం అన్నీ ఉండి ఆదరించే వారు లేక ఆకలితో ఉండేవారు ఉండకూడదని కాశినాయన ఆజ్ఞ తోటి జరిగే కార్యక్రమం ఇది ఆనాటి నుండి ఈనాటి వరకు కాశినాయన దేవాలయాలు ఎక్కడుంటే అక్కడ భోజనాలు ఏర్పాటు చేసేవారని ఇందులో భాగంగా గిద్దలూరు లో కూడా దాతల సహకారంతో ప్రతి సోమవారం భోజనం ఏర్పాటు చేస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులు అన్నారు. స్వామివారికి పూజ అనంతరం పాల్గొన్న భక్తులకు ఇస్రాంత ప్రిన్సిపల్ ముత్తుముల వీరారెడ్డి కుటుంబ సభ్యులు కొత్తపల్లి గ్రామ నివాసి ఆయుర్వేద భోజనం ఏర్పాటు చేశారు. దాతలు ప్రతి సోమవారం ఆయుర్వేద భోజనం ఏర్పాటు కోసం సహకరించాలని ఆలయ కమిటీ వారు, బియస్ నారాయణ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ వడ్డీ వీరారెడ్డి, సూపరిడెంట్ పాలుగుళ్ల కాశిరెడ్డి, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి వెంకటేశ్వర్లు గౌడ్, ఏరు రమణారెడ్డి,ఆర్ట్ ఆఫ్ లివింగ్ యువాచార్య చేరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కాశినాయన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 3న వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం

**బల్లికురవ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



మండలంలోని కొనిదేన గ్రామంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని వచ్చే నెల 3న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు నాగ బ్రహ్మాచారి తెలియజేశారు. ఉదయం 6 గంటల నుండి గణపతి పూజ, కలశారాధన, నవగ్రహ మండపారాధన, హోమాలు, నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి, వేదమంత్రోచ్ఛరణలతో కళ్యాణోత్సవం, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నసంతర్పణ కార్యక్రమం కొనసాగుతుంది. స్వామివారి కళ్యాణ మహోత్సవంలో నూతన దంపతులు పాల్గొని, విజయవంతం చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ పిలుపునిచ్చింది.

### జిల్లా స్థాయి టోర్నమెంట్స్‌ను ప్రారంభించిన టీడీపీ నేతలు, అడకా, మద్దినేనిలు

**సంతనూతలపాడు, ఏప్రిల్27, ప్రభాతవార్త**



బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా సంతనూతలపాడు మండలం మైనంపాడులో బీఆర్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్స్‌ను రాష్ట్ర టీడీపీకార్యదర్శి ఆడకా స్వాములు, సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబులు ప్రారంభించారు. మైనంపాడు గ్రామ టీడీపీ అధ్యక్షులు ఆళ్లరంగారావు, మాజీ ఉప సర్పంచ్ గుండవరపు సుబ్బారావు, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు మాదాల వెంకట్రావు, గ్రామ యూత్ నాయకులు ఆళ్ల అవినాష్, గ్రామాల నాయకులు మన్నం వెంకటరావు, మాదాల నాగరాజు, ఈర్ల శ్రీనివాసరావు, దాసరి కృష్ణ, చాట్ల సుధాకర్, అట్లూరి అశోక్, ఆళ్ల బ్రహ్మయ్య, ఆకుల బ్రహ్మయ్య, షేక్ మస్తాన్‌వలి, షేక్ కరిముల్లా, ఉప్పుటూరి శ్రీహరి, వల్లెపు నరేంద్ర, యడ్లూరి నాగరాజు, పెయ్యల వేణు, దాసరి కోటేశ్వరరావు, పి.లక్ష్మీ నారాయణ, ఎస్.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

**సంతనూతలపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

సంతనూతలపాడు శాఖా గ్రంధాలయంలో పౌర గ్రంధాలయ వాఖ సంచాలకులు ఆదేశాల మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, కార్యదర్శి కే.కుమార్ రాజా, సూచనల మేరకు వేసవి విజ్ఞాన శిబిరం(సమ్మర్ క్యాంపు)ను ఈనెల 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు జరగనున్నట్లు గ్రంధపాలకుడు కే.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు.ఈ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, కథలు చెప్పడం, కథలు చదవడం, క్యారమ్, చెస్ వంటి వివిధ విద్యా, వినోదాత్మక కార్యక్రమాలలో శిక్షణ అందించబడునని గ్రంధపాలకులు సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్వచ్ఛందంగా శిక్షణ అందించదలచిన ఫ్యాకల్టీ సభ్యులు సంబంధిత గ్రంధాలయాధికారిని సంప్రదించగలరని ఆయన తెలిపారు.

## పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన అధికారుల బృందం

**సంతనూతలపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలంలో పెట్రోల్ బంకులను సోమవారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ ఎస్.ఎల్ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీలనఆదర్ ఎన్.మాబు సుభాని, డిప్యూటీ ఎంపీడీవో అరుణ కుమారి, వీఆర్వోలు పోలీసు శాఖ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు బృందం దగ్గర ఉండి వాహనదారులకు పెట్రోల్ కొట్టిస్తున్నారు. సంతనూతలపాడు మండలం గుడిపాడు డొంక, తక్కెళ్ళపాడు, చిలకపాడు, మైనంపాడు, సంతనూతలపాడు, రెడ్డిపాలెం, పేర్నమిట్ట తదితర కేంద్రాల్లో 8 పెట్రోల్ బంకులు కలవు. కొన్ని పెట్రోల్ బంకుల్లో స్టాక్ లేక వాటిని క్లోజ్ చేశారు. అధికారులు బృందం స్టాకులను పరిశీలిస్తున్నారు. సోమవారం రాత్రికి చాలా పెట్రోల్ బంకులకు స్టాకు రానున్నట్లు వారు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు తాలూకా సబ్ ఇన్‌స్పెక్టర్ చౌడయ్య, సంతనూతలపాడు పోలీసు సిబ్బంది, వీఆర్వోలు రవికుమార్, వెన్నెల, జాలయ్య, సంజీవరావు, వెంకటస్వామి, మరియకుమార్, మధు, శ్రీనివాసులు, హనుమంతరావు, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మాబు సుభాని, డిప్యూటీ ఎంపీడీవో అరుణ కుమారి, ఈ సందర్భంగా పెట్రోల్ బంకులను నిరంతరం తనిఖీ చేపడుతున్నారు.

## నూతన అవాప సహాయ కార్యదర్శి వేమూరికి ఘన సత్కారం

**సంతనూతలపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



ఒంగోలులో అవాప బాల భవనంలో ఒంగోలు అవాప 2026-2028 సంవత్సరాలకు నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంను అవాప అధ్యక్షులు కూరపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. గత 4 సంవత్సరాల కాలంలో అవాప ఈసీ మెంబర్‌గా నూతన సభ్యులను చేర్చుటలో విశిష్ట సేవలు అందించిన సంతనూతలపాడుకు చెందిన వాసవిక్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాదరావును అవాప తరుపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు,సంఘ అధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి కిశోర్,సెక్రటరీ శ్రీమన్నారాయణ తదితరులు అభినందించి నూతన కార్యవర్గంలో సహాయ కార్యదర్శిగా వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావును ఏకగ్రీవంగా ప్రకటించారు. సహాయ కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నికైన వేమూరి నాగేంద్ర ప్రసాదరావును సంతనూతలపాడు వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, సెక్రటరీ శిఖాకొల్లి రాజేష్, కోశాధికారి పామిడి సుధాకర్, గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, సెక్రటరీ ఎస్.జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మీ, గౌరవ అధ్యక్షురాలు జి.సులోచన, వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్‌లు జి.ఎల్ ప్రసాదరావు, చలువాది చంద్రావతి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్లిశెట్టి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ జి.శరత్‌బాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## పెట్రోల్ డీజిల్ కోసం బారులు తీరినవాహనదారులు

**త్రిపురాంతకం, ఏప్రిల్ 27,ప్రభాతావార్త**



మండల కేంద్రంలో గత వారం రోజులుగా పెట్రోల్, డీజిల్ బంకులకు సక్రమంగా సరఫరా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు నిత్యం ట్రాక్టర్లతో సేద్యం చేసే వారు కావడంతో డీజిల్ అందుబాటులో లేనందున ట్రాక్టర్లు ఇంటి వద్దనే పెట్టుకుని వ్యవసాయ పనులు చేసుకోలేక ట్రక్కుతో మట్టి ఇసుక రాళ్లు ఇతర సరుకులు పండిన పంటలను ఇంటికి చేర్చుకోలేక రైతులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ తరుణంలో సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన లారీలు కార్లు జీపులు ఫోర్ వీల్ చిన్న లారీలు, జెసిబి డోజర్ వంటి వాహనాలు డీజిల్ కొరతతో పక్కన పెట్టవలసి వచ్చింది దీంతో వాహన యజమానులకు బాడుగలు లేక నానా అవస్థలు పడుతున్నారు ఇది ఇలా ఉంటే పెట్రోల్ తో నడిచే వాహనాలు మోటార్ సైకిల్ పవర్ స్ప్రేర్ కార్లు కూడా పెట్రోల్ లేకపోవడంతో కొంత ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. ఇదే అదునుగా భావించిన కొందరు ఇటీవల గ్యాస్ కొరత మాదిరి రావడంతో గ్రామాల్లో పెట్రోలు డీజిల్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలకు అవసరం ముఖ్యమైన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అధిక ధరలకు విధిగా డీజిల్ కొనుక్కోవాల్సి వస్తుంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వల్ల డీజిల్ పెట్రోల్ తిరిగే వాహనాల యజమానులు ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.ఇటు చూస్తే ప్రభుత్వ అధికారులు ప్రెస్ మీట్లు ఏర్పాటు చేసి పెట్రోల్, డీజిల్ విషయమై ఇలాంటి కొరతలు లేవు ప్రజలు ఇబ్బందులు పడవద్దని గంటా పదంగా చెప్తున్నా, ఒకపక్క కొరత కళ్ళకు కట్టినట్లు కనబడిన నేపథ్యంలో సోమవారం ఒకసారిగా డీజిల్ పెట్రోల్ రావడంతో లారీలు ట్రాక్టర్లు యజమానులు పెట్రోలు బంకుల వద్ద బారులు తీరి పోలీస్ భద్రతలతో డీజిల్ పెట్రోలు బంకుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారు తగు చర్యలు చేపట్టి డీజిల్, పెట్రోల్ సరఫరా చేసి ప్రజలకు ఉన్న ఇబ్బందులు, అపోహలు తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# ఘనంగా ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలు

**సింగరాయకొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**




రాష్ట్ర పి.ఏ.సి సభ్యులు, కొండెపి నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలుమండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపం లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో సురేష్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. సి.ఈ.సి సభ్యులు మాదాసి వెంకయ్యతో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సురేష్ మాట్లాడుతూ ఆరు మండలాల కన్వీనర్లు ఏడాది కాలం విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. వారి నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో పార్టీ ముందంజలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలను ఆలస్యం చేయకుండా నిర్వహించాలని, వైఎస్సార్‌సీపీ తరపున తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.కొండెపి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలనీ పిలుపునిచ్చారు.అనంతరం కన్వీనర్లను శాలువాలతో సన్మానించి,జ్ఞాపికలు అందజేశారు.శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి సురేష్ కృతజ్ఞతలు చెప్పారు.తొలుత అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆరు మండలాలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**సింగరాయకొండ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మండలంలో నమోదైన మద్యం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, మూడు వేలు జరిమానా విధించినట్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి లీలా శ్యాం సుందరి సోమవారం తీర్పు వెలువరించారు.2024 నవంబర్ 19న సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నమోదైన కేసులో సాదం కొండయ్య (60), అవులవారి పాలెం, సోమరాజుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం సెక్షన్ 34(ఏ) కింద నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది.ఈ జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.అనంతరం నిందితుడిని ఒంగోలు జిల్లా జైలుకు తరలించాలని కోర్టు ఆదేశించింది. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. వరకుమారి వాదించగా, సింగరాయకొండ ఎస్ఐ బి. మహేంద్ర దర్యాప్తు చేశారు. హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీహరి సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి సహకరించారు.

## పర్చూరు వారి పాలెం దొంగతనం కేసు - నిందితుడు అరెస్ట్

### - రిమాండ్‌కు తరలింపు



**పొన్నలూరు, ఏప్రిల్ 27 ,ప్రభాతవార్త**

మండలంలోని పర్చూరు వారి పాలెం గ్రామం జగనన్న కాలనీలో ఈ నెల 24న జరిగిన దొంగతనం కేసును పొన్నలూరు పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, అతనికి రిమాండ్ విధించారు.స్థానిక ఎస్ఐ పి. సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, తాళం వేసిన ఇంటి తలుపు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడని సమాచారం అందింది.దీంతో పరిసర ప్రాంతాల సీసీ కెమెరాలను పరిశీలించి, కొంతమందిని విచారించగా నిందితుడు దొంగిలించిన వస్తువులను ఆటోలో తరలించినట్లు సమాచారం లభించింది. దర్యాప్తు కొనసాగించిన పోలీసులు నిందితుడిని కనిగిరి ప్రాంతానికి చెందిన కె. మనోహర్‌గా గుర్తించారు.అతనిపై నిఘా ఉంచిన పోలీసులు, కనిగిరి నుంచి కందుకూరుకు వస్తున్న సమయంలో వాహన తనిఖీలు నిర్వహించి అతన్ని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకుని విచారణ చేయగా నేరాన్ని అంగీకరించాడు.నిందితుడు మద్యం అలవాటుకులోనై ఇటువంటి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైనట్లు ఎస్ఐ తెలిపారు. ముఖ్యంగా పట్టపగలు ఇళ్ల తాళాలు పగులగొట్టి వేగంగా దొంగతనాలు చేయడం అతని విధానమని తెలిపారు.అతని వద్ద నుంచి మాక్స్ వెల్ గ్రేవీ కంపెనీ మెషిన్,హోమ్ థియేటర్, కార్ బ్యాటరీలు, మైక్ సెట్ వంటి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మండలంలో దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# డీజల్, పెట్రోల్ కొరత సృష్టిస్తే చర్యలు

**తాళ్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



పెట్రోలు బంకుల నిర్వాహకులు డీజిల్, పెట్రోలు కొరత సృష్టిస్తే ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ జి. ఫణీంద్ర, ఎస్ఐ ఎస్. మల్లికార్జున రావులు స్పష్టం చేశారు. మండలంలోని బొద్దికూరపాడు, తాళ్లూరు, తూర్పు గంగవరం లో ఉన్న పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. పెట్రోలు బంకులో స్టాక్ లేదని వచ్చే వదంతులను ప్రజలు నమ్మ వద్దని చెప్పారు.పెట్రోలు బంకులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. వాహనదారులకు అవసరమైన మేర నింపే విధంగా చర్యలు తీసుకోవాలని యజమానులకు చూపించారు. ప్రతి బంకు వద్ద వీఆర్వోలను నియమించి జాగ్రత్తలు వహించాలా ఆదేశించారు. తనిఖీల్లో ఆర్ఐ ఎంవీఎస్‌సుధీర్ కుమార్,వీఆర్వోలు రమణారెడ్డి, శివారెడ్డి,పోలీస్,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ప్రతిష్ట మహోత్సవాలు

**- జెపిచెరువులో శ్రీశ్రీశ్రీ నిదానంపాటి లక్ష్మీదేవి అమ్మవారి ప్రతిష్ట**

**- గౌతవరంలో శ్రీ లక్ష్మీ సమేత రంగనాయక స్వామివారి ప్రతిష్ట**

**రాచర్ల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త**

మండలంలోని జెపి చెరువు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటల నుండి విశ్వక్సేన పూజ, సాయంత్రం 6 గంటలకు అగ్ని ప్రతిష్టాపన, అమ్మవార్లకు అష్టోత్తర నామార్చనలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు నక్కా వేంకటేశ్వర్లు, చెన్న లక్ష్మి, శ్రీనివాసులు, భాగ్యలక్ష్మి, రమణ, కృష్ణవేణి, పీవీ భాస్కరరావు దంపతులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. గౌతవరం గ్రామంలో కూడా శ్రీ లక్ష్మీ సమేత రంగనాయక స్వామి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పూజారులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, యంత్రములకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

# ప్రజలకు అందుబాటులో ఉండండి

### - ఎంపీడీవో వై.శంకరరావు



**కందుకూరు ఏప్రిల్ 27 ప్రభాతవార్త**

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని వలేటివారిపాలెం ఎంపీడీవో వై.శంకరరావు సూచించారు.సోమవారం ఆయన తన అదికార పర్యటనలో బాగంగా నూకవరం,అత్తంటివారిపాలెం బడేవారిపాలెం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజాసేవ సంక్షేమపథకాల అమలు ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ఇందుకోసం నిర్ధేశిత సమయాలలో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆయా కార్యాస్థానాలలో అందుబాటులో ఉండాలన్నారు. పర్యటించారు.ప్రజల్లో మంచి పేరుతెచ్చుకోవాలని సూచించారు.నిర్ధేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి శంకరరావు ఆదేశించారు.

## మహానేత అంబేద్కర్‌కు నివాళిగా చిత్రపటం అందజేత

**మార్కాపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి నివాళిగా మార్కాపురం మున్సిపల్ కార్యాలయానికి ఆయన చిత్రపటాన్ని సోమవారం బహుకరించారు. మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు సూచనల మేరకు నేషనల్ మహా దళిత్ పంచాయత్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ దీప్ చింతల ఈ చిత్రపటాన్ని మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని, సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహనీయుల చిత్రపటాలు ఉండటం ద్వారా వారి స్ఫూర్తి అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్లు జీ శ్యామ్ కుమార్, టి.ఖాదర్ వలి, విజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు చిన్న నరసింహ, ఫరూక్, శ్రీనివాసులు, చైతన్య, కాంట్రాక్టర్ లింగమయ్య,మాలల జేఏసీ జిల్లా అధ్యక్షులు ఎమ్.శాంతకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# కంభంలో ఘనంగా వాసిరెడ్డి వెంకటాద్రి జయంతి

**కంభం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త**

రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా కంభం పట్టణంలోని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసిఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ఎంఈఓ అబ్దుల్ సత్తార్ పాల్గొని మాట్లాడుతూ వాసిరెడ్డి వెంకటాద్రి ఆశాయలను ప్రతిఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలనిసూచించారు.ఆయన అడుగు జాడలను ప్రతిఒక్కరు ఆచరిస్తూ ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ చిన్ని, పద్మావతిదేవి, శేఖర్, వెంకటేశ్వర్లు,కాంతారావునాయక్ తదితరులు పాల్గొన్నారు.



mrk-7_mrk-7.qxd 4/27/2026 11:58 PM Page 1



# హౌసింగ్ ఉద్యోగుల ఐక్యతకు నాంది

**- జేఏసీ జిల్లా కమిటీ ఎంపిక**



**మార్కాపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (హౌసింగ్) ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ఆదివారం ఘనంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లాలోని వివిధ మండలాల నుండి హౌసింగ్ ఉద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ నాయకులు కమిటీ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, ఖజాంచి తదితర పదవులకు ప్రతినిధులను ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ హౌసింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యతే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా తెలియజేయడానికి జేఏసీ వేదికగా నిలవాలని సూచించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సేవా భద్రత, సంక్షేమం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శుభాకాంక్షలతో అభినందిస్తూ, భవిష్యత్తులో ఉద్యోగుల ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని హౌసింగ్ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

# బాబా సేవలో చలివేంద్రం..

**- మార్కాపురంలో మజ్జిగ వితరణ ప్రారంభం**



**మార్కాపురం, ఏప్రిల్ 27 ప్రభాత వార్త**

వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమంగా మార్కాపురంలోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. నెహ్రూ బజార్‌లోని మందిరం తరపున సోమవారం ఉదయం కంబం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు పేరం సత్యనారాయణ, కార్యదర్శి గోపాలుని హరి హరరావు, కోశాధికారి పిఎల్ఎన్వి నాగరాజు డీఎస్పీని సత్కరించారు. ముఖ్య అతిథిగా బీజేపీ నియోజకవర్గ నాయకులు పీవీ కృష్ణారావు హాజరై సేవా కార్యక్రమాన్ని అభినందించారు. మజ్జిగ పంపిణీకి దూళిపాళ మధుసూదన్ తదితరులు సహకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాలుని కృష్ణమోహన్, గోపిశెట్టి కొండయ్య, కరీం, విజయ్, సూరే నాగేశ్వరరావు, మహిళా సంఘ సభ్యులు బొంతల భారతి, అరుణ, సుబ్బరత్నమ్మ, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు. మందిరం మేనేజర్ అంగం సతీష్ నాయుడు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రతి గురువారం ఇదే విధంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మందిరం కార్యదర్శి తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ కృతిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**- సిఐ అల్తాఫ్ హుస్సేన్ హెచ్చరిక**



**మార్కాపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలో పెట్రోల్, డీజిల్ కృతిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు ఆదేశాల మేరకు, డీఎస్పీ యు నాగరాజు పర్యవేక్షణలో సోమవారం మార్కాపురం పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో సిఐ అల్తాఫ్ హుస్సేన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బంక్ నిర్వాహకులతో మాట్లాడి తగు సూచనలు అందించారు. కొన్ని చోట్ల పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నప్పటికీ లేవు" అని చెప్పి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజలకు కూడా సూచనలు చేస్తూ, అపోహల కారణంగా అవసరానికి మించి ఇంధనం నిల్వ చేయడం వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలో ఎలాంటి ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అందరూ సహకరించాలని సిఐ విజ్ఞప్తి చేశారు.

# పోలీసుల ముందుకు ప్రజల సమస్యలు

**- 27 ఫిర్యాదుల నమోదు**



**మార్కాపురం, ఏప్రిల్ 27 ,ప్రభాతవార్త**

ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో మార్కాపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "మీకోసం"కార్యక్రమం సోమవారం నిర్వహించ బడింది. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు డిఎస్పీ యు. నాగరాజు మరియు పోలీస్ అధికారులు మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులు తమ సమస్యలను స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలీస్ అధికారుల ముందు ఉంచి, వ్రాతపూర్వక అర్జీలను సమర్పించారు. అధికారులు ప్రతి ఫిర్యాదుదారుతో ముఖాముఖీగా మాట్లాడి, వారి సమస్యలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 27 ఫిర్యాదులు నమోదు కాగా, వీటిలో సివిల్, భూ వివాదాలు, ఆర్థిక తగాదాలు, మోసాలు (చీటింగ్), అత్తింటి వేధింపులు వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. అందిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, చట్టపరంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీప పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి సీఐ శ్రీనివాసరావు, వైపాలెం సీఐ కె. అజయ్ కుమార్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల ఘాట్ రోడ్డుపై భద్రతా చర్యలు

**- ప్రమాదాల నివారణకు కన్వేక్స్ మిర్రర్లు ఏర్పాటు చేసిన పోలీసులు**



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

నల్లమల అరణ్యంలో దోర్నాల- శ్రీశైలం ఘాట్ రోడ్డుపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదకర మలుపుల వద్ద వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించేలా ఆదివారం కన్విక్స్ మిర్రర్లు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, యర్రగొండపాలెం సీఐ కే.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రమాదకరమైన మలుపుల వద్ద 16 చోట్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. మరో ఆరు ప్రదేశాలలో త్వరలో ఏర్పాటు చేస్తాడని డీఎస్పీ నాగరాజు తెలిపారు. ముఖ్యంగా శ్రీశైలం వెళ్లే భక్తుల రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ ఘాట్ రోడ్డులో లోయలు, పెద్ద పెద్ద మలుపులు ఉండడం వలన తరచు రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవిస్తుంది. పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రమాదకర మలుపుల వద్ద వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించే అవకాశం ఉండడంతో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. శ్రీశైలం ప్రయాణించే భక్తులు వాహనదారుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# పర్చూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**మార్చూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

పర్చూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలపై వచ్చిన అర్జీల సమస్యలను తెలుసుకుని ఆయా సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కరించనున్నట్లు తెలియజేశారు.

మార్కాపురం వార్త



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కొనకనమిట్ల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

మండలంలోని 565 జాతీయ రహదారిలోని చిన్నారికట్ల - పెద్దారికట్ల మధ్యలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకునూరి కోటిరెడ్డి(43) అనే వ్యక్తి మృతి చెందాడు. కనిగిరి వైపు వెళ్తున్న పాల ట్యాకంర్ పెద్దారికట్ల నుంచి చిన్నారికట్లకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంపై వెళ్తున్న కోటిరెడ్డి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు కలిగి ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపు తున్నాడు. సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న కొనకనమిట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వడదెబ్బకు అయ్యబొట్లపల్లి రైతు మృతి

**యర్రగొండపాలెం, ఏప్రిల్ 27,ప్రభాతవార్త**



యర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లి గ్రామంలో సోమవారం వడదెబ్బతో ఉబ్బరవు వెంకట రాజులు అనే రైతు మృతి చెందారు. తనకున్న రెండెకరాల పొలంలో పనులు చేసుకుంటు ఉండగా, దప్పిక కలగడంతో పరిసరాలలో ఎక్కడ మంచినీరు దొరకక పోవడంతో అక్కడికక్కడే పొలంలో కింద పడిమరణించినట్లు తెలుస్తుంది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో రైతులు, కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## నూతన వధూవరులు ఇమ్రాన్ - అఫ్రీన్‌లను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ జానీ భాష-రజియా దంపతుల కుమారుడు షేక్ ఇమ్రాన్ భాష, అఫ్రీన్‌ల వలిమా వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలోని ఆవుల తిరుపతిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది. ఈ వేడుకకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకను సాంప్రదాయబద్దంగా నిర్వహించగా, అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, బుల్ల బాలబాబు, చిలకపాటి లక్ష్మయ్య, జకరయ్య, మూలే చిన్న బ్రహ్మారెడ్డి, వెన్న శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, నజుముద్దిన్, నరసింహారావు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**- కలెక్టర్ ఎం. విజయ సునీత**





**మార్కాపురం, ఏప్రిల్ 27 ప్రభాత వార్త**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే రెవెన్యూ సంబంధితఅర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని పేర్కొన్నారు. వీటి పరిష్కారానికి రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సూచించారు. వేదికలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. ప్రజలు తృప్తి చెందే విధంగా సమస్యలను పరిష్కరించడం ముఖ్యమని, అర్జీదారులతోమర్యాదపూర్వకంగా వ్యవహరించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 168అర్జీలు స్వీకరించగా, అందులో 112 రెవెన్యూ సంబంధితవి, 56 ఇతర సమస్యలకు సంబంధించినవిగా అధికారులు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాలో జరుగుతున్న జనాభా గణాంకాలు, ప్రభుత్వ పథకాల పనితీరు సూచికలపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో రీసర్వే కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ వేదికకు జిల్లా స్థాయి అధికారులే హాజరు కావాలని, క్రిందిస్థాయి అధికారులు హాజరు కాకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్, కనిగిరి ఆర్డీవో శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూములు రక్షణే లక్ష్యం

**- అన్యాక్రాంతం అరికట్టాలి - కలెక్టర్ ఎం.విజయ సునీత**



**మార్కాపురం, ఏప్రిల్ 27 ,ప్రభాతవార్త**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో అటవీ భూములను రక్షించడం ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అటవీ రక్షణ కమిటీ సమావేశంలో ఆమె ఈ మేరకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 42శాతం భూమి అటవీ పరిధిలో ఉన్నదని పేర్కొన్నారు. ఈ భూములు ఎటువంటి అన్యాక్రాంతానికి గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అటవీశాఖ మరియు రెవెన్యూ శాఖలపై ఉందని స్పష్టం చేశారు. అటవీ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంకులుగా అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ మరియు రెవెన్యూ శాఖల మధ్య ఉన్న భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించి భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి కనీసం 1500 ఎకరాలను ల్యాండ్ బ్యాంక్‌గా గుర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఒంగోలు డీఎఫ్ఓ వినోద్ కుమార్, మార్కాపురం మరియు గిద్దలూరు డిడిపిటిలు అబ్దుల్ రవూఫ్, నిషా కుమారి, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు ప్రభాకర్, శివరామిరెడ్డి, అటవీశాఖ సిబ్బంది, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# దోర్నాలలో వ్యవసాయ మార్కెట్ యార్డు భవనాలు

## అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ నిరూపయోగమే..!

**- భవనాల కోసం వెచ్చించిన ప్రభుత్వ నిధులు వృధా**

**- మార్కెట్ యార్డు స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్**





**పెద్దదోర్నాల, ఏప్రిల్27, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండల కేంద్రంలో దశాబ్దాల క్రితం రైతుల అవసరాల కోసం నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డు భవనాలు నేటికి నిరూపయోగంగానే మిగిలిపోయాయి. రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్‌యార్డు భవనాలు ఉపయోగంలోకి రాకపోవడంతో ప్రజాధనం వృధా అయిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. వ్యవసాయ దిగుబడులు రైతులు నేరుగా విక్రయించేందుకు, మధ్య వర్తుల ఇబ్బందులు లేకుండా మార్కెట్ సదుపాయాల అందించేందుకు నిర్మించిన సువిశాల మార్కెట్ యార్డు ప్రస్తుతం పాడుబడిన స్థితిలో ఉంది. భవనాలు ఉపయోగంలో లేక వెలవెల పోతుండగా, స్థలం కూడా ఖాళీగా ఉండిపోవడంతో స్థానికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో విలువైన స్థలం ఇలాగే నిరూపయోగంగా ఉండడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ స్థలాన్ని ఆర్టీసీ బస్టాండ్‌కు లేదా పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఆస్తి నిరూపయోగంగా ఉండడంపై సంబంధిత అధికారులు స్పందించి, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా మార్కెట్‌యార్డు స్థలాన్ని వినియోగించకపోతే ప్రభుత్వ ఆస్తులు వృధా కావడం కొనసాగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దోర్నాల వ్యవసాయ మార్కెట్ యార్డు భవనాలు ఎందుకు ఇప్పటికీ ఉపయోగంలోకి రాలేదనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

# పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే తాటిపర్తి

**- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంలో చక్రం తిప్పే**

**నువ్వు ఆంధ్రప్రదేశ్‌లో డీజిల్, పెట్రోల్ కొరత సిగ్గుచేటు - ఎమ్మెల్యే ధ్వజం**



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గంలో డీజిల్, పెట్రోల్ కొరత తీవ్రంగా ఉందని, దీనిపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి, యర్రగొండపాలెం శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పంట కోతల సమయంలో డీజిల్ దొరక్క రైతులు, వాహనదారులు గంటల తరబడి బంకుల వద్ద క్యూ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కొరత లేదని ప్రకటనలు చేయడం సరికాదని, క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనించి సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇప్పటికే ఈ సమస్యను సివిల్ సప్లయ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని రైతులకు ఊరటనివ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. నేడు నియోజకవర్గంలోని పలు పెట్రోల్ బంకులను ఆయన సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఏపీలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడటానికి కూటమి ప్రభుత్వ అసమర్థతే కారణమని ఎమ్మెల్యే విమర్శించారు. సరైన ప్రణాళిక లేకపవోడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచి ఉన్న వాహనదారులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. యర్రగొండపాలెం లాంటి ప్రాంతాల్లో రైతులు, రోజు వారీ కూలీలు తమ వాహనాలకు ఇంధనం లేక పనులు ఆగిపోతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వ పాలనలో అత్యవసర వస్తువులైన పెట్రోల్, డీజిల్ దొరకని పరిస్థితి రావడం దురదృష్టకరం. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముసాలారెడ్డి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్‌లతో పాటు మాజీ సర్పంచ్‌లు, ఆ పార్టీ శ్రేణులు ఉన్నారు.

## కాకి చెన్నమ్మకు నివాళులర్పించిన నాయకులు

**కొనకనమిట్ల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన కార్మికురాలు కాకి చెన్నమ్మ(62) గుండెపోటుకు గురై మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె కలిగి ఉన్నారు. మృతి చెందిన చెన్నమ్మ భౌతిక కాయాన్ని సోమవారం పాత్రికేయులు పి.బాలనరసయ్య, పీవీ కొండయ్య, ఆర్ఎంపీ వైద్యులు బి.వెంకటేశ్వర్లు, సీఐటీయు నాయకులు ఏ.శ్రీనివాసులు, నాయకులు పి.తిరుపతిరెడ్డి, వి.శ్రీనివాస్‌రెడ్డి, కే.లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మనాయుడు, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# డీజిల్, పెట్రోల్ కొరతను నివారించాలి

**- సిఐటియు డిమాండ్**

**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులలో డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడిందని ఈ కొరతను నివారించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి. ఆవులయ్య డీకేఎం రఫీ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కాపురం జిల్లాలో ఆటో కార్మికులకు డీజిల్ సరఫరా అందించాలని అన్నారు. డీజిల్ కొరతతో ఆటో ఇతర వాహన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డీజిల్ కొరతను నివారించాలని కోరారు. ఉచిత బస్సులతో అంతంత మాత్రం బాడుగలతో ఇబ్బందులకు గురవుతున్నారని, డీజిల్ కొరత కార్మికులపై మరో గుది బండగా మారి మరింత ఇబ్బందుల గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్, పెట్రోల్ కోసం బంకుల వద్ద క్యూ లైన్ లో ఉండవలసి వస్తుందన్నారు. పెట్రోల్ డీజిల్ సమస్యను వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28వ తేదీన అన్ని మండల కేంద్రాలలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీజిల్, పెట్రోల్ కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేయాలని వారు పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరతను నివారించలేని కూటమి ప్రభుత్వం

**- పెట్రోల్, డీజిల్ కొరతలేదని బుకాయించడం కూటమినేతలకు తగదు**

**- ఏపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, షేక్ సైదా**



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

రాష్ట్రంలో, దేశంలోనే ఎక్కడలేని విధంగా పెట్రోల్ డీజిల్ కొరతతో ప్రజల అల్లాడుతుంటే రాష్ట్రంలో ఎక్కడ డీజిల్ పెట్రోల్ కొరత లేదని కోటిని నేతలు బుకాయించడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ శాసనసభ్యులు షేక్ మస్తాన్‌వలి, ఏపీసీసీ అధికార ప్రతినిధి, ప్రకాశం జిల్లా డిసిసి అధ్యక్షులు షేక్ సైదా కూటమినేతలను తీవ్రంగా విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని పెట్రోల్, డీజిల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల ముందు ప్రజలు పడిగాపులు కాస్తున్నారని, కూటమినేతలకి రాష్ట్రప్రభుత్వానికి ప్రజలు వెతలు కనపడటం లేదని వాళ్ళు తీవ్రంగా విమర్శించారు, డీజిల్ పెట్రోల్ కొరత తీర్చలేని కూటమి నేతలు రాష్ట్రాన్ని ఏమి ఉద్ధరిస్తారని వారి ఎద్దేవా చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెట్రోల్ డీజిల్‌ను సరిపోయినంతగా సరఫరా చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒకసారి పెట్రోల్ బంకులను, గ్యాస్ ఏజెన్సీలను సందర్శిస్తే బార్లు తీరి ఉన్న వాహనాలు, వినియోగదారులు వెతలు అర్థమవుతాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు ఒలివేయటం మానుకొని డీజిల్ పెట్రోలు గ్యాస్ సరిపడేంత ప్రజలకు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ అలీ, మార్కాపూర్ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. జీవయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహానాబాను , గుంటూరు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఖలీల్, తర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, మార్కాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, షేక్ ఖాసిం, కే సామ్యూల్, షేక్ అల్తాఫ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక...**

మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని మార్కాపురం, తర్లపాడు మండలాలకు చెందిన దాదాపు 10 కుటుంబాలు జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ వలి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. షేక్ మహబూబ్ సుభాని, జీవయ్య, షేక్ ఖాసిం పీరా, షేక్ యాసిన్, కాలేశా, మహబూబ్ పీర, నాగరాజు, ఏసోబు, తదితరులు పార్టీలో చేరారు.

**ప్రపంచ ఛాంపియన్షిప్ గోల్డ్ మెడల్ సాధించిన శ్యామలకు సత్కారం...**

ఇటీవల థాయిలాండ్ లో జరిగిన పరుగు పోటీలలో ప్రపంచ శాంపియన్షిప్ గోల్డ్ మెడల్ సాధించిన మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల పిడి దోలా శ్యామలను సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ వలి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహానా భాను శాలువాతో, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం నాయకులు వెన్న నారాయణరెడ్డి, వీరాంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఐక్యతకు నిదర్శనం హనుమాన్ శోభాయాత్ర



**కనిగిరి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలో మే 10న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, కార్యక్రమానికి సంబంధించిన పోస్టరను, బైక్ స్టిక్కర్లను సోమవారం ఆవిష్కరించారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో గలటీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్ర కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా, హిందువుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా హిందువులందరూ ఏకతాటిపైకివచ్చి పెద్ద ఎత్తున పాల్గొని ఈ శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో భక్తి భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. మే 10న జరిగే శోభాయాత్రకు విస్తృత స్థాయిలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కనిగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వద్దిపాటి వెంకటేష్, ఈర్ల విజయ రామరాజు, కొబ్బరిబొండాల సుబ్బారావు, మల్లెల గోమ్స్, అభిలాష్, భాస్కర్, కోమటిగుంట్ల బాబురావు, పల్లా మాలకొండయ్య, నవీన్, నల్లబోతుల దొరసాని, అచ్చాల తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి కల సాకారం.. రైలు సేవలకు గ్రీన్ సిగ్నల్

**కనిగిరి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
కనిగిరి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. గుంటూరు–కనిగి మధ్య కొత్త ప్యాసింజర్ రైలు సేవ ప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ లభించడంతో ప్రాంత వ్యాప్తంగా ఆనంద వాతావరణం నెలకొంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గుండ్లకమ్మ – కనిగిరి నూతన రైల్వే మార్గం ద్వారా ఈ రైలు సేవను నడపాలని ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వారంలో ఆరు రోజులు డెమో రైలు నడపాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. గుంటూరు స్టేషన్ నుంచి బయలుదేరి కనిగిరి చేరుకుని తిరిగి గుంటూరుకే చేరే విధంగా రైలు నడపటం అనుకూలమని సూచించారు. తాత్కాలిక టైమింగ్స్ ప్రకారం గుంటూరు నుంచి ఉదయం 8.30 గంటలకు బయలుదేరే రైలు మధ్యాహ్నం 1 గంటలకు కనిగిరి చేరుతుంది. తిరుగు ప్రమాణంలో మధ్యాహ్నం 2గంటలకు కనిగిరి నుంచి బయలుదేరి సాయంత్రం 7 గంటలకు గుంటూరుకు చేరుకోనుంది. ఈ టైమింగ్స్‌ను ఖరారు చేసే ప్రక్రియకొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కనిగిరి ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలుఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పలు దశాబ్దాలుగా రైలు సౌకర్యం కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ఇది చారిత్రాత్మక ఘట్టంగామారింది. రైలు సేవ ప్రారంభమైతే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలకు ప్రయాణ సౌలభ్యం పెరగడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కనిగిరి ప్రజలందరూ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### దేవకి సేవలకు గౌరవ వందనం.. రాచపూటి వెంకటేశ్వర్లు ఘన సన్మానం





**కనిగిరి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
కనిగిరిపట్టణంలో ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. జాతీయ వాసవిసత్ర సముదాయాల అధ్యక్షులు, శ్రీశైల దేవస్థానంట్రస్టు బోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లును పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవి వీకేవీసీ జిల్లా క్లబ్ అధ్యక్షులు రాచపూటి వెంకటేశ్వర్లు సత్కరించారు. వాసవి జయంతి మహోత్సవాల సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవకి వెంకటేశ్వర్లును శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాచపూటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణంలో దేవకి వెంకటేశ్వర్లు చేసిన సేవలు విశేషమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి ఆయనచేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవకి శ్రీనివాసులు, బచ్చు రమేష్, కొలిశెట్టి వెంకటస్వామి, నర్రాపాటి మల్లికార్జున, గొంట్ల మల్లికార్జునరావు, కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ జయంతి ఉత్సవాలకు కదిరి బాబురావుకు ఆహ్వానం



**కనిగిరి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని కొత్తూరు ప్రాంతంలో మే 12న నిర్వహించనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావును కలిసి ఆహ్వాన పత్రికలందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు, పాట కచ్చేరి కార్యక్రమాలకు తప్పకుండా హాజరై ఆశీర్వదించాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరువారిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరారెడ్డి, బ్రహ్మారెడ్డి, అబ్బూలంఅంజిరెడ్డి, భూమిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, కే.వెన్నెన్న, కే.సుబ్బారెడ్డి, యాళ్లస్వామిరెడ్డి, భూమిరెడ్డి రామచంద్రారెడ్డి, తమ్మినేని రమణారెడ్డి, మూతే నాగిరెడ్డి, పైడాల రామచంద్రారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, మార్తల రామిరెడ్డి, ముత్యాల ప్రతాప్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న నాయకులు



**పామూరు, ఏప్రిల్ 27,ప్రభాతవార్త**
స్థానిక విరాట్ నగర్ కాలనీ వద్ద శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఆరాధన మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎస్‌డీ అమీర్‌బాబు, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు ఇరి కోటిరెడ్డి, పట్టణ టీడీపీ కార్యదర్శి నోసం నాగేంద్రచారి, టీడీపీ బీసీ సెల్ నాయకులు ముండ్లమూరి దొరసనయ్య, ఆలయ పూజారి ఎస్.సుకేష్ చారి, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

### వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మహిళా సాధికారత కార్యక్రమం



**సీఎస్‌పురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
కదిరి బాబురావు వ్యవసాయకళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు శీలంవారిపల్లి గ్రామంలో మహిళా సాధికారత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ స్టెఫి మహిళల ఆరోగ్యానికి పండ్లు, చిరుధాన్యాల వంటి పౌష్టికరమైన ఆహారం ప్రాముఖ్యతను గ్రామంలోని మహిళలకు వివరించారు. అదే విధంగా గర్భిణీ స్త్రీలకు పోషకాహార అవసరాలపై సూచనలు చేశారు. మహిళల భద్రతపై శక్తి యాప్ యొక్క ప్రయోజనాలు విద్యార్థులు గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రఫియా, ఈఏఓ వాణి, ఏఎన్ఎం అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఎరువుల డీలర్ల సమ్మె



**పొదిలి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
ఎరువుల తయారీ కంపెనీల ఒత్తిడిపై ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపుల యజమానులు తిరుగుబాటు చేశారు. ఆల్ ఇండియా అగ్రి ఇన్‌పుట్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పొదిలి పట్టణంలోని ఎరువులు, విత్తన విక్రయ సంస్థలన్నీ మూత పడ్డాయి. తమ సమస్యల పరిష్కారం కోసం డీలర్లు పెద్ద ఎత్తున గళమెత్తారు. సబ్సిడీ ఎరువులతో పాటు, తమకు అవసరం లేని ఉత్పత్తులను కొనుగోలు చేయమని కంపెనీలు డీలర్లపై ఒత్తిడి తేవడం మానుకోవాలన్నారు. రైల్వే స్టేషన్‌ల వద్ద కాకుండా, ఎరువులను నేరుగా డీలర్ల గోదాములకు లేదా అమ్మకపు కేంద్రాలకు చేరవేయాలని, దీని వల్ల డీలర్లపై పడుతున్న అదనపు రవాణా భారం తప్పుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న మార్జిన్ ఏ మాత్రం సరిపోవడం లేదని, ఎరువులపై కనీసం 8 శాతం మార్జిన్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమసమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహారాష్ట్ర స్టేట్ అగ్రికల్చర్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయానికి అనుగుణంగా తాము ఈ నిరసన చేపట్టామన్నారు. రాబోయే నెల రోజుల్లోగా తమ డిమాండ్లను పరిష్కరించకపోతే రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందే నిరవధిక బంద్‌కు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాల యజమానులు భవాని కిరన్, ఎర్రమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యాదల కోటేశ్వరరావు, యాదాల వెంకటేశ్వర్లు, సుబ్బారావు, శశికుమార్, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి వారి దేవస్థానం

### బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఉగ్ర






**పామూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం చిన్నగొల్లపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈనెల 29వ తేదీ నుండి మే4వ తేదీ వరకు శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు, హనుమంతునిపాడు మండల ఎస్సై టి.రాజు కుమార్‌ని కలిసి తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

## నేడు అద్దంకి పట్టణంలో విద్యుత్ కోత

**అద్దంకి , ఎఫ్రియల్ 27, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలో మంగళవారం కొత్త లైన్ వేసే పని నిమిత్తం నరసరావుపేట రోడ్డులోని కరెంట్ ఆఫీస్ నుండి భవాని సెంటర్, పోతురాజు గండి దగ్గర రోడ్డుకి రెండు వైపులా, విజయలక్ష్మి సినిమా హాల్, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిఇఇ ఎం దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సంస్థకు సహకరించవలసిందిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం దామోదర్ తెలిపారు.

### ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం

### వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చందోలు మణికంఠ నియామకం



**దర్శి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కందే నాగ రాజేష్, రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, ప్రకాశం జిల్లా గెలాక్సీ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, అలాగే ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షులు శిద్దా సుధీర్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన చందోలు మణికంఠ రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన చందోలు మణికంఠను శిద్దా రాఘవరావు, సుధీర్ కుమార్‌లు అభినందించారు. సంఘ అభివృద్ధికి మణికంఠ కృషి చేయాలని, యువతను ఒక వేదికపైకి తీసుకువచ్చి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, యువనేత శిద్దా సుధీర్‌కుమార్‌లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

## ఎడ్లపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

### - పాల్గొన్న నేతలు



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో జరుగుతున్న మండువా వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో గుమ్మడి సాయిబాబా నిర్వహిస్తున్న జిల్లా ఎడ్ల పోటీల చివరి రోజు కార్యక్రమంలో గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, నుడా ఛైర్మన్ షేక్ రియాజ్, జనసేన నాయకులు కంది రవిశంకర్‌లు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన పోతినేని శ్రీనివాసరావు మొదటి బహుమతిగా ఏర్పాటు చేసిన బుల్లెట్ బైక్‌ను ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లాలోని పెట్రోల్ బంకులను ఆకస్మిక తనిఖీ చేసిన

### బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామమేశ్వరరావు

### - పెట్రోల్ కొరత లేదు.. కేవలం సరఫరా అంతరాయం వలన ఆటంకం ఏర్పడింది

### - జిల్లా ప్రజలు ఎవరు కంగారు పడొద్దు



**చీరాల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**
పెట్రోల్ కొరత దృష్ట్యా ప్రజలు అధైర్య పడవద్దని, కేవలం సరఫరా లోపం వలన ఏర్పడిన తాత్కాలిక సమస్య మాత్రమేనని జిల్లా ఎస్పీ తెలిపారు. 27వ తేదీ సోమవారం రోజున చీరాల పట్టణంలోని ఎస్ఎస్ ఫీలింగ్స్ స్టేషన్, మామిడి ఫిల్లింగ్ స్టేషన్, అనూష ఫిల్లింగ్ స్టేషన్ బంకులను స్వయంగా పరిశీలించి స్థానిక యజమానులతో పరిస్థితులు గురించి చర్చించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకూడదని పలు సూచనలు చేశారు. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తలు కొన్ని వేదికలలో ప్రచారంలోకి రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొని, వాహనదారులు ఒకే సారి పెట్రోల్ బంకుల వద్దకు రావడంతో కొన్ని చోట్ల తాత్కాలికంగా రద్దీ పెరిగిన పరిస్థితి కనిపిస్తోందన్నారు. అయితే బాపట్ల జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు సమన్వయంతో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. అలాగే ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితి. ఒక్కసారిగా పెరిగిన డిమాండ్ కారణంగానే ఏర్పడిందని అందువల్ల ప్రజలు ఎలాంటి ఆందోళనకు లోను కాకుండా అవసరమైనంత మాత్రమే పెట్రోల్, డీజిల్ వాహనాలకు నింపుకోవాలని సూచించారు. బ్లాక్‌లో ఎక్కడైనా పెట్రోల్, డీజిల్ విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే నిఘా ఉంచామని, అలాగే పెట్రోల్ బంకుల వద్ద స్టాక్ ఉన్నప్పటికి లేదని తెలిపి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పెట్రోల్ బంకుల యజమానులు ఇలాంటి పరిస్థితుల్లో వాహనదారులకు పూర్తి స్థాయిలో పెట్రోల్ బంకుల వద్ద శాంతి భద్రతలకు భంగంకలగకుండా పోలీసు శాఖ పర్యవేక్షణను పెంచి, ట్రాఫికన నియంత్రణతో పాటు అవసరమైన చోట బందోబస్తు ఏర్పాటు చేశామని, సోషల్ మీడియాలో వస్తున్న సమాచాన్ని నిర్ధారించుకోకుండా నమ్మవద్దని, అధికారికంగా వచ్చే సమాచారాన్నే నమ్మాలని, ప్రజలందరూ సహకరించి, శాంతంగా బాధ్యతగా వ్యవహారిస్తే ఈ పరిస్థితి త్వరలోనే సాధారణ స్థితికి వస్తుంది. మీ భద్రత, మీ సౌకర్యం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ మీతోనే ఉంటుంది. అపోహాలకు లోనవ్వకుండా అవసరమైనంత మాత్రమే పెట్రోల్, డీజిల్ వినియోగించాలని సూచించారు. ఈ కారక్యక్రమంలో బాపట్ల డీఎస్పీ మొయిన్, చీరాల ఒకటో పట్టణ, రెండో పట్టణ రూరల్ ఎస్సైలు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

### - ప్రభుత్వానికి విశ్వహిందూపరిషత్ విజ్ఞప్తి



**కందుకూరు ఏప్రిల్ 27 ప్రభాతవార్త**
గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ప్రకాశం జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నారు. ఈ మేరకు సోమవారం గో సన్మాన్ ఆహ్వాన్ అభియాన్ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా కందుకూరులో సబ్‌కలెక్టర్ పరిపాలనాధికారి శాంతికి, వలేటివారిపాలెం తహసిల్దార్ మధుసూదన్ రావులకు ప్రధాని మోడీ, రాష్ట్రపతి, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్‌ల అడ్రస్ చేస్తూ రాసిన వినతిపత్రాలను ఆందచేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ఉప్పుటూరు కొండప నాయుడు, ఆర్ఎస్ఎస్ కందుకూరు ఖండసంగ్ చాలక్ తన్నీరు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. వలేటివారిపాలెం ఎమ్మార్వో గారికి కూడా వినతిపత్రం సమర్పించడం అయింది. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు బిజెపి మండల అధ్యక్షుడు ముతకని వీర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక



**అద్దంకి, ఎఫ్రియల్ 27, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా యూనిట్ ఎన్నికలు అద్దంకిలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు అధికారిగా కరి కమలేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా వి.వి.గోపాలరావు వ్యవహరించగా, రాష్ట్ర పరిశీలకునిగా డి. సుబ్బారావు బాధ్యతలు నిర్వహించారు. ప్రకాశం జిల్లాలోని దర్శి, సింగరాయకొండ, ఉలవపాడు, కొత్తపట్నం, అద్దంకి, ఒంగోలు, కందుకూరు యూనిట్లకు చెందిన ప్రతినిధులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎన్నికల్లో యస్. విశ్వరూపాచారి జిల్లా అధ్యక్షుడిగా, అసోసియేట్ అధ్యక్షులుగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జి.మురహరి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గర్నెపూడి ప్రభాకరరావు, జనరల్ సెక్రటరీగా తోట రాఘవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కొల్లి వెంకారెడ్డి, మక్కెన వెంకటేశ్వర్లు, కె. చెన్నయ్య, ఇ.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆర్. వెంకటరెడ్డి, బి. రాజయ్య, కార్యదర్శులుగా బి. వెంకటేశ్వరరావు, వి. హనుమంతరావు, జి.అంజయ్య, డి. వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారిగా వి. శంకరరెడ్డి ఎన్నికయ్యారు. ఈ నూతన కార్యవర్గం 2026 ఏప్రిల్ 27 నుండి మూడు సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించనుంది. జిల్లా విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి తెల్లబాటి వేణుగోపాల రావు, పొన్నపల్లి బ్రహ్మానందం ఆతిథ్యమందజేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి యూనిట్ అధ్యక్షులు అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు, కోశాధికారి వారణాసి రఘురామశర్మ, కార్యదర్శి నిమ్మరాజు నాగేశ్వరరావు, పెండ్యాల వెంకయ్య, కె. పాపరావు, పొన్నపల్లి బ్రహ్మానందం, యోగయ్య పాల్గొన్నారు.

## వేసవిలో విద్యుత్ కోతలు లేకుండ చూడాలి

### - బ్రెక్ డౌన్‌లు లేకుండ చర్యలు చేపట్టాలి - సిఎండిల సమీక్షలో మంత్రి గొట్టిపాటి



**అద్దంకి, ఎఫ్రియల్ 27,ప్రభాతవార్త**
వేసవిలో విద్యుత్ కోతలు లేకుండ చూడాలి, బ్రెక్ డౌన్‌లు లేకుండ చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఎండిల సమీక్షలో అదేశించారు. సమీక్షకు హాజరైన మూడు డిస్కంల సీఎండీలు, టాన్స్ కో జేఎండీహజరు అయ్యారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని, విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బ్రేక్ డౌన్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి, ఉత్పత్తి పెంచేలా అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ అమలును మరింత వేగవంతం చేయాలని, పథకాల అమలుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టాలని, మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 6 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు ఆగస్టు నాటికి పూర్తి చేయాలని మంత్రి అదేశించారు.

### గ్రామీణ ఆలయాలలో నిత్య ధూపం వెలిగించేందుకు చర్యలు

### - త్వరలో సిఎంచే కార్యక్రమం ప్రారంభం - దాసరి వెల్లడి






**అద్దంకి , ఎఫ్రియల్ 27, ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంతంలో నిరాధారణకు గురి అయిన ఆలయాలలో నిత్య ధూపం వెలిగించేందుకు త్వరలో సిఎంచే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం సింగరకొండలో నిర్వహించిన ధార్మిక సదస్సుకు ట్రస్టు స్టేట్ కోఆర్డినేటర్ కొండలరావు అధ్యక్షత వహించారు. ఉగాది సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని డాక్టర్ దాసరి శ్రీనివాసులు పేర్కొన్నారు. ముందుగా డాక్టర్ శ్రీనివాసులు స్వామి వారి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆయనకు స్వామివారి తీర్థ, ప్రసాదాలు ఆశీర్వచనాలు అందజేశారు. అసిస్టెంట్ తిమ్మానాయుడు, పాలకమండలి చైర్మన్ చుండూరు మురళీ సుధాకరరావు ఆయనకు స్వామి వారి శేష వస్త్రాన్ని మెమోంటోను అందజేశారు. ఆయా కార్యక్రమాలలో హెచ్ డి పి టి స్టేట్ కోఆర్డినేటర్ సందిరెడ్డి కొండలరావు, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఏం తిమ్మా నాయుడు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, వేద పండితులు వంగాల హరి శంకరావధాని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు, చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, దేవదాయ శాఖ ప్రకాశం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, ఆధ్యాత్మికవేత్త రమాసుందరి, ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల, మార్కాపురం జిల్లాల నుండి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్లు, మండల కోఆర్డినేటర్లు ఐదు జిల్లాలలోని వివిధ దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు, ఆలయ అర్చకులు, ఆధ్యాత్మికవేత్తలు, నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మనం త్రిమూర్తులు, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకర్ దత్తు, జ్యోతి చంద్రమోళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జీవనది గుండ్లకమ్మను కాపాడుకుందాం

### డాక్టర్ దాసరి శ్రీనివాసులు



**అద్దంకి , ఎఫ్రియల్ 27, ప్రభాతవార్త**
జీవనది గుండ్లకమ్మను కాపాడుకునే ప్రయత్నం ముందుకు సాగాలని, జీవనది గుండ్లకమ్మ పుట్టిన గుండ్ల బ్రహ్మేశ్వరం నుండి కొత్తపట్నం దగ్గర సముద్రంలో కలిసే గుండాయపాలెం వరకు ఇరువైపుల కరకట్టలు నిర్మించాలని డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. అందులో భాగంగా పర్యావరణ పరిరక్షణలో సేవ సంస్థల భాగస్వామ్యంతో దేవత వృక్షాలను నాటి గుండ్లకమ్మను పరిరక్షించుకుందాం అని అందుకు ఆధ్యాత్మికవేత్తలు సేవా సంస్థలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు అనేకవిధాలుగా జీవనది గుండ్లకమ్మ పరిరక్షణకై పోరాటం చేస్తున్న మన్నం త్రిమూర్తులను వారి టీమును దాసరి శ్రీనివాసులు అభినందించారు. జీవనది గుండ్లకమ్మ పరిరక్ష మనందరి బాధ్యత అనే స్లోగన్ తో త్రిమూర్తులు ముద్రించిన విలువ కలిగిన జ్యూట్ బ్యాగ్స్ ను దాసరి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అక్కడికి విచ్చేసిన ఆధ్యాత్మికవేత్తలకు జూట్ బ్యాగ్స్ అందజేశారు. ఈసందర్భంగా దాసరి శ్రీనివాసులు ను శాలువాతో సత్కరించి, జ్యోతి చంద్రమోళి రచించిన "చంద్రమోళియం" పుస్తకాన్ని స్వయంగా జ్యోతి చంద్రమౌళి దాసరి శ్రీనివాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంధిరెడ్డి కొండలరావు, గుండ్లకమ్మ నది సంరక్షణ పోరాటయోధులు మన్నం త్రిమూర్తులు, గాడేపల్లి దివాకర్ దత్తు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ సభ్యులు జాగర్లమూడి ఎల్లమందరావుతో పాటు పలువరు ధార్మిక సభ్యులు పాల్గొన్నారు.

## డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

### - రాష్ట్ర ట్యాక్స్‌లను తగ్గించాలి డాక్టర్ చింతలపూడి డిమాండ్



**అద్దంకి , ఎఫ్రియల్ 27, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక స్పందించి, డీజిల్ కొరత సమస్యను తీర్చాలని అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని డీజిల్ కొరత సమస్య ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే మూడు రోజులుగా నెలకొని వుండటంపై వైఎస్ఆర్‌సిపి తరుపున డాక్టర్ చింతలపూడి స్పందించారు. ఆయన మాట్లాడుతూ తాను 50మంది పెట్రోల్ డీలర్స్‌తో మాట్లాడానని ప్రధానంగా ఆంధ్ర ప్రదేశ్‌లో వ్యాట్, తదితర సుంకాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అధికంగా విధించిందని ఈ నేపద్యంలో సప్లైయి కంపెనీలు ఆంధ్ర ప్రదేశ్‌కు డీజిల్ సరఫరాలో కోత విధించినట్లు తెలిసిందన్నారు. సాక్షత్తూ అంబులెన్స్‌లకే డీజిల్ లభించటం లేదంటే ఈ సమస్య ఏ స్థాయిలో వుందో ఆర్థమౌతుందని డాక్టర్ చింతలపూడి అన్నారు. అసలే ఈ ఏడాది వర్షాభావంతో రైతులు అతికష్టంమీద వేసిన పంటలు వాటి కోత, నూర్పిడి తదితర యంత్రాలను వినియోగించుకొనే ప్రస్తుత సమయంలో డీజిల్ కొరత ఏర్పడం రైతుల మీద తీవ్ర ప్రభావం చూపిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



**చీరాల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త**

## తిరుమలశెట్టికి రూ.15వేలు సహకారం అందజేత

ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్ నందు కళాంజలి చీరాల జనరల్ సెక్రటరీ తిరుమలశెట్టి సాంబశివరావుకి ఈనెల 29న రాత్రి 8.30 గంటలకు ప్రదర్శింపబడుచున్న 'పుటుక్కు జరజర దుబుక్కుమే' నాటికకు సభ్యుల సహకారంతో రూ.15 వేలు స్పాన్సర్ చేశారు. నాటకాలు వినోదంతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన పెంచడానికి, విద్యలో సృజనాత్మకత ను పెంపొందించడానికి ఉపయోగపడతాయని నాటక రంగానికి ఆధారణ తగ్గుతుందని, కళలను ప్రోత్సహించడానికి వారికి పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, వలివేటి మురళీకృష్ణ, నారాయణమూర్తి, శ్రీనివాసరావు, నరసింహారావు, వీరాంజనేయులు, మోహన్‌రావు, రవి, పూర్ణా, హనుమంతరావు, శ్రీరాం రమేష్, తదితర వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

### డాక్యుమెంట్‌లు పోయినవి

**సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం నుండి తాను 06042026 తేదీన మోటర్ సైకిల్ పై తన స్వగ్రామమైన ఎం. వేములపాడు గ్రామానికి వెళుతుండగా మార్గంలో తన ఇంటికి సంబంధించి 2193/2007 డాక్యుమెంట్ సంచి పోయినది. ఎవరికైనా ఈ డాక్యుమెంట్ పత్రాల సంచి దొరికిన యెడల దిగువ అడ్రస్‌ను సంప్రదించగలరు. ఇట్లు కాకుమాను శీను. ఎం. వేములపాడు గ్రామం. సంతనూతలపాడు మండలం. ప్రకాశం జిల్లా. మొబైల్ నెంబర్ 9701466823.**

# బెంగాల్‌లో ముగిసిన ప్రచారం



## రేపే రెండో విడత పోలింగ్
## 7 జిల్లాల్లోని 142 నియోజకవర్గాలలో ఏర్పాట్లు పూర్తి

**కోల్‌కతా, ఏప్రిల్ 27:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండవ, చివరి దశ ప్రచారం సోమవారం ముగిసింది. ఈ ప్రచారంలో ఎస్ఐఆర్, చొరబాటు, అవినీతి, నిరుద్యోగం వంటి అంశాలపై తీవ్ర రాజకీయ వాదోపవాదాలు చోటుచేసు కున్నాయి. 142 నియోజకవర్గాల్లోని ఓటర్లకు బిజెపి, టిఎంసిలు హామీల వర్షం కురిపించాయి. ఈ హోరాహోరీ ప్రచారంలో, పశ్చిమ బెంగాల్‌ను చొరబాటుదారులకు స్వర్గధామంగా మారుస్తోందని అధికార టిఎంసిపై బిజెపి నాయకత్వం ఆరోపించింది. మరోవైపు, కాషాయ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తోందని, చేపలు, గుడ్ల వినియోగాన్ని నిరుత్సాహపరుస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. ఏప్రిల్ 29న జరగనున్న ఈ దశ ఎన్నికల్లో మొత్తం 3,21,73,837 మంది ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు. వీరిలో 1,64,35,627మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది తృతీయ లింగ ఓటర్లున్నారు. 41,001 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరగనుంది, అన్ని పోలింగ్ కేంద్రాలను వెబ్‌కాస్టింగ్ ద్వారా కవర్ చేస్తున్నారు. ఏడు జిల్లాల్లో 2,321కంపెనీల కేంద్ర బలగాలను మోహరించి, ఎన్నికల సంఘం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100మంది వ్యయ పరిశీలకులను నియమించారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి కెమెరాలతో కూడిన డ్రోన్‌లను కూడా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా 273 కంపెనీల కేంద్ర బలగాలను కోల్‌కతాలో మోహరించారు. ఈ దశలో పోలింగ్ జరుగుతున్న నియోజకవర్గాలలో, భాంగర్‌లో అత్యధికంగా 19 మంది అభ్యర్థులు ఉండగా, గోఘాట్‌లో అత్యల్పంగా ఐదుగురు ఉన్నారు. ఇది జిల్లాలవారీగా వైవిధ్యభరితమైన ఎన్నికల పోటీని ప్రతిబింబిస్తోంది. ఈ దశలోని కీలక అభ్యర్థులలో భవానిపూర్ నుండి తిరిగి ఎన్నిక కోరుకుంటున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఉన్నారు. ఈ దశలోని అత్యంత ప్రముఖమైన పోటీలలో ఒకదానిలో, ఆమె బిజెపి దిగ్గజం సువేందు అధికారితో తలపడుతున్నారు. కోల్‌కతా పోర్ట్‌లో, సీనియర్ టిఎంసి నాయకుడు ఫిర్హాద్ హకీమ్, బిజెపి అభ్యర్థి రాకేష్ సింగ్‌తో పోటీ పడు తున్నారు. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం, మధ్య కోల్‌కతాలో అధికార పార్టీకి కీలకమైనదిగా పరిగణించబడుతోంది. ఇతర ముఖ్యమైన స్థానాలలో భట్‌పారా, జగత్ దల్, బ్యారక్‌పూర్, బంగావ్, దుమ్‌దుమ్, సందేశ్ ఖాలి, హింగల్‌గంజ్, రాణాఘాట్ ఉత్తర్, దక్షిణ, రాష్ బెహారి, జాదవ్‌పూర్, బల్లిగంజ్ ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరాఖండ్,అసోం ముఖ్యమంత్రులతో సహా పలువురు బిజెపి నాయకులు రాష్ట్రంలో ప్రచారం నిర్వహించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అగ్రనేత అభిషేక్ బెనర్జీ విస్తృతంగా ప్రచారం చేశారు. అటు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలు సుడిగాలి పర్యటనలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు.

# యేడాది కావస్తున్న 'ఆపరేషన్ సిందూర్'




## 22 నిమిషాల్లోనే టార్గెట్లు ఖతం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:**ఆపరేషన్ సింధూర్‌నిర్వహించి ఏడాదికి చేరువవుతున్న సందర్భంలో భారత్ ఆర్మీ సోషల్‌మీడియాలో కొత్త పోస్టులు పెట్టింది. కేవలం 22 నిమిషాల వ్యవధిలోనే ఉగ్రవాదుల కమాండ్ వ్యవస్థను ఎలా కుప్పకూల్చిందీ వివరిస్తూ తాజాగా ఓ పోస్ట్ చేసింది. నిర్ణయం, స్పష్టత, లక్ష్యంపై దృష్టి న్యాయం జరిగింది, వేగంగా, కచ్చితంగా అంటూ సైన్యం తన పోస్టులో పేర్కొంది. ఆదివారం కూడా ఆర్మీ మరో పోస్ట్ చేస్తూ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీఓకే) లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలకు చెందిన 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. భారత్ మర్చిపోదు అనే ట్యాగ్‌లైన్‌తో ఈ వివరాలను పంచుకుంది. ఈ ఆపరేషన్ల తర్వాత భారత సైన్యం తన సన్నద్ధతను మరింత పటిష్ఠం చేసుకుందని, కొత్త సర్దుబాటు, పటిష్ఠం, సన్నద్ధం ఆత్మనిర్భర్ భారత్ సిద్ధంగా ఉందని మరో పోస్టులో స్పష్టం చేసింది. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మతం అడిగి తెలుసుకుని 26 మంది పర్యాటకులను దారుణంగా హతమార్చిన ఘటనకు ప్రతిస్పందనగానే భారత సైన్యం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ దాడి జరిగిన వెంటనే భారత సైన్యం 'ఆపరేషన్ మహాదేవ్‌ను ప్రారంభించింది. దాదాపు 93 రోజుల పాటు 300 చదరపు కిలోమీటర్ల కఠినమైన హిమాలయ ప్రాంతంలో గాలించి, దాడికి పాల్పడిన ముగ్గురు ప్రధాన ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఆ తర్వాత వ్యూహాత్మక ప్రతీకార చర్యగా మే 6, 7 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాక్, పీఓకేలోని కీలక ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడిని నిర్వహించింది. ఉగ్రవాదాన్ని భారత్ ఎంతమాత్రం సహించబోదని, దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా ప్రతిస్పందన కచ్చితంగా ఇలాగే ఉంటుందని హెచ్చరించింది. ఈ ఆపరేషన్ అనంతరం 50 కొత్త మిషన్‌రెడీ యూనిట్లు, 4 అదనపు ఫార్మేషన్లు, 5 లక్షలకు పైగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకున్నట్లు సైన్యం వెల్లడించింది.

# ఆప్ ఎంపీల విలీనప్రక్రియకు రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఆమ్ ఆద్మీపార్టీకి రాజీనామా చేసి బిజెపిలో విలీనం అవుతామని ప్రకటించి ఆపార్టీ తీర్థంతీసుకున్న ఏడుగురు ఎంపిల విలీన ప్రక్రియను రాజ్యసభ ఛైర్మన్ ఆమోదించారు. ఆ విలీన ప్రక్రియకు సోమవారం రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలంగా ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువ అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే. రాఘవ్‌ఛద్దాపై ఆప్ హైకమాండ్ వ్యవహరించిన తీరుపై కలత చెందిన ఇతర ఎంపిలు కూడా ఆయన వెంటే నడిచారు. వెంటనే రాజీనామాలు చేసి బిజెపి అధ్యక్షుడు నితిన్‌నబీన్‌ను కలిసి తమ నిర్ణయాన్ని ప్రకటించడం ఆపై వెంటనే వారిని పార్టీలోకి ఆహ్వానించడం వెనువెంటనే జరిగిపోయాయి. ఈలోపు తమ విలీనప్రక్రియను ఆమోదించాలంటూ రాజ్యసభ ఛైర్మన్‌కు కూడా వివిధ పత్రాలను అందించారు. వాటిని పరిశీలించిన ఛైర్మన్ రాధాకృష్ణన్ వెంటనే ఆమోదిస్తూ నిర్ణయాన్ని వెల్లడించడంతో ఏడుగురు ఎంపిల విలీన ప్రక్రియ సజావుగా ముగిసింది.

# బిజెపికి బీటీమ్‌గా ఆమ్ ఆద్మీపార్టీ: కాంగ్రెస్‌నేత అజయ్‌మాకెన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఆప్‌పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనం కావటంతో ఆమ్ ఆద్మీ కన్వీనర్ కేజ్రీవాల్ పార్టీ నిజ స్వరూపం బయటప డిందని కాంగ్రెస్ పేర్కొంది. ఆ పార్టీ బిలియనీర్ల పార్టీ అని, డబ్బు ఉన్నవారికే రాజ్యసభ సీట్లు కేటాయించిందని ఆరోపించింది. పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీకి ఆప్ సహాయపడుతోందని ఆ పార్టీ నేత అజయ్ మాకెన్ విమర్శించారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 6శాతం ఓట్లు సాధించిన బీజేపీ, ఆప్ ఎంపీల చేరికపై ఏం సమాధానం ఇస్తుందని ప్రశ్నించారు. బీజేపీకి ఆమ్ ఆద్మీపార్టీ బీ టీం అని తమ పార్టీ ఎప్పుడూ చెబుతూనే ఉందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ పేరును అరబ్ ఆద్మీయోంకా పార్టీగా మార్చాలని అజయ్ మాకెన్ అన్నారు. డబ్బు కోసం ప్రశాంత్ భూషణ్, అశుతోష్, యోగేంద్రయాదవ్‌లకు రాజ్యసభ సీట్లు ఇవ్వలేదని ఆరోపించారు. తాను సహ వ్యవస్థాపకుడిగా ఉన్న రాజకీయ పార్టీ ఆప్ నుంచి వైదొలుగుతున్నట్లు బీజేపీ ఎంపీ రాఘవ్ చద్దా ప్రకటించారు. పార్టీలో విషపూరితమైన పని వాతావరణం ఉందని, ఇటీవలి కాలంలో పార్టీ అంతర్గత కార్యకలాపాలు గణనీయంగా క్షీణించాయని ఆరోపించారు.

# లడఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాలు: ఏడుకు పెరిగిన కేంద్రపాలితప్రాంత జిల్లాలు



**లేహ్, ఏప్రిల్ 27:** కేంద్రపాలిత ప్రాంతమైన లడక్‌లో పరిపాలనా సంస్కరణల దిశగా మరో ముందడుగు పడింది. ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ లడఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు లద్దాఖ్‌లో లేహ్, కార్గిల్ అనే రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో లడఖ్‌లో మొత్తం జిల్లాల సంఖ్య రెండు నుంచి ఏడుకు పెరుగుతోంది. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్లు వినయ్ కుమార్ సక్సేనా తెలిపారు. ఈ నిర్ణయంతో లడఖ్‌లోని మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, 2024 అగస్టులో వెల్లడించారు. త్వరలోనే హోంమంత్రి అమిత్ షా పర్యటించనున్న నేపథ్యంలో తాజాగా ఆ ఐదు జిల్లాలను ఏర్పాటు చేస్తూ లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదముద్ర వేశారు. జమ్ముకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి హోదాను రద్దుచేసి అసెంబ్లీతో కూడినకేంద్రపాలితప్రాంతంగాప్రకటించిన తర్వాత గతంలో జమ్ముకాశ్మీర్‌లో అంతర్భాగంగా ఉన్న లడక్‌నుఅసెంబ్లీలేని కేంద్రపాలితప్రాంతంగా ప్రకటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంటారు. అంటేనేరుగా కేంద్ర ప్రభుత్వమే లడక్ పాలనా వ్యవహారాలు చూస్తుంది.

# సహజీవన భాగస్వామిపై లైంగిక దాడి ఆరోపణలేమిటి?



## సహజీవనానికి, లైంగిక దాడికి ఎంతో తేడా: సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, నేరపూరిత లైంగిక నేరాలకు మధ్య తేడాను కోర్టు నొక్కి చెప్పింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై సదరు మహిళ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ పిటిషన్ వేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు సహజీవనానికి సంబంధించినదని, వివాహం కాకుండానే మహిళ బిడ్డకు కూడా జన్మనిచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోందని అన్నారు. సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారిందని ప్రశ్నించారు. వివాహ ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవేనని, కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేయడమేమిటని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లా డుతూ, నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయస్సు పద్దెనిమిది అని, అప్పుడు ఆమె ఒక వితంతువు అని కోర్టుకు తెలిపారు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిపోయిందని, కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. ఇతర మహిళలను కూడా అతడు ఇలాగే మోసం చేశాడని అన్నారు. అయితే, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులు కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించిందని ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం లైంగిక దాడి కాదని స్పష్టం చేశారు. అలాగే మహిళ పరిస్థితిపై న్యాయమూర్తి సానుభూతి వ్యక్తం చేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.



## యుద్ధంలో అమెరికా స్థావరాలకు భారీ నష్టమే..

**వాషింగ్టన్, ఏప్రిల్ 27:** అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ జరిపిన దాడుల వల్ల మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలకు ఊహించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం వాటిల్లినట్లు అమెరికా అధికారులే అంగీకరిస్తున్నారు. ఈ నష్టం విలువ బిలియన్ల డాలర్లలో ఉంటుందని, మరమ్మతులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని పలు అంచనాలు తెరపైకి వచ్చాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ దళాలు ఏడు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో కమాండ్ సెంటర్లు, విమాన హ్యాంగర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రన్‌వేలు, రాడార్లతో పాటు కొన్ని విమానాలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికాకు చెందిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని, ఇరాన్‌కు చెందిన పాతతరం ఎఫ్5 ఫైటర్ జెట్ కూడా దాడి చేయగలగడం అమెరికా సైనిక వర్గాలను ఆశ్చర్యపరిచింది. సౌదీ అరేబియాలోని ఒక ఎయిర్ బేస్ పై దాడిలో అమెరికా నిఘా విమానం (అవాక్స్) ధ్వంసమైన చిత్రాలు కూడా వెలుగులోకి వచ్చాయి. అయితే, జరిగిన నష్టంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) నిరాకరిస్తోంది.

## జీహాదీ మిలిటెంట్ల దాడిలో మాలి రక్షణ మంత్రి దారుణ హత్య

**బమాకో, ఏప్రిల్ 27:** జిహాదీలు జరిపిన ఆత్మాహుతి దాడిలో మాలి దేశ రక్షణ శాఖ మంత్రి సాదియో కమరా మృతిచెందారు. దేశ రాజధాని బమాకోకు సమీపంలో ఉన్న అతని నివాసంపై అటాక్ జరిగింది. జిహాదీ మిలిటెంట్లు, వేర్పాటువాదులు కలిసి దేశవ్యాప్తంగా హింసకు పాల్పడుతున్నారు. తీవ్రవాదుల దాడిలో గాయాలపాలైన రక్షణ మంత్రి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ ఛానల్ కన్ఫర్మ్ చేసింది. మిలిటరీ జుంటా



అధినేత జనరల్ అసిమి గోయిటాను ప్రస్తుతం సురక్షిత ప్రాంతానికి తరలించారు. చాన్నాళ్లుగా మాలి దేశంలో అల్‌ఖయిదా, ఇస్లామిక్ స్టేట్‌తో పాటు అజావాద్ లిబరేషన్ ఫ్రంట్‌కు చెందిన గ్రూపుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. కటి ప్రాంతంలో ఉన్న రక్షణ మంత్రి ఇంటిపై అల్‌ఖయిదా అనుబంధ మిలిటెంట్లు దాడి చేశారని, ఆ దాడుల్లో కమరా ఫ్యామిలీకి చెందిన మరో ముగ్గురు కూడా హతమైనట్లు తెలిసింది. మినిస్టర్ నివాసంపైకి ఆయుధాలతో నిండిన వాహనం దూసుకువచ్చిందని, ఓ ఆత్మాహుతి బాంబర్ ఆ వాహనాన్ని నడిపినట్లు ప్రభుత్వ ప్రతినిధి ఇసా ఔస్మనే కౌలిబలీ తెలిపారు. మిలిటెంట్లపై ఎదురు కాల్పులు జరిపామని, కొందర్ని హతమార్చామని, కానీ గాయాల వల్ల రక్షణ మంత్రి ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలపై అల్ ఖైదా అనుబంధ తుయరెగ్ రెబెల్స్ చేసిన దాడుల వల్ల ఆయన మరణించినట్టు అల్ జజీరా చానల్ పేర్కొన్నది. మాలిలో ప్రభావవంతమైన వ్యక్తుల్లో సడియో ఒకరని అల్‌జజీరా తెలిపింది. కటి పట్టణంలోని తన నివాసంలో ఆత్మాహుతి కారు బాంబు దాడిలో సడియో హత్యకు గురయ్యారని వెల్లడించింది. ఆయన ఇంటి వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ ఈ దాడి జరిగిందని తెలిపింది. కటిలో పరిస్థితి తమ నియంత్రణలో ఉందని ఆర్మీ చెప్పున్నప్పటికీ సాయుధ గ్రూపులు ఆదివారం కూడా కాల్పులకు తెగబడినట్టు వార్తలు వచ్చాయి. సడియో మృతి ఆ దేశ సైన్యానికి పెద్ద షాక్ తగిలినట్లేనని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## హర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తాం..
### ఇరాన్ తాజా ప్రతిపాదన




**వాషింగ్టన్, ఏప్రిల్ 27:** అమెరికాతో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు ఇరాన్ ఒక కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. యుద్ధాన్ని ముగిస్తే ప్రధానమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అయితే అణు సంబంధిత చర్చలను మాత్రం ప్రస్తుతానికి వాయిదా వేయాలని ఆ ప్రతిపాదనలో కోరినట్టు అమెరికా మీడియా సంస్థ యాక్సియోస్ ప్రస్తావించింది. ఓ అమెరికా అధికారి, చర్చల గురించి తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఉటంకిస్తూ ఈ వివరాలను వెల్లడించింది. చర్చల్లో నిలిచిపోయిన పరిస్థితిని అధిగమించడంతో పాటు, అణు రాయితీల పరిధిపై ఇరాన్ నాయకత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ముందుకు సాగే వ్యూహంలో భాగంగానే ఇరాన్ ఈ ప్రతిపాదన చేసిందని యాక్సియోస్ తెలిపింది. అయితే, ఈ ప్రతిపాదనకు అమెరికా అంగీకరిస్తే భవిష్యత్తు చర్చల్లో ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం అధ్యక్షుడు ట్రంప్ కోల్పోతారని నివేదిక విశ్లేషించింది. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తొలగించడం, యురేనియం శుద్ధిని శాశ్వతంగా నిలిపివేయించడమే ట్రంప్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన జాతీయ భద్రతా, విదేశాంగ విధాన బృందంతో సోమవారం సిట్యుయేషన్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ముగ్గురు అధికారులు వెల్లడించారు. చర్చల్లో ప్రతిష్టంభన, తదుపరి చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామనే సంకేతాలు ఇచ్చారు. చమురు ఎగుమతులను అడ్డుకోవడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ కొత్త ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## రెండోసారి పాక్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి



**టెహ్రాన్, ఏప్రిల్ 27:** అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన శాంతి చర్చలు ఆగిపోయిన క్రమంలో అనేకపరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ కొద్ది గంటల వ్యవధిలోనే రెండోసారి పాకిస్థాన్‌కు చేరు కోవడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాం శమైంది. అమెరికాతో చర్చల విషయంలో మధ్య వర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్‌లో ఆయన పర్య టనకు ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌తో సమావేశమై వెళ్లిన అరగ్చీ, ఆ తర్వాత ఒమన్‌కు వెళ్లారు. అక్కడ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్ అల్‌సైద్‌తో సమావేశమై హోర్ముజ్ జలసంధి భద్రత, ఇరాన్‌పై యుద్ధాన్ని ముగించే అంశాలపై చర్చించారు. ఒమన్ పర్యటన ముగించుకున్న వెంటనే ఆయన మళ్లీ పాకి స్థాన్‌లోని రావల్పిండి నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు. ఈ ఆకస్మిక పర్యటనలో భాగంగా ఆయన మరోసారి పాక్ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ఇస్లామాబాద్‌లో భేటీల అనంతరం ఆయన మాస్కోకు బయలుదేరి వెళ్లనున్నట్లు సమాచారం.

## పాక్ సరైన మధ్యవర్తి కాదు: ఇరాన్ విదేశాంగ అధికారి



**టెహ్రాన్, ఏప్రిల్ 27:** అమెరికా–ఇరాన్ మలి విడత చర్చలపై అనిశ్చితి కొనసాగితోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించ చగలదా అని టెహ్రాన్ అధి కారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపి, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లా డుతూ పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రా యాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు.
'పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసించదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేని విధంగా డిమాండ్లు తెరపైకి తీసుకువచినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షం వైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయి' అని ఇబ్రహీం రెజాయీ పార్లమెంటులో పేర్కొన్నారు.

## యుఎఇ చేతికి ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్



**టెల్‌అవీవ్, ఏప్రిల్ 27:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతున్న వేళ యుఎఇని అనూహ్యంగా ఓ మిత్ర దేశం ఆదుకొంది. అదే ఇజ్రాయెల్. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను యుఎసి తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకొంది. కానీ, కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మిత్రదేశాల సాయం కోరింది. దీంతో ఇజ్రాయెల్ ముందుకొచ్చి దానికి సాయం చేసినట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఇజ్రాయెల్ తన ఐరన్‌డోమ్ వ్యవస్థను యుఎఇకి పంపించడంతోపాటు దానిని ఆపరేట్ చేసి రాకెట్లు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా అక్కడికి తరలించింది.
నెతన్యాహుకు ఫోన్ చేసిన యుఎఇ అధ్యక్షుడు
ఇరాన్ దాడుల తీవ్రత పెరగడంతో యుఎఇ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయేద్ నుంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్‌కాల్ వెళ్లింది. ఆ తర్వాతే ఐరన్ డోమ్ వ్యవస్థను యుఎసి తరలించాలని ఇజ్రాయెల్ ప్రధాని నుంచి ఐడిఎఫ్ దళాలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఇరాన్ దాడులకు ప్రధాన టార్గెట్‌గా మారిన అబుదాబికి ఊరట లభించింది. దీంతో డజన్లకొద్దీ ఇరాన్ క్షిపణులను యుఎఇ ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో అడ్డుకొంది. ఇరాన్ ఈ యుద్ధ సమయంలో మొత్తం ఆ దేశంపై 550 బాలిస్టిక్ క్షిపణులు, 2,200 డ్రోన్లు ప్రయోగించినట్లు అబుదాబి రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ చర్యతో ఇజ్రాయెల్–యుఎఇ మిత్రత్వం మరింత పెరిగినట్లు అమెరికా మీడియా సంస్థ వెల్లడించింది. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దేశం బయట తన సొంత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను మోహరించింది యుఎఇలోనే. అయితే అమెరికా కూడా తన సొంత ఐరన్ డోమ్‌ను వాడుతోంది.

## బాధ ఉన్నా.. బయటపడని అమెరికా!



**వాషింగ్టన్, ఏప్రిల్ 27:**అమెరికా–ఇరాన్ యుద్ధంలో ప్రస్తుతానికి కాల్పుల విరమణ కొనసాగుతోంది. యుద్ధం ఆగుతుందా? చర్చలు జరుగుతాయా? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇంకా దొరకడం లేదు. ఈ యుద్ధంలో ఇరాన్‌ను సైనికంగా దెబ్బతీశామని, వారు ఒప్పందానికి రావాల్సిన పరిస్థితి కల్పించామని అగ్రరాజ్యం చెప్తోంది. అయితే ఇరాన్ కూడా మిలిటరీ శక్తి అయిన యుఎస్‌ను గట్టిగా దెబ్బకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. బయటకు చెప్తున్న దానికంటే నష్ట తీవ్రత ఎక్కువగానే ఉందని పేర్కొన్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాటిని ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై టెహ్రాన్ విరుచుకుపడింది. అక్కడ ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కమాండ్ సెంటర్లు, నిల్వ కేంద్రాలు, విమానాలు ఉంచే ప్రాంతాలు, రన్‌వేలు, రాడార్ వ్యవస్థలపై దాడులు చేసింది. సైనిక కదలికలు, నిఘాకు వాడే వ్యవస్థలను దెబ్బకొట్టింది. యుఎస్ వద్ద అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలున్నప్పటికీ.. ఇరాన్ తన పాత ఎఫ్–5 యుద్ధ విమానాన్ని దాడి చేయడంతో యుఎస్ ఖంగుతిన్నది. ఇరాన్ దాడుల్లో జరిగిన నష్టానికి సంబంధించి కచ్చితమైన లెక్కలను అమెరికా ఇప్పటివరకు బయటపెట్ట లే దు. ఈ విష యంలో ట్రంప్ యంత్రాంగం పారదర్శకంగా లేకపోవడంపై కొంత సొంత పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వారాలుగా ఆ వివరాలు ఇవ్వాలని అడు గు తున్నా పూర్తి వివరాలు మాత్రం బయటకు రావడం లేదంటున్నారు. మరోవైపు యుద్ధం నేపథ్యంలో 200 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 18 లక్షల కోట్లు)పైగా నిధులు ఇవ్వాలని అమెరికా పార్లమెంటున్న పెంటగాన్ కోరినట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఇక, ఘర్షణలు ప్రారంభమైన మొదటి వారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్ల మేర ఖర్చు చేసింది. ఈ వార్ ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ 1.5 ట్రిలి యన్ డాలర్ల డిఫెన్స్ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆ మొత్తం క్రితం యేడాదితో పోలిస్తే 50 శాతం ఎక్కువ కావడంగమనార్హం. ఘర్షణలు కొనసాగిం చడానికి పెట్టే ఖర్చు ఒకవైపు అయితే.. దెబ్బతిన్న వాటిని బాగు చేయడానికి కొన్ని బిలియన్ల డాలర్ల మేర అవసరం కానుందని అంచనా. ఈ బాధ ఎక్కువగా ఉన్నా దానిని బయటకు చెప్పలేని పరిస్థితిలో అమెరికా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో టెలిరోబోటిక్ సర్జరీ చేసిన నారాయణ జిఎస్ఎల్ ఆస్పత్రుల వైద్యబృందం, టెక్నాలజిస్టులు

## టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలు మరింత సులభతరం: సిఎం

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సిఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ ఆస్పత్రులు, జిఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఆస్పత్రుల యజమాన్యాలకు చెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆస్పత్రులు కలిసి టెలిరోబోటిక్ సర్జరీ నిర్వహించినట్టు సిఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. టెలిరోబోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు సింధూర, గన్ని భాస్కరరావు సిఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో ఉన్న రోగికి రాజమహేంద్రవరం జిఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు రోబో ద్వారా సర్జరీ చేశామన్నారు. అలాగే జిఎస్ఎల్‌లో ఉన్న రోగికి నారాయణ ఆస్పత్రి వైద్యులు దూరం నుంచే శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆస్పత్రుల యజమాన్యాలను సిఎం చంద్రబాబు అభినందించారు. టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే దూరంగా ఉన్నా సరే నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని ఈ సంస్థలు నిరూపించాయని కొనియాడారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులకు కూడా ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన డాక్టర్లు ఎక్కడి నుంచైనా సర్జరీ చేయగలిగే ఈ సాంకేతికత భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని సిఎం పేర్కొన్నారు.

## మదనపల్లె డిఎస్పీ ఎదుట సజ్జల భార్గవ్‌రెడ్డి



**మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డి సోమవారం మదనపల్లె డిఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. గతంలో నమోదైన ఒక కేసులో భాగంగా పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేయడంతో, విచారణ నిమిత్తం ఆయన అధికారుల ముందుకు వచ్చారు. బి.కొత్తకోటకు చెందిన ఓ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో సజ్జల భార్గవ్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా ఆయన తొలుత బి.కొత్తకోటకు చేరుకున్నారు. అనంతరం మదనపల్లె డీఎస్పీ పావని సమక్షంలో విచారణకు హాజరయ్యారు. డిఎస్పీ కార్యాలయంలో సంబంధిత కేసుపై అధికారులు ఆయనను సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. కోర్టు ఆదేశాలు, పోలీసు నోటీసుల మేరకు విచారణకు సహకరించేందుకు భార్గవ్ రెడ్డి హాజరైనట్లు వైసిపి శ్రేణులు వెల్లడించాయి. సజ్జల భార్గవ్ రెడ్డి రావడంతో డిఎస్పీ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక వైసిపి నాయకులు కూడా డిఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకుని సజ్జల భార్గవ్ రెడ్డిని కలిశారు.



## అక్షరాలు మందు గుండు సామగ్రి వంటివి

● నీలి గులాబీలు పుస్తకావిష్కరణ సభలో మోకా సత్తిబాబు

**విజయవాడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త ప్రతినిధి:** అక్షరాలు మందు గుండు సామగ్రి వంటివి అన్నారు పోలీస్ అధికారి మోకా సత్తిబాబు అన్నారు. దళిత సాహిత్యం చైతన్యపూర్వక దృక్పథంతో బలీయంగా రావాలన్నారు. అంబేద్కర్ ఆశించిన కులరహిత సమాజం కోసం బడుగువర్గాలు సంఘటితం కావాలన్నారు. దళిత ప్రేమ వివాహాలు విఫలం కావడం, పరువు హత్యలు పెరగడం దురదృష్టకర పరిణామన్నారు. స్థానిక ఠాగూర్ గ్రంథాలయంలో ఎండ్లూరి మానస, గోగులమండ అరుణ సంకలనం చేసిన నీలి గులాబీలు కథల సంపుటిని ఠాగూర్ గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ఎండ్లూరి మానస మాట్లాడుతూ.. దళిత ప్రేమికుల ప్రేమను విచ్ఛిన్నం చేసే దిశగా కొనసాగుతున్న వివక్షను గట్టిగా ప్రశ్నించేందుకే ఈ సంకలనం తెచ్చామన్నారు. ఐద్వా లీడర్ డి రమాదేవి మాట్లాడుతూ దళిత స్త్రీల పట్ల జరుగుతున్న వివక్ష వెనుక ఉన్న కారణాలను గుర్తించాలన్నారు. సామాజిక వక్త డాక్టర్ వసుంధర కుర్రా మాట్లాడుతూ తరతరాలుగా దళిత ప్రేమికుల వివాహాలు విచ్ఛిన్నమవుతున్న దారుణ పరిస్థితుల్ని మనందరం కలిసికట్టుగా ఎదుర్కోవాలి అన్నారు. మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ మాట్లాడుతూ దళిత స్త్రీల పట్ల జరుగుతున్న వివక్షను, ప్రేమికుల మధ్య పాతుకుపోయిన కుల అంతరాలను ఈ సంకలనం వెలికితీసిందన్నారు. పుస్తక సంపాదకురాలు అరుణ గోగులమండ మాట్లాడుతూ ఒక మంచి సంకల్పంతో తాము వెలువరించిన ఈ పుస్తకంలో పలువురు రచయితలు వారి వారి కోణాల్లో ప్రేమికుల మధ్య జరుగుతున్న వివక్షను, వేధింపులను అక్షరబద్ధం చేశారన్నారు. కవయిత్రి పోలగాని భాను తేజశ్రీ స్వాగతం పలికిన ఈ సభకు పలువురు సాహితీవేత్తలు హాజరయ్యారు.

## టిటిడి విద్యాసంస్థల్లో బధిరుల ప్రవేశాలకు ఆహ్వానం

**తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ బధిరోన్నత పాఠశాల, ఎస్వీ బధిరుల జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 1 వరకు స్వీకరిస్తారు. తిరుపతి, భీమవరం, వరంగల్ ప్రాంతాల్లోని ఈ విద్యాసంస్థల్లో చేరదలచిన బధిర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రతి ఏడాది 1వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పించబడతాయి. ఇతర తరగతుల్లో ఖాళీల మేరకు ప్రవేశాలు ఉంటాయి. తిరుపతిలో 1వ తరగతి చేరాలనుకునే అభ్యర్థులకు, 2వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు. సదరు తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు తిరుపతి కళాశాల లేదా వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తులను తిరుపతి ఎస్వీ బధిరుల జూనియర్ కళాశాల నుండి నేరుగా పొందవచ్చని, "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఒఆర్‌జి" వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను ఇంఛార్జి ప్రిన్సిపాల్, ఎస్వీడిఎఫ్, అలిపిరి, తిరుపతి-517501 చిరునామాకు పంపాలని తెలిపారు.

# తిరుపతి జిల్లాలో రెండోరోజూ పెట్రోల్, డీజిల్ కొరత

● బంకులు ముందు వాహనదారుల బారులు ● పరిస్థితి సమీక్షిస్తున్నా చక్కదిద్దలేని అధికార యంత్రాంగం

**తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రసిద్ధ యాత్రాస్థలం.. స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంతోబాటు జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరతతో పెట్రోల్ బంకులు తెరచుకోలేదు. తిరుపతి నగరంలోనే దాదాపు ఇరవైకిపైగా ప్రధాన ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో పూర్తిగా డెడ్‌స్టోరేజీ స్థాయికి చేరుకోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుండే అనేక చోట్ల పెట్రోల్ బంకుల ముందు వాహనదారులు బారలుతీరడం కనిపించింది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు ఆనుకునే ఉన్న పోలీస్‌శాఖ నడుపుతున్న ఐఒసి పెట్రోల్ బంకులో పూర్తిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు లేకపోవడంతో వాహనదారులు ఎండలను కూడా లెక్కచేయకుండా నిరీక్షించారు. ఆదివారం రాత్రి నుండి తిరుపతి జిల్లాలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావులు స్వయంగా పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వ సామర్థం ఎంత, ఏ మేరకు ఉందనేది రికార్డులు తనిఖీ చేశారు. సోమవారం ఉదయానికి పరిస్థితి చక్కబడుతుందని, వాహనదారులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నా మధ్యాహ్నం వరకు పరిస్థితి అదుపులోకి రాలేదు. చాలావరకు బంకుల్లో పెట్రోల్ డీజిల్ నోస్టాక్ బోర్డులు ప్రత్యక్షమయ్యాయి. జిల్లాలో ముఖ్యంగా తిరుపతి ప్రధాన నగరంలోని అనేక పెట్రోల్ బంకుల్లో తగినంత నిల్వలు అందుబాటులో లేకపోవడంతోనే ఈ డిమాండ్ ఏర్పడింది. ఒకవైపు పెట్రోల్ కోసం ఉదయం నుండి బారులుతీరినా మరోవైపు అధికారులు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాయంత్రానికి సాధారణ పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ కొరతపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తిరుపతి జిల్లాలో మొత్తం 189 పెట్రోల్ బంకుల్లో తాత్కాలికంగా 26బంకులు మూతపడ్డాయి. అయితే సోమవారం సాయంత్రానికి సరఫరా కావచ్చని పేర్కొన్నారు. ప్రతి బంకు వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందిని మోహరించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేపట్టారు.

తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్, బిపిసిఎల్, నయారా, రిలయన్స్ సంస్థల జిల్లా ప్రతినిధులతో నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయానికి తిరుమలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నడుస్తున్న రెండు బంకులకు అదనపు సరఫరాలు పంపించారు. ఇక జిల్లాలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో



తిరుపతిలోని ఓ పెట్రోల్ బంకు వద్ద నోస్టాక్ బోర్డు, నగరంలోని మరో బంకు వద్ద వాహనదారులు బారులు

వ్యవసాయ అవసరాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, డీజిల్ జనరేటర్లకు ప్రాధాన్యతా క్రమంలో ఇంధనం అందించేలా ఆదేశాలా జారీ చేశారు. తిరుపతి జిల్లాలో సాయంత్రానికి అన్ని పెట్రోల్ పంపులు పూర్తిస్థాయిలో పనిచేస్తాయని అధికారులు వెల్లడించారు. ప్రజలు అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని, అలా చేయడం వల్ల కృత్రిమంగా డిమాండ్ పెరిగి కొన్ని చోట్ల క్యూలు ఏర్పడే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు. సాయంత్రం ఆరుగంటల వరకు పరిస్థితి చక్కబడలేదు.

**ఓ వైపు డిమాండ్, మరోవైపు ఉచిత పెట్రోల్:** తీవ్రమైన పెట్రోల్ కొరతపై ప్రజల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ నిల్వలు నిజంగానే తగ్గిపోయాయా? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం తిరుపతి తిరుచానూరు మార్గంలోని తిరుపతి రూరల్ తనపల్లి వద్ద ఐఒసీఎల్ పెట్రోల్ బంక్ యజమాని రాజేష్ రెడ్డి మాత్రం ఉదారతతో పెద్ద మనసు చాటుకున్నారు. తిరుపతిలో ఉచితంగా దాదాపు ఐదువేలమంది వాహనదారులకు ఉచితంగా పెట్రోల్ పంపిణీ చేశారు. ప్రజల ఇబ్బందులు చూసి చలించిపోయి సాయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎండలో బారులుతీరిన వాహనదారులకు మంచినీరు కూడా అందించడం మరో విశేషం. స్టాక్ ఉన్న కొన్ని చోట్ల వాహనదారులు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరుతున్నారు. తిరుమలకు వచ్చే భక్తులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులు మాత్రం సోమవారం కూడా కన్నీళ్ళు తెప్పించేస్థితికి చేరాయి.

## 'నోస్టాక్' బోర్డులు కనిపించకూడదు

● పెట్రోల్, డీజిల్ స్టాక్ తెప్పించుకోవాలి ● తిరుపతి జిల్లాలో బంకుల యజమానులతో అత్యవసర సమావేశం

**తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** 48గంటలు దాటినా సిఎం చంద్రబాబునాయుడు సొంత తిరుపతి జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత వెంటాడుతోంది. ఉన్నఫళంగా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టి, త్రాళ్ళతో, ప్లాస్టిక్ బారికేడ్లు ఏర్పాటుచేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుండి సోమవారం మధ్యాహ్నం వరకు జిల్లా అధికారులు సాహసోపేతంగా పెట్రోల్, డీజిల్ బంకులపై తనిఖీలు చేసినా పరిస్థితి చక్కబడలేదు. దీంతో సాయంత్రానికి పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆఘమేగాలపై



ఐఒసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, నయారా పెట్రోల్ డీలర్ల యజమానులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయా సంస్థల పెట్రోల్ బంకుల సేల్స్ అధికారులతో సమీక్షించారు. డిమాండ్‌కు తగినట్లు పెట్రోల్, డీజల్ స్టాక్‌ను తెప్పించుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. పెట్రోల్ బంక్‌ల వద్ద స్టాక్ లేదని బోర్డులు పెడుతున్నారని, అవసరానికి తగినట్లుగా ముందుగా ఆయిల్ ట్యాంకర్‌లను తెప్పించుకుని పెట్రోల్ బంక్‌ల వద్ద స్టాక్ ఉంచుకోవాలన్నారు. పెట్రోల్ కొరత కారణంగా పెట్రోల్ బంక్‌లు మూతపడే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రజలందరికీ వారి నిత్యావసరాలకు అవసరమైన మేరకు పెట్రోల్, డీజల్‌ను ఆయిల్ కార్పొరేషన్‌ల ద్వారా సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షి ంచుకుంటూ నిల్వలు ఉంచుకోవాలని తెలిపారు. మరీ మంగళవారం ఉదయానికి పరిస్థితి అంచనావేయాల్సి ఉంది.

## పెళ్లి భోజనం తిన్నారు... 20 మందికి అస్వస్థత

● హనుమనపల్లిని సందర్శించిన డిఎం అండ్ హెచ్‌ఓ ● పాఠశాలలో వైద్య శిబిరం, కొనసాగుతున్న చికిత్స ● డాక్టర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓ అక్కడే మకాం ● 108 వాహనం సైతం అక్కడే

**అగళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా అగళి మండల పరిధిలోని హనుమనపల్లి గ్రామంలో ఓ పెళ్లి భోజనం ఆరగించి 20 మంది వాంతులు, విరేచనాలతో మంచంపట్టారు. ఈ విషాధ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దరంగ కుమార్తె వివాహానికి బంధుమిత్రులను పిలిచి వైభవంగా వివాహం నిర్వహించారు. ఆ పెళ్లిలో విందు భోజనం ఆరగించారు. ఆదివారం ఉదయం చేసిన అనుపకాయల సాంబారుతో భోజనం తిన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అదే సాంబారుతో భోజనం చేశారు. సాంబారు పాచిపోయింది. ఆ సాంబారును ఆరగించడంతో పెళ్లికి వచ్చిన వారు అదే గ్రామానికి చెందిన 20 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. మొదట ఒకరు అగళికి వచ్చి ఇలా జరిగింది, చికిత్స అందించండి అని ఆసుపత్రికి వెళ్లగా ఈ విషయం బయటపడింది. వెంటనే ఈ విషయాన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందికి తెలియజేశారు. ఆ విషయాన్ని జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ మంజువాణి విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన జరిగిన గ్రామంలోని పాఠశాలకు చేరుకుని వారికి అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. నియోజకవర్గంలోని డాక్టర్లను, సిబ్బందిని అక్కడికి మోహరించి చికిత్స అందించారు. సెలెన్ బాటిల్స్‌ను అందించడం, ఓఆర్ఎస్ పాకెట్లను అందించడం, మాత్రలు ఇవ్వడంతో కొద్దికొద్దిగా రికవరీ మొదలైందని సిబ్బంది డిఎం అండ్ హెచ్‌ఓకు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ మంజువాణి మాట్లాడుతూ.. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచినీటిని సేవించాలని తెలపడంతోపాటు ప్రత్యేకంగా ఉదయం, రాత్రి మూడురోజులపాటు చికిత్స అందించడానికి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లతో ఓ టీంను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన టీంలో ఉన్నవారు సదరు అనారోగ్యానికి గురైన వారికి సక్రమంగా వైద్యం అందించాలని, ఒకవేళ గైర్హాజరైతే అప్పటికప్పుడే షోకాజ్‌నోటీసులు ఇస్తామన్నారు. 108వాహనాన్ని సైతం అక్కడే ఉంచారు. గ్రామంలో శానిటేషన్ పనులు కొనసాగిస్తున్నారు. ఈ వైద్య శిభిరంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డా.రవి, తహశీల్దారు సుబ్బారావు, మరో ఇద్దరు డాక్టర్లు కిరణ్‌నాయక్, సూపర్‌వైజర్ జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుందరయ్య, సుబ్బయ్య, మంజుళ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, కార్యదర్శి రాజునాయక్, ఎంపిడిఓ గంగాధర్, డిప్యూటీ ఎంపిడిఓ రెడ్డి ప్రకాష్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ జిల్లాలో ఇంధన కొరతలేదు: జెసి ఇలక్కియా

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ఎన్‌టిఆర్ జిల్లాలో పెట్రోలు, డీజిల్ కొరత లేదని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ప్రజలు ఏవిధమైన భయాందోళనలకు గురికావద్దని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ప్రజలకు భరోసా ఇచ్చారు. కొన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల అనంతరం పెట్రోలు, డీజిల్ ధరలు గణనీయంగా పెరుగుతాయని సోషల్ మీడియాలో అసత్యప్రచారం జరుగుతుందని దీనిని నమ్మవద్దని హితవు పలికారు. ఈ అసత్య ప్రచారాన్ని నమ్మిన ప్రజలు అవసరానికి మించి పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేసి నిల్వచేస్తున్నారని, ఇది ప్రమాదకర మని హెచ్చరించారు. జిల్లాలో ఇంధన పరిస్థితిపై ఆమె మీడియా సమావేశం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఇంధన విక్రయాలు, నిల్వల వివరాలను వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 186 పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ నిరంతరాయంగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. సాధారణ విక్రయాలతో పోల్చితే ప్రస్తుతం 20శాతం అదనంగా ఇంధన సరఫరా జరుగుతుందన్నారు. ఇంధన సరఫరా సంస్థలతో సంప్రదింపులు జరిపి జిల్లాలో అవసరమైన మేరకు ఇంధనాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

**పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి:** పిజిఆర్ఎస్‌కు వస్తున్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జేసి ఇలక్కియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఎన్‌టిఆర్ కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ అర్జీలను జేసి స్వీకరించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సరైన పరిష్కారం చూపించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్య చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు.




## ఆ భూ కేటాయింపులు రద్దు చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్

**తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అలిపిరిలో పునర్జన్మ పొందిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలిపిరి దగ్గర వెయ్యి కోట్ల రూపాయలు విలువైన భూములను ముగ్గురు కోటీశ్వరులకు ఒక్కొక్కరికి ముప్పై ఎకరాలు టిటిడి భూములు కట్టబెట్టారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ ఆరోపణలు గుప్పించారు. దేవలోక్, ట్రైడెంట్, ఒబెరాయ్‌కి ఇచ్చిన భూములు నెల రోజుల లోపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భారీ ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతామోహన్ మాట్లాడుతూ టిటిడిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను బానిసలుగా చూస్తున్నారని మండిపడ్డారు. రూ.12 వేలు ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. టిటిడి పారిశుద్ధ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ప్రతి నెలా పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. అలాగే నెలకు 20 వేల రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులపై కాంట్రాక్టర్ల మేనేజర్లు వేధింపులు మానుకోవాలన్నారు. గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి ప్రకటించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. మే 31వ తేదీ లోపు 30 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ కొరత మోడీ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేజోవతి, మునిశోభ, సమీవుల్లా, దాసరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

**తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. 2016 కేసులో తమిళనాడు, విల్లుపురం జిల్లా శంకరాపురం చెందిన మణి తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీటు, చామల రేంజ్ అటవీ పరిధిలో పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు.

## బికె బేడు వద్ద రోడ్డు ప్రమాదం: ఒకరి మృతి

**నాగలాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నాగలాపురం మండలం బీకే బేడు గ్రామం సమీపంలో రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పాలమంగళం గ్రామానికి చెందిన టి.నాగరాజు(25) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కృష్ణమరాజుల కండ్రిగ గ్రామం నివాసి మోటారు సైకిల్ నడిపిన వినోద్(34) తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించగా, పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కాగా పుత్తూరు వైపు కారు వెళుతుండగా ఎదురుగా వచ్చిన మోటారు సైకిల్ రైడర్ ముందున్న కంటైనర్ లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించి రోడ్డులో కుడి వైపుకు వెళ్లడంతో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదసమయంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న నాగరాజు, వినోద్ ఇద్దరూ హెల్మెట్ లేకపోవడంతో ఈ



ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. మోటారు సైకిల్‌కి అగ్ని అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోటారు సైకిల్ రైడర్ నిర్లక్ష్యంగా ఓవర్‌టెక్ చేయడం వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హథీరాంజీ మఠం భూములు కాపాడండి

● సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** హథీరాంజీ మఠం భూములు కాపాడాలని, అందుకోసం "పర్యవేక్షణ కమిటీ"ని నియమించాలని కోరుతూ సోమవారం సిఎం చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. వేల కోట్ల విలువజేసే హథీరాంజీ మఠం భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ కనీసం పట్టించుకోవడం లేదని లేఖలో శ్రీనివాసరావు ఆరోపించారు. ఫిర్యాదు చేయాల్సిన హథీరాంజీ మఠం సిబ్బంది, కస్టోడియన్ ఫిర్యాదు కూడా చేయడం లేదని తెలిపారు. తిరుపతిలో ఆక్రమణకు గురై, నిర్మాణాలు సాగిస్తున్న సర్వే నెం:13 గాంధీపురంలోని మఠం భూములలో కబ్జాదారులు బోర్డును తొలగించినా పోలీసులకు ఫిర్యాదు చేయలేని దుస్థితిలో హథీరాంజీ మఠం ఉందని చెప్పారు. హథీరాంజీ మఠం భూముల ఆక్రమణలకు ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు, రియల్టర్లు, పోలీసులు సంయుక్తంగా పాల్పడుతున్నారని ఆరోపించారు.

## మహిళా బిల్లుతో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

● ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్

**తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో అట్టడుగు వర్గాలు లబ్ధి పొందుతున్న సంక్షేమ పథకాలకు క్రమంగా కేంద్ర ప్రభుత్వం కోత పెడుతోందని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ ఆరోపించారు. సంక్షేమ కార్యక్రమాల అమల నుంచి కేంద్రం తప్పుకోవాలని భావిస్తుందని చెప్పారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం అమలులో తన వాటాను కేంద్రం తగ్గించుకుంటూ వస్తుందని, భవిష్యత్తులో ఈ పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎఐటియుసి 18 వ రాష్ట్ర మహాసభలలో భాగంగా సోమవారం ఉదయం ప్రతినిధుల మహాసభల తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో జరిగింది. అమర్ జీత్ కౌర్ మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, రంగు, వేసుకునే దుస్తులు ఆధారంగా ప్రజలను విభజించే నాయకులకు అధికారాన్ని దూరం చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వెనుక పౌరసత్వం రద్దు కుట్ర ఉందని హెచ్చరించారు.

మహిళా బిల్లు పేరిట నియోజకవర్గాలను పునర్ విభజించి, అత్యధిక సీట్లు పొందడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చేందుకు మోడీ చేస్తున్నారని హెచ్చరించారు. ఇరాన్ పై యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిసినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకుండా నిరక్ష్యంగా ఉండిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో నాలుగు రోజులుగా పెట్రోల్, డీజిల్ లేక ప్రజలు అల్లాడుతుంటే ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతరులపై




నెట్టివేస్తున్నారని చెప్పారు. గత 12 ఏళ్లుగా కనీస వేతనాలను పెంచని కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లుగా ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న హక్కులను హరించివేసి తాజాగా నాలుగు లేబర్ కోడ్‌లు రూపంలో చట్టాలను తెచ్చిందని వివరించారు. అన్ని కార్మిక సంఘాలను, కలిసి వచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రస్థాయికి తీసుకువెళ్లాలని కోరారు. సంఘటిత పోరాటాలతో కార్పొరేట్ వర్గాల కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలను గద్దెదింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి జి ఓబులేసు, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, అమరావతి జెఎసి నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రామానాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



# గరుడవాహనంపై వరుడుగా వెంకన్న

**• కన్నులపండువగా ముగిసిన పద్మావతి పరిణయం**

**తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో మూడురోజులుపాటు జరిగిన పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు సోమవారం సాయంత్రం కన్నులపండువగా ముగిశాయి. చివరిరోజు సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న మలయప్పస్వామి గరుడవాహనం అధిరోహించగా, శ్రీదేవిభూదేవి పల్లకీపై మరోవైపు నారాయణగిరి ఉద్యానవనంలోని కల్యాణవేదికపైకి మంగళవాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కల్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామి అమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు, ఎదురుకోలు, పూలబంతులాట, నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్ధుల య్యారు. అన్నమాచార్య కళాకారులు అలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మ వార్లు తిరిగి ఆలయానికి చేరుకోవడంతో పరిణయోత్సవాలు ముగిశాయి. పరిణయోత్సవ మండపాన్ని వివిధ రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించి, శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# అందరికీ శుభాలు కలగాలి

**• తెలంగాణ బిజెపి చీఫ్ రామచంద్రరావు**

**తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రామచంద్రరావు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం వెళ్లారు. అక్కడ తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు బిజెపి నాయకులు ఆలయం ముందు స్వాగతం పలికారు, ఆలయ అధికారులు అమ్మవారి దర్శన ఏర్పాట్లును చేశారు. దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయనను బిజెపి నాయకులు రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బిజెపి నాయకులు అజయ్ కుమార్, లోక ప్రభాకర్ నాయుడు, డాక్టర్ శ్రీధర్ రావు, శివ రాయల్, డాక్టర్ బండ్ల సోమేష్, మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, అశోక్ శ్రీవారి చిత్రపటం బహుకరించారు.



# ఎస్వీ అన్నప్రసాదంకు రూ.20 లక్షలు విరాళం

**తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు కుటుంబం రూ.20లక్షలు విరాళమిచ్చారు. ఆయన కుమార్తె ఆముక్త, కుమారుడు అవనీష్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక్కొక్కరు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.

# తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు

**• సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు**

**• అక్టోబర్ 12నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు**



**తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రంపై కొలువైన ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహించనుంది. నిత్యం ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు దేవదేవునికి జరుగుతుంటాయి. సంవత్సరానికోసారి జరిగే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవ సంవత్సరం అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భంలో కన్యా మాసం(భాద్రపదంలో) సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవం, ఆశ్వయుజంలో దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహిస్తుంది.

సెప్టెంబర్ 15వ తేదీ మంగళవారం నుండి 23వ తేదీ బుధవారం వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరిగి అక్టోబర్ 12వ తేదీ సోమవారం నుండి 20వ తేదీ మంగళవారం వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమసలహా మండలి, అర్చకులు నిర్ణయించారు. ఆలయ మాఢవీధుల్లో వాహనసేవలను, నిత్యకైంకర్యాలను అర్చకస్వాములు వేద మంత్రోచ్చరణల నడుమ వైఖానస ఆగమోక్తంగా జరిపించేందుకు ముహూర్తం ఖరారుచేశారు. ప్రతి ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలకు లక్షలమంది భక్తులు దేశవిదేశాల నుంచి ఏడుకొండలకు చేరుకుని వివిధ అలంకారాలలో పలు వాహనాలపై వేంచేసి భక్తకోటికి దర్శనమిచ్చే ఆపద మొక్కులవాడిని కన్నులారా వీక్షించి ముగ్ధులవుతారు. బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజుల్లో సర్వదర్శనం మినహాయించి మిగిలిన అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుచేస్తారు.

# ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆస్పత్రులకు బకాయిల చెల్లింపు

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆస్పత్రులకు బకాయిల చెల్లింపులను బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్‌లో రూ.వెయ్యి కోట్లు జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 323 ఆస్పత్రుల యాజమాన్యాల దరఖాస్తు చేసుకోగా, ఒప్పందాల మేరకు 25 ఆస్పత్రులకు రూ.62 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. దీనికి సంబంధించిన వివరాను ఈ సందర్భంగా వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు అధికారులు పరిస్థితిని వివరించారు.

# అభివృద్ధికి విద్యుత్తే ప్రధాన ఆధారం

**• పిన్నాపురం గ్రీన్కో ప్రాజెక్టుపై ప్రశంసలు • ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు • త్వరలో కర్ణాటకలో 3000 మెగావాట్ల ప్రాజెక్టు**




**కర్నూలు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ఒక దేశం లేదా ప్రాంతం అభివృద్ధి పూర్తిగా విద్యుత్‌పై ఆధారపడి ఉంటుందని కర్ణాటక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కేలచంద్ర జోసెఫ్ జార్జ్ పేర్కొన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం పిన్నా పురంలో గ్రీన్కో సంస్థ ఏర్పాటు చేసిన ఇంటెగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పిన్నాపురం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుగా నిలుస్తుందని, కర్నూలు జిల్లాకు ఇది ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని తెలిపారు. దేశ అభివృద్ధికి విద్యుత్తు అత్యవసరమని, ఒక విద్యుత్ ప్రాజెక్టు స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ శాఖ వంటి అనేక అనుమతులు అవసర మవుతాయని చెప్పారు. ఈ అన్ని అడ్డంకులను అధిగమించి ప్రాజెక్టును నిర్మించిన గ్రీన్కో సంస్థను అభినందించారు. పిన్నాపురం పంప్డ్ స్టోరేజ్ స్టేషన్‌ను పరిశీలించిన తర్వాత ఇది అత్యుత్తమ ప్రాజెక్టుగా అభివర్ణించారు. కర్ణాటక లో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, ఇతర రాష్ట్రాల సరఫరా ద్వారా ఎటువంటి సమస్యలు లేకుండా అవసరాలు తీర్చుతున్నామని తెలిపారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కర్ణాటకలో శరావతిలో 125 ఎకరాల్లో 3000 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని, ఇది త్వరలో అందు బాటులోకి వస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ వనరులైన పవన, సోలార్ విద్యుత్ వాతావరణ పరిస్థితులపై ఆధారపడటంతో నిలిచిపోయే అవకాశ ముందని, అందుకే పంప్డ్ స్టోరేజ్ విధానం అత్యంత కీలకమని వివరిం చారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని 30 శాతానికి మించి పెంచకూ డదనే విధానాన్ని ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, ఈ నేపథ్యంలో పంప్డ్ స్టోరేజ్ ద్వారా అధిక లోడ్ సమయంలో కూడా విద్యుత్ సమస్యలు ఉండవని తెలిపారు. గ్రీన్కో సంస్థ ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలలో విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి దేశ అభివృద్ధికి సహకరిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కర్ణాటకకు చెందిన రాజె గౌడ, గౌరవ్ గుప్తా, గ్రీన్కో ఎండీ చలమలశెట్టి అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్ళి కొడుకుగా ముస్తాబై కోనకు పల్లకీలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుడు

**• స్వామి వెంట కాలినడకన కోనకు వేలాదిమంది భక్తులు**

**• ఆలయ ముఖద్వారం వద్ద స్వాగతం పలికిన అర్చకులు**



**రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారు బ్రహ్మోత్స వాలకు పెళ్ళి కొడుకుగా ముస్తాబై ఉభయ నాంచారులతో కలిసి సోమవారం గోనుపల్లి గ్రామం నుండి పెంచలకోనకు పల్లకీలో బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా గోనుపల్లి గ్రామం లో పండుగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్స వాలకు ఉభయ దేవేరులతో పల్లకిలో కోనకు బయలుదేరిన స్వామి వారికి గోనుపల్లి గ్రామ స్తులు వారి నివాసాల ముందుబాగాన చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి స్వాగతం పలికి మొక్కులు చెల్లించారు. స్వామి వారు గ్రామ గిరిజన కాలనీ వద్దకు చేరుకోగానే గిరిజనులు వారి సాంప్రదాయం ప్రకారం ఇంటి అల్లుడైన పెంచల స్వామికి గిరిజన సాంప్రదాయం ప్రకారం పుట్టతేనే, ఇంజేటి గడ్డలు, ఇతర దుంపలు, అరినార మొలతాడు వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు. అక్కడి నుండి బయలు దేరిన స్వామి వారు గోల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు చేరుకోగానే గోల్లబోయిన స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తోలి దర్శనం గోల్లబోయిన స్వామి వారికి ఇచ్చారు. అక్కడి నుండి సుమారు 6 కిలోమీటర్ల మేర స్వామి వారిని బోయిలు గోవింద నామస్మరణలతో పల్లకీలో మోసుకుం టూ కోనకు చేరుకున్నారు. కోనలోని స్వామి వారి ముఖద్వారం వద్దకు స్వామి వారు చెరుకు న్నంతనే అర్చక స్వాములు అక్కడికి చేరుకోని స్వామి వారికి పూజలు నిర్వహించి ఆహ్వానం పలికారు.

ఈ కార్యక్రమంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ సతీమణి కురుగొండ్ల సింధు, సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి, ఆలయ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ సూప రిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, పీర్ల సోమ య్య, బోట్ల పూజిత, శ్రీశైలం భార్గవ రామ్, తోట ఉమా, మోదేపల్లి ఇందిర, చీర్ల వెంకటే శ్వర్లు, కిన్నేర నరసింహా రావు, పెమ్మసాని సుగుణమ్మ, మొమిడి దేవిక, ఈతముక్కల సుగుణమ్మ, బోగోలు బాస్కర రెడ్డి, బోంతల పుష్పలత, తురిమెర్ల పెంచలయ్య, ఏకసిరి అంకమ్మ, పెద్ద ఎత్తున భక్తులు వున్నారు. వేలాది మంది భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు.

## పన్ను ఎగ్గొట్టిన బస్సులు స్వాధీనం

# రూ.2.69 లక్షల జరిమానా

**తిరుపతి(రవాణ), ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ప్రయాణికుల భద్రత, మోటార్ వాహన నిబంధనల అమలు దృష్ట్యా తిరుపతి జిల్లాలో రవాణాశాఖ అధికా రులు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై తనిఖీలు కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో చెన్నై నుంచి జమ్మలమడుగు వైపు వెళ్తున్న ఒక బస్సును తనిఖీ చేయగా, ఆల్ ఇండియా పర్మిట్ పన్ను చెల్లించకుండా నడుపుతున్నట్లు గుర్తించారు. మోటార్ వాహన తనిఖీ అధికారి అతికా నాజ్ వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పన్ను మరియు పెనాల్టీగా రూ.2.69 లక్షలు విధించారు. అలాగే భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న మరో బస్సులో స్పీడ్ గవర్నర్‌ను తారుమారు చేసినట్లు గుర్తించి అధికారి ఆంజనేయ ప్రసాద్ సీజ్ చేశారు. ఈ నెలలో చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ నుంచి తిరుపతి మీదుగా వచ్చిన సుమారు 1750 బస్సులను తనిఖీ చేయగా, 95 వాహనా లపై నిబంధనల ఉల్లంఘనల కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలి పారు. ఈ చర్యల ద్వారా రూ.10 లక్షలకుపైగా పన్నులు, జరిమానాలు వసూలయ్యాయి. నిబంధనలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు.



# డీజల్, పెట్రోల్ నో స్టాక్... అవస్థల్లో వాహనదారులు

**కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** కోట మండలంలో పెట్రోల్, డీజల్ సరఫరాలో కోతలతో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయిల్ కంపెనీలో సరఫరాలో కోటా విధానం అమలుతో పెట్రోల్ బంకుల యాజ మాన్యాలు వాహనదారులకు సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త నిబంధనలతో పలుచోట్ల బంకులు మూతపడు తున్నాయి. సోమవారం విద్యానగర్‌లోని ఓ పెట్రోల్ బంకులో డీజల్, పెట్రోల్ అయిపో వడంతో నో స్టాక్ బోర్డులు దర్శన మిచ్చాయి. ఆయిల్‌కంపెనీల నుంచి సరఫరాలో కొత్త నిబంధ నలతో సమస్యలు ఎదురవుతు న్నాయి. డిమాండ్ మేరకు ఆయిల్ కంపెనీలు సరఫరా చేయలేక పోతున్నాయి. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడు తున్నారు. అయితే మరో వైపు మంత్రి నాదెండ్ల మనోహర్ ఎక్కడా పెట్రోల్, డీజల్ కొరత లేదని ప్రకటిస్తున్నా, క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ సమస్యలకు అధికారులే చెప్పాల్సి ఉందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.



# జొన్నవాడ ఆర్చ్ వద్ద రోడ్డు ప్రమాదం... యువకుడి దుర్మరణం

**నెల్లూరు క్రైం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ ఆర్చి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండ్లపూడి గ్రామానికి చెందిన పుట్టా సునీల్ (30) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం సునీల్ తన మోటార్ సైకిల్ (ఏపి 39 ఎంవై 9886) పై కొండ్లపూడి నుండి బుచ్చి వైపు వెళ్తుండగా, దేవరపాళెం నుండి నెల్లూరు వైపు వస్తున్న బోలేరో ట్రక్కు (ఏపి 37 టిడి 3132) అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి జొన్నవాడ అర్చ్ వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సునీల్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని శోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి పుట్టా వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

**యడ్లపాడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** చిన్నారులకు సెలవులు కావటం వల్ల చెరువుకు వెళ్లి మృత్యువాత పడిన ఘటన యడ్లపాడులో అదివారం రాత్రి చోటుచేసుకుంది. బోయపాలానికి చెందిన షేక్ ఇమాంసా, అమినాబి దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారు లున్నారు. వీరు యడ్లపాడుకి వచ్చి నివాసం ఉంటున్నారు. షేక్ మొహమ్మద్ అహమ్మద్(17) గుంటూరు లోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. వీరి నివాసానికి సమీపానే ఉన్న యడ్లపాడుకు చెందిన ప్రైవేటుగా విద్యుత్ పనులు చేసుకుని జీవనం సాగించే షేక్ మస్తానవలి, మునీరాబేగం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్దవాడైన షేక్ అమానుల్లా(13) స్థానిక జెడ్పీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు ఆదివారం సాయంత్రం సైకిల్‌పై జగ్గాపురం రోడ్డులో ఉన్న చవిటిచెరువు వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన కొద్దిసేపటికే ఆ ఊబి వారిని మృత్యువు వైపు లాగేసింది. చీకటి పడుతున్నా బిడ్డలు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెతుకులాట ప్రారంభించారు. చెరువు ఒడ్డున ఉన్న సైకిల్, చెప్పులు వారి గుండెల్లో రాయి వేశాయి. సమాచారం అందుకున్న ఎస్ఐఐ టి శివరామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలం చెరువు వద్దకు చేరుకొని, గాలింపు చేపట్టగా, ఆ ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. విగతజీవులుగా పడి ఉన్న వారిని చూశాక గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

# మొక్కజొన్న పంట కొనుగోలు చేయండి

**• కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ**

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్తప్రతినిధి:** రబీలో పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలంటూ కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ రాశారు. రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకం వర్తింపజేయాలని సిఎం కోరారు. ఎపిలోని మొక్కజొన్న రైతులు ఆందోళనగా ఉన్నారని లేఖలో సిఎం పేర్కొన్నారు. మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు రోజురోజుకూ తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ రూ.1,600 నుంచి రూ.1,700 మాత్రమే ఉందని సిఎం వివరించారు. ప్రస్తుత మార్కెట్ ధర కనీస మద్దతు ధర రూ.2,400 కంటే చాలా తక్కువని తెలియజేశారు. ఎపిలో 42.06 లక్షల టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశముందని చంద్రబాబు విన్నవించారు. ఇంకా 14.26 లక్షల టన్నుల పంట కోత దశలో ఉందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోకుంటే రైతులు నష్టపోతారని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్ర మద్దతు లేకుంటే రాష్ట్రంపై అధిక భారం పడుతుందని సిఎం గుర్తు చేశారు. పిఎంఆశా కింద నేరుగా రైతులకు ధరల వ్యత్యాసం చెల్లించాలన్నారు. ఎపిని ప్రత్యేకంగా చూసి, వ్యత్యాసంలో వందశాతం నిధులు కేంద్రమే భరించాలని అభ్యర్థించారు. ఈ పథకాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలన్నారు. నాఫెడ్, ఎపి మార్క్‌ఫెడ్ సమన్వయంతో అమలుకు అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు కోరారు.



## రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి ప్రభువు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడికి సిఎం చంద్రబాబు ఆయన జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. తన కార్యాలయంలోని వెంకట్రాది నాయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళిని అర్పించారు. వెంకట్రాది నాయుడు పాలన, దాన వితరణ, ఆధ్మాత్మికత్వాన్ని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు శ్లాఘించారు. వెంకటాద్రి నాయుడి జయంతిని తమ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి నాయుడు చేసిన కృషి మరువలేదన్నారు. పండితులను ప్రోత్సహించారని వ్యాఖ్యానించారు.


## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

## ఫారం - సి

## ప్రకటన రెవెన్యూ (ఎల్.ఎ) శాఖ

**(10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు చట్టం లోని 11వ విభాగం (క్రింద) (6/12 నియమం చూడండి)**

ప్రజా ప్రయోజనం అనగా, ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, మర్లగూడెం గ్రామములోని భూమిని ప్రజాహిత కార్యక్రమాల కోసం వినియోగించడం, ముఖ్యంగా, పోలవరం సాగునీటి ప్రాజెక్టు క్రింద పోలవరం జిల్లాలోని కూనవరం మండలం, కూడలిపాడు గ్రామం మరియు వి.ఆర్. పురం మండలం, సోములగూడెం గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస మరియు పునర్ స్థాపన చర్యలలో భాగంగా వారికి ఇళ్ల స్థలాలు కేటాయించుటకు ఈ భూమి అవసరమని ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, చింతూరు, ఆర్ & ఆర్ అధికారి, చింతూరు యూనిట్, పోలవరం జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ భావిస్తున్నారు.

అందువల్ల, పైన పేర్కొనబడిన ప్రాజెక్టు కోసం మర్లగూడెం గ్రామం, బుట్టాయిగూడెం మండలం, ఏలూరు జిల్లాలో 14.85 ఎకరాలు గల భూమిని సేకరణ కోసం ప్రతిపాదించడమయిందని ప్రకటించడమయింది. సవివర వివరణ ఈ క్రింది విధంగా ఉంది.

### షెడ్యూల్

జిల్లా: ఏలూరు | మండలం: బుట్టాయిగూడెం | గ్రామం: మర్లగూడెం

| క్ర.సం. | LP నెం. | భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.సెంట్లు) | భూమి తరగతి | పాత సర్వే నెంబరు | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు కట్టడములు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 247 | 2.31 | మెరక | 41,43 | తన్నీరు వెంకటాచార్యులు (లేటు), చల్లా దుర్గమ్మ (కూతురు) | L.P.No. 248,251 249 | L.P.No. 245,246 | L.P.No. 254,269 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 2 | 247 | 1.54 | మెరక | 41,43 | పోల్నాటి దుర్గారావు (తండ్రి) నాగన్న | L.P.No. 248,251 249 | L.P.No. 245,246 | L.P.No. 254,269 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 3 | 247 | 0.62 | మెరక | 41,43 | పోల్నాటి పేర్రాజు (తండ్రి) వీరన్న | L.P.No. 248,251 249 | L.P.No. 245,246 | L.P.No. 254,269 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 4 | 247 | 1.54 | మెరక | 41,43 | పోల్నాటి వెంకట సుబ్బారావు (తండ్రి) నాగన్న | L.P.No. 248,251 249 | L.P.No. 245,246 | L.P.No. 254,269 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 5 | 247 | 1.55 | మెరక | 41,43 | పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) నాగన్న | L.P.No. 248,251 249 | L.P.No. 245,246 | L.P.No. 254,269 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 6 | 247 | 3.66 | మెరక | 41,43 | పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) వీరన్న | L.P.No. 248,251 249 | L.P.No. 245,246 | L.P.No. 254,269 270 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 7 | 249 | 0.61 | మెరక | 42 | తన్నీరు సుబ్బారావు (లేటు) తన్నీరు గంగమ్మ (భార్య), తన్నీరు తాతారావు (కుమారుడు) | L.P.No. 250 | L.P.No. 247, 248 | L.P.No. 251 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 8 | 249 | 0.30 | మెరక | 42 | పోల్నాటి పేర్రాజు (తండ్రి) వీరన్న | L.P.No. 250 | L.P.No. 247, 248 | L.P.No. 251 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 9 | 249 | 1.21 | మెరక | 42 | పోల్నాటి రామకృష్ణ (లేటు) పోల్నాటి రాజేశ్వరి (భార్య) | L.P.No. 250 | L.P.No. 247, 248 | L.P.No. 251 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| 10 | 249 | 1.51 | మెరక | 42 | పోల్నాటి సత్యనారాయణ (తండ్రి) వీరన్న | L.P.No. 250 | L.P.No. 247, 248 | L.P.No. 251 | జంగారెడ్డి గూడెం గ్రామం | - |
| | మొత్తం 14.85 | | | | | | | | | |

2018 భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2018 లోని 22వ చట్టం) ద్వారా సవరించబడిన విధంగా 2013 భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2013 లో 30వ చట్టం) లోని 11(1)వ విభాగంలోని నిబంధనల క్రింద సంబంధితులందరికి ఈ ప్రకటనను చేయడమయింది.

పనిగంటల సమయంలో అనగా ఉ. 10.30గం. ల నుండి సా. 5.00 గం. ల వరకు ఏదేని పనిదినాన ఏలూరు జిల్లా కలెక్టరు కార్యాలయం / భూసేకరణ అధికారి & ప్రత్యేక ఉప కలక్టరు (భూసే.), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి. ఆర్ పురం యూనిట్ -II, చింతూరు వారి కార్యాలయములో భూమి ప్రణాళికను తనిఖీ చేయవచ్చు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం / కలెక్టర్-కం-సముచిత ప్రభుత్వం, సదరు చట్టంలోని 12వ విభాగంలో పొందు పరచి మరియు నిర్దిష్ట పరిచినట్లుగా భూమిని సర్వేచేయడం, ఏదేని భూమిని చదునుచేయడం, భూమిని లోపలికి త్రవ్వడం లేదా బోర్లు వేయడం మరియు వారి పని యొక్క సక్రమమైన అమలు కోసం అవసరమైన అన్ని ఇతర చర్యలను చేపట్టి వాటిని నమోదుచేయవలసిందిగా అధీకృత అధికారి మరియు ప్రత్యేక ఉప కలక్టరు (భూసే.), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి.ఆర్ పురం యూనిట్-II, చింతూరు మరియు అతని సిబ్బందిని కోరడమయింది.

చట్టంలోని 11 (4) విభాగం క్రింద, కలెక్టరు పూర్వ ఆమోదం లేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి ఏదేని లావాదేవీ లేదా ఏదేని భూమి యొక్క లావాదేవీలు కారణం అంటే అమ్మకం / కొనుగోలుమున్నగునవి లేదా అట్టి భూమిపై ఏవేని తాకట్టులను సృష్టించడం ఏవ్యక్తీ చేయరాదు.

సేకరణకు సంబంధించి ఏవేని ఆక్షేపణలు ఉన్నట్లయితే, నష్టపరిహారానికి సంబంధించి సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం చట్టంలోని 15వ విభాగం క్రింద పొందుపరిచినట్లుగా ఈప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 15 (పదిహేను రోజులు) రోజులలోపల ప్రయోజనం ప్రభావితమైన వ్యక్తిచే క్లెయిములను జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి మరియు ప్రత్యేక ఉప కలక్టరు (భూసే.), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి. ఆర్ పురం యూనిట్-II, చింతూరు సమక్షంలో దాఖలు చేయవచ్చు.

**సం/- శ్రీమతి వెట్రి సెల్వి. కె.** ఐ.ఏ.ఎస్., భూసేకరణ అధికారి & ప్రత్యేక ఉప కలక్టరు (భూ.సే.)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి.ఆర్.పురం యూనిట్-II, చింతూరు




# శతకొట్టేదెవరు?

## నేడు పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఢీ

**ఢిల్లీ క్యాపిటల్స్ 265 రన్స్**
**సన్‌రైజర్స్ హైదరాబాద్ 220 రన్స్**
**చెన్నై సూపర్ కింగ్స్ 210 రన్స్**
**ముంబై ఇండియన్స్ 196 రన్స్**
**గుజరాత్ టైటాన్స్ 166 రన్స్**
**లక్నో ముందు 255 రన్స్**

పైవన్నీ స్కోర్లన్నీ పంజాబ్ కింగ్స్ ముందు ఆయా జట్లు ఉంచిన టార్గెట్‌లు. వీటన్నింటిని శ్రేయాస్‌సేన ఉఫ్ మనిపించింది.ఇక ఢిల్లీ క్యాపిటల్స్ ఉంచిన 265 రన్స్ లక్ష్యాన్ని కూడా ఊదేసి రికార్డు సృష్టించింది. ఈ ఐపీఎల్ సీజన్‌లో చేజింగ్ టీమ్‌గా పంజాబ్ కింగ్స్ అవతరించింది. పోనీ మేమే టార్గెట్ నిర్ణయిస్తాం మీరు ఊదేయండి అన్న తరహాలో లక్నో జూపర్ జెయింట్స్ ముందు ఏకంగా 255 రన్స్ లక్ష్యం నిర్దేశించింది. దీన్ని చేధించడంలో లక్నో చతికిలపడింది. ఇపుడు రాజస్థాన్ రాయల్స్ వంతు. పంజాబ్‌కు కళ్లెం వేస్తుందా?



**చండీఘడ్:** మొత్తానికి ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుతమైన ఫామ్‌తో దూసుకుపోతోంది. ప్రస్తుతానికి ఆ జట్టును ఆపడం ఇతర జట్లకు కష్టంగా మారింది. ఈసీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో ఓటమి ఎరగకుండా దూసుకుపోతోంది. 6 మ్యాచ్‌ల్లో గెలుపొందగా, ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. 13 పాయింట్లతో టాప్ పొజిషన్‌లో ఉంది. గత ఏడాది తృటిలో చేజారిన ఐపీఎల్ ట్రోఫీని ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ అందుకోవడమే లక్ష్యంగా దూసుకుపోతోంది.

ఆర్సీబీ, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి బలమైన జట్లపై కూడా పంజాబ్ సులభంగా విజయం సాధించింది. శ్రేయాస్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ జట్టులో సరికొతనత ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. సర్పంచ్ సాబ్‌గా జట్టును విజయపథంలో నడిపిస్తున్నాడు. జట్టులోని వనరులను చక్కగా ఉపయోగించుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య అందిస్తున్న విధ్వంసకర ఆరంభాలే జట్టు విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నాయి. ఎంతలా అంటే డీసీపై పవర్ ప్లే ఆరు ఓవర్లలోనే 116 రన్స్ సాధించారు. ఆతర్వాత వచ్చే కూపర్ కానోలీ, శ్రేయాస్ అయ్యర్, నేహాల్ వదేరా, స్టోయినోస్ వరకు అందరూ విధ్వంకరంగా ఆడుదూ భారీ స్కోర్లు సాధిస్తున్నారు.

ఈ క్రమంలో నేడు పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడుతోంది. శ్రేయాస్ సేనను రాయల్స్ అడ్డుకుంటుందా? పంజాబ్ కు తొలి ఓటమి రుచి చూపిస్తుందా? లేదా యాధావిధిగా పంజాబ్ ఖాతాలో ఏడో విజయం చేరుతుందా? అన్నది ఆసక్తిగా మారింది. తమ విజయ పరంపరను కొనసాగించి, ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకోవడంపై పంజాబ్ కింగ్స్ ఫోకస్ పెట్టింది. మరోవైపు, ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో నాలుగో స్థానంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్... పుంజుకుని విజయాల బాట పట్టాలని ఉవ్విళ్లూరుతోంది.



పంజాబ్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్... రాజస్థాన్ ఓపెనర్లు సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైసాల్ పోరు ఆసక్తి రేపుతోంది. ఈ నలుగురిపైనే మ్యాచ్ ఫోకస్ అంతా. ఇక ఈ పోరులో పేసర్ జోఫ్రా ఆర్చర్ కీలక బౌలర్ కావచ్చు. అతను ఎనిమిది మ్యాచ్‌లలో 17.92 అద్భుతమైన సగటుతో 13 వికెట్లు పడగొట్టి, ఈ సీజన్‌లో తన ప్రభావాన్ని చాటుకున్నాడు. అతని బౌలింగ్, ముఖ్యంగా పవర్‌ప్లే సమయంలో, ఆట గమనాన్ని మార్చడంలో కీలకం కానుంది. ఒకవేళ ఆర్చర్ ఆరంభంలోనే వికెట్లు తీస్తే, అతను పంజాబ్ కింగ్స్‌పై ఒత్తిడి పెంచి, రాజస్థాన్ రాయల్స్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలడు.

**హెడ్ టు హెడ్ రికార్డ్ :** ఇరుజట్లు 30 మ్యాచ్‌ల్లో తలపడగా, రాజస్థాన్ రాయల్స్ ఆధిక్యం చాటింది. పంజాబ్ కింగ్స్ 13 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ రాయల్స్ 17 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. చివరి సారి తలపడినపుడు పంజాబ్ కింగ్స్ నెగ్గింది.

**తుది జట్లు(అంచనా) : పంజాబ్ కింగ్స్:** ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాంష్ ఆర్య, కూపర్ కానోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, మార్కస్ స్టొయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, విజయ్‌కుమార్ వైషాక్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్; **ఇంపాక్ట్ ప్లేయర్:** నేహాల్ వధేరా

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ (కెప్టెన్), హెట్మెయర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, ఆర్చర్, దేశ్‌పాండే, బర్గర్, బ్రిజేష్ శర్మ, బిష్ణోయ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** సూర్యవంశీ.

# ఢిల్లీని కుప్పకూల్చిన హాజిల్, భువీ







**ఢిల్లీ:** శనివారం బౌలర్లకు బ్లాక్ డేగా నిలిస్తే... సోమవారం బ్యాట్స్‌మెన్‌వంతయింది. తమ సొంత మైదానంలోనే గత మ్యాచ్‌లో 264పరుగులు కొట్టిన ఢిల్లీ క్యాపిటల్... సోమవారం మాత్రం బ్యాటింగే చేతకాదన్నట్టు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భువనేశ్వర్, హాజిల్‌వుడ్ ఫాస్ట్ బౌలింగ్‌కు 75 పరుగులకు కుప్పకూలింది. ఈస్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ ఒక వికెట్ కోల్పోయి 6.3 ఓవర్లలోనే చేధించింది. తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. జాకబ్ బెతెల్(20) అవుటైనా... విరాట్ కోహ్లీ(15 బంతుల్లో 23), దేవదత్ పడిక్కల్(13 బంతుల్లో 34) అజేయంగా నిలిచి ఆర్సీబీకి మరో విజయాన్ని ఖాయం చేశారు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఆర్సీబీ ఆరంభ పేస్ అటాక్ భువనేశ్వర్, హాజిల్ వుడ్ వణికించారు. ఇన్నింగ్స్ రెండో బంతికే సాహిల్(0)ను భువీ క్లీన్ బౌల్డ్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఫ్రెష్ ఓవర్‌తో వచ్చిన హాజిల్‌వుడ్ ...తొలి బంతికే గత మ్యాచ్ సెంచరీ హీరో రాహుల్(1)ను, రెండో బంతికి రిజ్వీ(0)ని పెవిలియన్‌కు పంపాడు. ఇకమూడో ఓవర్ తొలి బంతికి స్టబ్స్(5)ను, నాలుగో బంతికి అక్షర్‌పటేల్(0)ను వెంట వెంటనే అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో హాజిల్ వుడ్... నితీష్ రాణా(1) పనిపట్టడంతో నాలుగో ఓవర్‌కే ఢిల్లీ క్యాపిటల్స్ 8 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. కాసేపు వికెట్ల పతనాన్ని అభిషేక్(30), డేవిడ్ మిల్లర్(19) అడ్డుకున్నారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ జోడించారు. అయితే మిల్లర్‌ను రసిఖ్ అవుట్ చేయడంతో మరోసారి వికెట్లపతనం వేగమందుకుంది. జెమిసన్(12)ను కృనాల్, కుల్‌దీప్(3)ను సుయాష్ అవుట్ చేశారు. మరోసారి బౌలింగ్‌కు వచ్చిన హేజిల్‌వుడ్.. చక్కని ఇన్ స్వింగ్‌తో అభిషేక్‌ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ 75 పరుగులకే ఆలౌటైంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇదే అత్యల్ప స్కోరు. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్ వుడ్ నాలుగు, భువనేశ్వర్ మూడు వికెట్లు పడగొట్టారు.



# థామస్ కప్ క్వార్టర్‌లో భారత్

**హార్సెన్స్:** థామస్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. పురుషుల సింగిల్స్ లో ఆయుష్ షెట్టి, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ రాణించడంతో ఆస్ట్రేలియాపై క్లీన్ స్వీప్ చేసి క్వార్టర్ ఫైనల్ స్థానం ఖాయం చేసుకుంది. 2022 ఛాంపియన్ కెనడాపై4-1 తేడాతో నెగ్గి థామస్ కప్ పోరును గ్రాండ్‌గా ఆరంభించిన భారత్.. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను 5-0తో చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో పారిస్ ఒలింపిక్స్ మెడలిస్ట్ లక్ష్యసేన్21-14, 21-16తో స్టీఫెన్ సామ్‌పై, సూపర్ ఫామ్‌లో ఉన్న యువ కెరటం ఆయుష్ షెట్టి 21-18, 21-16తో శ్రేయ్ ధాండ్‌పై నెగ్గి 2-0ఆధిక్యం అందించారు. డబుల్స్‌లో సాత్విక్ -చిరాగ్ జోడీ 21-14, 21-16తో రిజ్కీ హిదా యత్, జాక్ యూ జోడీపై సునాయాసంగా నెగ్గి ఆధిక్యాన్ని 3-0కు పెంచారు. రివర్స్ సింగిల్స్‌లో ప్రణయ్ సైతం జోరు చూపిస్తూ 21-11, 21-17తో రిషి హోండాపై విజయం సాధించాడు.

రెండో డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ.. 21-12, 21-10తో స్టీఫెన్ ఫామ్, అండికా జోడీపై గెలు పొందారు. దీంతో 5మ్యాచ్‌ల్లోనూ భారత్ నెగ్గి ఆస్ట్రేలియాను క్లీన్‌స్వీప్ చేసింది. గ్రూప్-ఏ లో రెండేసి విజయాలతో భారత్, చైనా సమవుజ్జీలుగా ఉన్నాయి. తర్వాతి మ్యాచ్ లో భారత్- చైనాతో తలపడనుంది. గత ఏడాది పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది. మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండానే గ్రూప్-ఎ నుంచి చైనా, భారత్ జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి.

# నష్టాలనుంచి లాభాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

## ఫార్మా, ఆయిల్,బ్యాంకింగ్‌ల మద్దతు



**ముంబయి, ఏప్రిల్ 27:** మూడురోజుల నష్టాల ర్యాలీనుంచి దేశీయ ఈక్విటీ సూచీలు లాభాల్లోకి మళ్లాయి. భౌగోళిక ఉద్రిక్తతల్లో సడలింపులు కనిపించడం, నాలుగోత్రైమాసికంలో స్థిరమైన ఫలితాలు కార్పొరేట్లుప్రకటించడం వంటివి మార్కెట్లకు కలిసొచ్చాయి. దీనికితోడు ఇరాన్ హర్ముజ్‌ను తెరుస్తామన్న ప్రతిపాదన తీసుకురావడం మార్కెట్లకు ఊతం ఇచ్చింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 639.42 పాయింట్లు పెరిగి 77,303.63 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 194.75 పాయింట్లు పెరిగి 24,092.70 పాయింట్లకు చేరింది. గత సెషన్లలో సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 3.29శాతం, 2.76శాతం క్షీణించాయి సన్‌ఫార్మా భారీగా లాభపడింది. 7.03శాతం సన్ పెరిగితే రిలయన్స్ 2.88శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.64శాతంపెరిగాయి. మార్కెట్లలో బిఎస్‌ఇ మిడ్ క్యాప్‌సూచీ 1.38శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.98 శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 3075 షేర్లుపెరిగితే 1288 షేర్లు క్షీణించాయి. 208 కంపెనీలషేర్లు నిలకడగా కొనసాగాయి.

భారత్‌పదేళ్ల బాండ్లు 0.27శాతంపెరిగి 6.952గా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో భారత్ రూపాయి స్వల్పంగా పెరిగింది. 94.14 వద్ద కొనసాగింది. గత ముగింపులో 94.16గా ఉన్నసంగతి తెలిసిందే. వారం ప్రారంభంలో మెరుగయింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటికి 0.43శాతంపెరిగి రూ.1,52,050గా కొనసాగింది. కమోడిటీ మారెనకట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్ మెంట్లు 2.47డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 107.80 డాలర్లుగా కొనసాగాయి. ఆర్గానన్ అండ్‌కంపెనీని కొనుగోలుచేసినట్లుప్రకటించడంతోకంపెనీ షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. 7.03శాతంపెరిగింది. రిలయన్స్ కూడా 2.88శాతంపెరిగింది. నికరలాభాల్లో వృద్ధి ప్రధానకారణం. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ 10.98శాతం పెరిగితే వన్ 97 కమ్యూనికేషన్స్ 1.48శాతం దిగజారింది. పేటిఎంపేమెంట్స్ బ్యాంకు లైసెన్సు రద్దుచేయడంతో షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. వరుణ్ బేవరేజెస్ 5.79శాతంపెరిగింది. యాక్సిస్‌బ్యాంకు మాత్రం 3.05శాం క్షీణించింది. నికరలాభాల్లో క్షీణత ఎఫెక్ట్ చూపించింది. ఇక శ్రీరామ్‌ఫైనాన్స్ కూడా 3.61శాతం పతనం అయింది. మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.71శాతం పెరిగాయి. కంపెనీ లాభాలు 55.02శాతం పెరగడమే ఇందుకు కారణం. ఎల్‌అండ్‌టి ఫైనాన్స్ 0.86శాతం క్షీణించింది. ఇక ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 6.09శాతం పెరిగాయి. ఐడిఎఫ్‌సిఫస్ట్‌బ్యాంకు 4.57శాతం, అవంటెల్ 1.52శాతంపెరిగితే మంగళూరు రిఫైనరీ పెట్రోకెమికల్స్ 7.59శాతం పతనం అయ్యాయి. ఇండియా సిమెంట్స్ మాత్రం7.25శాతం ర్యాలీతీసింది. డిసిబి బ్యాంకు కూడా త్రైమాసిక ఫలితాలు ఆశించినట్లు లేకపోవడంతోషేర్లు 1.12శాతం క్షీణించాయి. లోధా డెవలపర్స్ 4.64శాతం నికరలాభాలు ప్రకటించడంతోకంపెనీ షేర్లు కూడాపెరిగాయి. సుప్రీం పెట్రోకెమ్ 5.41శాం క్షీణించాయి. తాన్లా ప్లాట్‌ఫామ్స్ 20శాతం ఎగువ సర్క్యూట్‌లోముగిసాయి. కంపెనీ నికరలాభా లు పెరగడం, రెండోతాత్కాలిక డివిడెండ్ 6రూపాయల చొప్పున ప్రకటించడం షేర్లు ర్యాలీకి దారితీసాయి.




# ఒరాకిల్‌లో 20 వేలమందిపై లే ఆఫ్ వేటు!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** దిగ్గజ టెకీ కంపెనీ ఒరాకిల్ 20వేలమందికిపైగా ఇళ్లకు పంపిస్తోంది. సోమవారం ఆ కంపెనీ లే ఆఫ్‌ల ప్రకటన చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 20 నుంచి 30 వేల మందిని తొలిగించే అవకాశాలు ఉన్నట్లు చెప్పింది. సోమవారం ఉదయం పంపిన ఈమెయిల్స్‌తో ఉద్యోగులకు చేరవేశారు. అమెరికా, ఇండియా, కెనడా, లాటిన్ దేశాల్లో ఉన్న ఒరాకిల్ కంపెనీ ఉద్యోగులపై భారీ వేటు పడనున్నది. ఒరాకిల్ కంపెనీలో పనిచేస్తున్న సీనియర్లను కూడా తొలగిస్తున్నారు. 33 ఏళ్లుగా ఒరాకిల్ లో చేసిన సీనియర్ సెక్యూర్టీ ప్రొఫెషనల్ నీనా లివస్ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోనున్నారు. 30 వేల మంది లేఆఫ్స్‌లో తాను కూడా ఉండబోనున్నట్లు ఆమె తన లింక్డిన్ ప్రొఫైల్‌లో రాశారు. లేఆఫ్స్‌లో సంఖ్య కన్నా సీనియర్ల తొలగింపు ప్రశ్నార్ధకంగా మారింది. సుదీర్ఘకాలం కంపెనీలో పనిచేస్తున్న వారు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై ప్రభావం పడడం శోచనీయంగా మారింది. ఇటీవల మెటా, మైక్రోసాఫ్ట్, డిస్నీ, ఏఎస్ఎంఎ కంపెనీలు కూడా లేఆఫ్స్ ప్రకటించాయి. మెటా, మైక్రోసాఫ్ట్ కంపెనీలు గత వారంలో 20 వేల ఉద్యోగులను తొలగించాయి.

ప్రస్తుత దశలో చాలా వరకు కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. పనివిధానాలను ఆటోమెట్ చేయడంలో కంపెనీలు నిమగ్నమయ్యాయి. వర్కింగ్ టీమ్స్‌ను పునర్ నిర్మిస్తున్నారు. అధిక సామర్థం, తక్కువ ఇన్‌పుట్, ఎక్కువ లాభాలు అన్న రీతిలో కంపెనీలు పనిచేస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లాభాలపై దృష్టి పెట్టిన కంపెనీలు భారీ వేతనపరులు అవసరమా అన్న రీతిలో ఆలోచిస్తున్నాయి. వీరి స్థానంలో ఏఐతో పాటు యువ ఉద్యోగులను నియమించేందుకు ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎంట్రీ లెవల్ జాబ్‌లను పూర్తిగా ఆటోమేట్ చేశారు.

టాప్ కంపెనీలన్నీ దాదాపు ఫ్రెషర్స్‌కు అవకాశాలు ఇవ్వడం లేదని విమర్శలు వస్తున్నాయి. అవసరాన్ని బట్టి హైరింగ్ జరుగుతోందన్నారు. మిడ్, సీనియర్ లెవల్ ఇంజినీర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐపై ఆధారపడుతున్నారని, దీని వల్ల సర్వీస్‌తో పాటు ప్రొడక్ట్ బేస్డ్ కంపెనీలు కొత్త వారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నాయి.

మేనేజర్, డైరెక్టర్ స్థాయి ఉద్యోగాలు ఇప్పుడు గ్యారెంటీ లేకుండా ఉన్నాయి. ప్రస్తుత దశలో ఒక్క కాలేజీ కూడా 100 శాతం ప్లేస్‌మెంట్ గ్యారెంటీ ఇవ్వడం లేదని గ్రేట్ లేక్స్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ పీడీడీఎం డైరెక్టర్ డాక్టర్ పూర్ణిమా గుప్తా అభిప్రాయపడ్డారు. కొత్త గ్రాడ్యుయేట్లు అనుభవం కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నట్లు చెప్పారు. కాస్ట్ కట్టింగ్ దశ నుంచి ఇప్పుడు ఏఐ ఫస్ట్ ఫ్యూచర్ అన్న రీతిలో కంపెనీలు ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఒరాకిల్ కంపెనీ ఎక్కువగా క్లౌడ్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పెట్టుబడి పెడుతోంది. వర్క్‌ఫోర్స్‌ను రిడిజైన్ చేస్తున్నది. అందువల్లనే సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తున్నారు.

## 609 కోట్లకు ఎస్‌బిఐ కార్డ్ లాభాలు

**ముంబయి, ఏప్రిల్ 27:** స్టేట్‌బ్యాంక్ కార్డ్ సంస్థ నాలుగోత్రైమాసికంలో నికరలాభాలు 14శాతంపెరిగి 609 కోట్లకు చేరినట్లు సంస్థ ప్రకటించింది. ఎస్‌బిఐ కార్డ్స్ అండ్‌పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పేరుతో ఉన్న ఈ ఎస్‌బిఐ అనుబంధ సంస్థ అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.534 కోట్లు సాధించింది. మొత్తం రాబడులు కూడా 4832 కోట్లనుంచి రూ.5187 కోట్లకు పెంచుకోగలిగింది. వడ్డీ ఆదాయం మాత్రం గతత్రైమాసికంలో రూ.2415 కోట్లనుంచి రూ.2382 కోట్లకు తగ్గింది. ఈ త్రైమాసికంలో స్థూల నిరర్ధక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 2.41శాతంగా ఉన్నాయి. ఇక నికర నిరర్ధక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.04శాతానికి దిగివచ్చాయి. రానిబకాయిలు కూడా 1245 కోట్లనుంచి రూ.1097 కోట్లకు తగ్గాయి. పూర్తి ఆర్ధికసంవత్సరానికి లాభం 13శాతంపెరిగి రూ.2167 కోట్లుగా ఉంది. మొత్తం రాండులు కూడా రూ.20,708 కోట్లుగా ఉంది. కంపెనీ బ్యాలెన్స్ షీట్‌కూడా 65,546 కోట్లనుంచి రూ.66,328 కోట్లకు పెరిగింది. ఏడాదిక్రితం ఎస్‌బిఐ కార్డ్స్ రూ.534 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం రాబడులు కూడా 4832 కోట్లనుంచి రూ.5187 కోట్లకు పెంచుకోగలిగింది. స్థిరాస్తిప్రమాణాలను గణనీయంగా పెంచుకోగలిగామని, రానున్న కాలంలో మరింతగా ఆర్ధికపరిపుష్టి పెరుగుతుందని ఎస్‌బిఐ కార్డ్ సంస్థ ధీమా ప్రకటించింది.

## 14శాతం పెరిగిన లాభాలు

**ముంబయి, ఏప్రిల్ 27:** నాన్‌బ్యాంకింగ్ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ త్రైమాసిక లాభాలు 14శాతంపెరిగాయి. రుణావృద్ధి పటిష్టంగా ఉంది. మార్జిన్లను తగ్గించుకుంటూ హోమ్‌లోన్ మార్కెట్‌లో తన స్థానం నిలబెట్టుకుంటూ వస్తోంది. భారత్ రుణాల డిమాండ్ ఈ ఆర్ధిక సంవత్సరం రెండో అర్ధభాగంలో పెరుగుతూ వచ్చింది.

ద్రవ్యోల్బణ సడలింపులు, తక్కువ పన్నులు వంటివి గృహవాసుల వ్యయానికి మద్దతిచ్చాయి. కార్పొరేట్ రుణాలుకూడా విస్తృతం అయ్యాయి. ఇపుడు బజాజ్ కంపెనీ నిర్వహణ ఆస్తులు 23శాతంపెరిగి 1.41 లక్షల కోట్లుగా ఉన్నాయి. రుణాల పంపిణీ కూడా 23శాతంపెరిగి 17,506 కోట్లవరకూ ఉన్నాయి. నికరవడ్డీ ఆదాయం 945 కోట్లుగా ఉంది. రుణ ఆస్తులు వంటివి 5.5శాతం పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. మార్చి త్రైమాసికంలో 9.1శాతం ఉంది. నికరలాభాలు 587 నుంచి 699 కోట్లకు పెరిగినట్లుప్రకటించింది. ఇక లీజు రెంటల్ డిస్కౌంటింగ్ పోర్టుఫోలియో, కమర్షియల్ రెంటల్ ఆదాయం వంటివి శరవేగంగా పెరుగుతున్న విభాగంగా మారాయి. వార్షికపద్ధతిలో 44శాతంపెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ ప్రమాణాల్లో మొత్తం 44శాతం వాటా కమర్షియల్ అద్దె రాబడులే ఉన్నాయి.

## 65శాతానికి ఎయుస్మాల్ లాభం

**ముంబయి, ఏప్రిల్ 27:** ప్రైవేటురంగంలోని ఎయుస్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 65శాతం నికరలాభాలను పెంచుకుంది. అంతేకాకుండా బ్యాంకు ప్రతి వాటాకు ఒకరూపాయి డివిడెండ్‌ప్రకటించింది. రానున్న వాటాదారుల సర్వసభ్యసమావేశంలో ఆమోదించాల్సి ఉంటుంది. ఎజిఎంలో ఆమోదించిన తేదీనుంచే పంపిణీ జరుగుతుందని బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజిలకు ఫైలింగ్ ఇచ్చింది. బ్యాంకు నికరలాభాలు రూ.504 కోట్లనుంచి రూ.832 కోట్లకు పెరిగాయి. నికరవడ్డీ మార్జిన్ కూడా 23శాతంపెరిగి రూ.2582 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదేకాలంలో రూ.2094 కోట్లుమాత్రమే ఉన్నాయి. స్థూల నిరర్ధక ఆస్తులు కూడా మొత్తం అడ్వాన్సుల్లో 2.03శాతంగా ఉంది. గత త్రైమాసికంలో 2.3శాతంగా ఉన్నవి గణనీయంగా పెరిగాయి. నికర నిరర్ధక ఆస్తులు కూడా 0.74శాతానికి తగ్గాయి. కేటాయింపులు కూడా 635 కోట్లనుంచి రూ.269 కోట్లకు తగ్గించింది. నిర్వహణ లాభం కూడా 4.6శాతంపెరిగి రూ.1352 కోట్లుగా ఉంది. అలాగే కంపెనీ గౌరవ్‌జైన్‌ను చీఫ్‌ఫైనాన్షియల్ అధికారిగా నియమించింది. త్రైమాసిక ఫలితాల వెల్లడితో బ్యాంకు షేర్లు 2.13శ్శాతం తగ్గాయి. రూ.832వద్దనే కొనసాగాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీలో మాత్రం 0.81శాతం పెరిగినట్లు తేలింది.






## సన్‌ఫార్మా షేర్లు 35వేల కోట్ల వృద్ధి

**ముంబై, ఏప్రిల్27:** అమెరికన్ ఫార్మా సంస్థ ఆర్గానన్‌ను సుమారు రూ.1 లక్ష కోట్లతో కొనుగోలు చేస్తున్నట్లు మార్కెట్‌ప్రచారం రావడంతో సన్ ఫార్మా షేర్లు మార్కెట్లో రాకెట్‌లా దూసుకుపోయాయి. ఈ డీల్ బయటకు రాగానే సోమవారం ట్రేడింగ్‌లో సన్ ఫార్మా షేర్లు ఒక దశలో 9 శాతం వరకు లాభపడ్డాయి. రూ.1632.50 వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైన ఈ కంపెనీ షేర్, మధ్యాహ్నానికి రూ.1,766.65 గరిష్ట స్థాయిని తాకింది. మార్కెట్‌ముగిసే సమయానికి దాదాపు 7శాతం లాభంతో రూ.1,733.15 వద్ద ట్రేడ్ అయింది. రాన్‌బాక్సీని కొనుగోలు చేసిన సన్ ఫార్మాకు, ఈ ఆర్గానన్ డీల్ అంతర్జాతీయంగా మరింత బలాన్ని ఇస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా. ఈ కంపెనీ షేర్ల ధర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ భారీగా పెరిగింది. గత వారం మార్కెట్ ముగిసే సమయానికి ఈ కంపెనీ విలువ రూ.3,88,715.97కోట్లు ఉండగా సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో ఇది ఏకంగా రూ. 4,23,917.44 కోట్లకు చేరింది. అంటే కేవలం ఒక్క రోజులోనే కంపెనీ విలువలో రూ.35,201.47కోట్ల పెరుగుదల కనిపించింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్స్ డేటా ప్రకారం సన్‌ఫార్మా ఫౌండర్ అండ్ ఎండీ దిలీప్ సంఘ్వీ వ్యక్తిగతసంపద 1.6బిలియన్ డాలర్లు (15వేల కోట్లు) పెరిగింది. మొత్తం నికర ఆస్తివిలువ 24.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో గ్లోబల్ ఫార్మా మార్కెట్లో సన్‌ఫార్మా తన పట్టును పెంచుకోవడానికి ఈ లక్ష కోట్ల రూపాయల డీల్ కీలకం కానుందని సమాచారం. అమెరికా మార్కెట్లో తన ఉనికిని చాటుకోవడంతో పాటు, కొత్త ఉత్పత్తుల తయారీలో కంపెనీకి ఇది మేలు చేస్తుందని విశ్లేషిస్తున్నారు

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No. 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps